UNIVERSAL LIBRARY
OU_204222
UNIVERSAL LIBRARY

OUP—552—7-7-66—10,000

OSMANIA UNIVERSITY LIBRARY

Call No T831 / V44N Accession No T2804

Author వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి, పింగళి

Title నవకథామంజరి

This book should be returned on or before the date last marked below

నవకథామంజరి

:: కర్త ::

పెండ్యాల వేంకటసుబ్రహ్మణ్యశాస్త్రి

పిఠాపురము

శ్రీ విద్వజ్జనమనోరంజనీ ముద్రాక్షరశాలయి

ముద్రింపఁబడియె

1942

సర్వస్వామ్యసంకలితము]

[వెల రు.

విషయసూచిక.

1 కృతి.
2 ఉపోద్ఘాతము.
3 ఆంధ్రుల దాయాదుఁడు. 1
4 త్రిలింగదేశపు మహారాణి. 10
5 ఆంధ్రపిత, 28
6 వరరుచి. 42
7 కుమారిల భట్టాచార్యుఁడు. 76
8 తెలుఁగునాఁటి తురుష్కయోగి. 87
9 ఆంధ్రగాయకుఁడు. 97
10 ప్రాచీనాంధ్రవర్తకుఁడు. 109
11 శ్రీశైల మల్లికార్జునుఁడు. 187

ఉపోద్ఘాతము

స్వదేశ స్వజాతి స్వసంప్రదాయాచారాదులఁ దెలిసికొనుట ప్రతి వ్యక్తికి నత్యావశ్యకము. ఇట్లు తెలిసికొనుటచేతనే దేశాభిమానము, జాత్యభిమానము, కిలిగి పురోభివృద్ధికి హేతు వగును. కాని మనదురదృష్టవశమున నన్యదేశేతరపరిపాలక పరిపాలితుల మగుటచే నన్యజాత్యాచారములు, విద్యలు, స్వసంఘమునఁ బ్రవేశించి, యేది స్వజాత్యాచారమో, యేదిపరజాత్యాచారమో తెలియకుండఁగ వ్యవహరింపఁబడుట కలుగుచున్నది ఇందులకుఁ గొంత పరజాతివిద్యాభ్యాసముకూడఁ దోడగుచున్నది స్వాచారములలోఁ గొన్ని దేశకాలపరిస్థితులచే నయుక్తములుగాఁ బరిగణింపఁబడుటయుఁ, బరాచారము లాచరణయోగ్యములై యుత్తమములుగా నుండుటయు, స్వాభావికము నే నిపుడు వ్రాసిన "నవకథామంజరి"లోని గాథలు కొంతవఱకుఁ బ్రాచీనభారతీయచరిత్రను—అందు ముఖ్యముగా నాంధ్రుల చరిత్రను—వెల్లడి చేయఁగలవు. ఆయాగాధలలోని ముఖ్యాంశములఁగూర్చి క్లుప్తముగా నిట వివరించుచున్నాను.

మొదటికథ (ఆంధ్రులదాయాదుఁడు)

ఈకథకు "ఐతరేయబ్రాహ్మణము, ఋగ్వేదప్రథమమండలములోని కొన్నిసూక్తములు నా కాధార మైనవి. ఈగాథ నే నింతకుముందు (1917 సం॥లో) వ్రాసిన 'రాజసూయరహస్యము' లోనిదానిలో స్వల్పము లగు నంశములను మాత్రము మార్చి

కూర్చితిని. ఈకధవలనఁ బ్రాచీనకాలమునఁ జేయఁబడు 'రాజసూయయాగము' మతవిషయకమై, నాఁడు ప్రశంసనీయమైనను నేఁటి వారి కది ఘోరకృత్యముగాఁ గాన్పించును అందువల్లనే కాలాంతరమున నారాజసూయాది హింస్రకయజ్ఞములు ప్రభువులచేతను, ప్రజలచేతను మానుకొనఁబడెను "నరమేధయాగము"న నన్నిసంఘములనుండియు స్త్రీలు, పురుషులుగూడ 186 మంది యూపస్తంభములకు బంధింపఁబడుదు రనుటకంటె నేఁ డీపె ఘోరతమ మగు కార్య మగును ?

ఆనరమేధయాగము నీకలియుగమునఁ గడపటిసారి యొనర్చిన మహారాజు విష్ణుకుండినవంశములోని 'రెండవమాధవవర్మ' (క్రీ॥శ॥ 560–615 సం॥రం) ఈయంశ మాతని మనుమఁ డగు 'ఇంద్రభట్టారకుని' శాసనముచేఁ దెలియనగును

నరమేధయాగపుటంశములు గల 'తైత్తిరీయబ్రాహ్మణభాగము'ను పిశాచములు పోవుటకుఁ బిశాచగ్రస్తులకెడ 'పారాయణము' చేయించుట కలదు 'సున్నాలవన్నము' అను తైత్తిరీయబ్రాహ్మణభాగము (3-4)లోని "బ్రహ్మణే బ్రాహ్మణ మాలభతే" మొదలగు హననక్రియా వాక్యములచేఁ బిశాచములు జడిసి పారిపోవుననిపూర్వులనమ్మకము నరమేధయాగక్రియవంటిదే రాజసూయములోని 'రాజవిశసనము'నగు మనుష్యవధవిశసనమునఁ జేయఁబడువిధులు. 'విద్యారణ్యభాష్యము'నను, శ్రీమద్రామాయణమునందలి బాలకాండములోని శునశ్శేపగాధలోను, దానివ్యాఖ్యలలోను జూడనగును. 'శునశ్శేపుఁడు' దేవరాతుఁడు' అను నామాంతరము

గల వానివలననే మనయాంధ్రజాతి శాపతప్తమయ్యె నను నంశమే యీకథలోని ముఖ్యాంశము. ఆంధ్రు లార్యఘ్నుల యాశ్రమప్రాంతములనుండు సనార్యు లనియు, వారు పుళింద, శబ,రాదులలో నుండు నొకతెగవారనియుఁ, గాలాంతరమున వా రధికులై మహాసామ్రాజ్యమును నిర్మించిరనియుఁ గొందఱుడు. ఆంధ్రు లార్యేతరులు కారు, ఆర్యులే, వా రార్యావర్తము, గంగా యమునా నదీ ప్రాంతములనుండి యెపుడో యేలాగో దక్షిణహిందూదేశమునకు వచ్చి రాజ్యస్థాపన మొనర్చిరని మఱికొందఱుడు. ఆంధ్రు లార్యులే కాని, వారిప్రాచీనస్థానము కృష్ణా,గోదావరీనదీమధ్యభాగమే యనియు, అచటనుండి మహారాష్ట్ర,మాళవాది దేశములను జయించి యేలిరని వేఱుకొందఱుడు, వాదోపవాదము నొనర్చుచు, ఖండన మండనములఁ జేయుచున్నారు. ఆంధ్రులఁగూర్చి చెప్పినప్రాచీనగ్రంథము ఐతరేయబ్రాహ్మణము[1] పిమ్మటివి పురాణశాసనాదులును. కాన నాదిమమైన యైతరేయబ్రాహ్మణ మేమి చెప్పుచున్నదో పరిశీలింతము.

1 "ఆవిశ్వామిత్రునకు నూర్గురుపుత్రు లుండిరి వారిలో మధుచ్ఛందుని కంటెఁ బెద్దవా రేఁబదిమందియుఁ, జిన్నవా

---

1 తస్యహ విశ్వామిత్రస్యైకశతం పుత్రా ఆసుః పంచాశ
దేవ జ్యాయాంసో మధుచ్ఛందసః పంచాశత్కనీయాంస
స్తద్యే జ్యాయాంసో న తే కుశలం మేనిరే, తాననువ్యాజహా
రాంతాన్వః ప్రజా భక్షీష్టేతి.
త ఏతేంధ్రాః పుండ్రాః శబరాః పుళిందా మూతిబా ఇత్యుదం
త్యా బహవో భవంతి వైశ్వామిత్రా దస్యూనాం భూయిష్ఠాః॥
ఐతరేయబ్రాహ్మణ, 7-3-18.

రేఁబదిమందియు నైరి. అందులోఁ బెద్దవారగు నేఁబదిమందియు క్షేమమును బొందరైరి (శునశ్శేపుని జ్యేష్ఠునిగా నంగీకరించి దాయభాగమిచ్చుట కిష్టపడనందున) అట్లుకుశలము నొందని 'ఆంధ్రులు, పుండ్రులు, శబరులు, పుళిందులు, మూతిబులు' నను నైదుతెగలవారిని గూర్చి విశ్వామిత్రుఁడు మీరు ప్రజాభక్షకు లగుదురుగాక అని శపించెను. అట్లు శప్తులగువారు దస్యులలోఁ బెక్కండ్రైరి

(మధుఛందునికంటెఁ జిన్నవారగు, అష్టక, రేణుక, ఋషభ' అనుసంఘములలోని నేఁబదిమందియు, శుభసుఖముల నొందిరని 'యైతరేయబ్రాహ్మణము'లో నీవాక్యముకంటెఁ బూర్వవాక్యమున నే జెప్పఁబడెను) ఈకథయే వాల్మీకిరామాయణమున నిట్లు స్వల్ప భేదముతో నుడువఁబడెను

విశ్వామిత్రుఁడు తాను దప మాచరించు 'శరావతీ' నదికి దక్షిణప్రదేశమునందు 'త్రిశంకునకు' సశరీరస్వర్గ మిప్పింప యత్నించి యది నెఱవేఱక విఘ్నము నొందగా విచారించి యాప్రదేశమును విడిచి పశ్చిమాభిముఖుఁడై 'పుష్కర'తీర్థముఁజేరి యటఁ దప మొనర్చుచుండెను.

1 ఆకాలముననే యయోధ్యాధిపతి యగు 'అంబరీషుఁడు యజ్ఞ మొనర్చుచుండఁగ నాతనియాగపశువు నింద్రుఁ డపహరింప

---

1 అంబరీషునకు 'హరిశ్చంద్ర' నామముకూడ నుండెనని రామాయణ వ్యాఖ్యాత వ్రాసెను. మాకథ శ్రీమద్రామాయణము బాలకాండమున 60 సర్గలోఁ గలదు.

రాజు పురోహితోపదేశముచే, నరపశువుకై యత్నించి 'శునశ్శేపుఁడు' అనువానిని గొనితెచ్చుచు మార్గమధ్యమునం దుండిన విశ్వామిత్రాశ్రమమునందు విశ్రాంతి పొందుచుండఁగా, 'శునశ్శేపుఁడు విశ్వామిత్రునిం జేరి తనవృత్తాంతముఁ జెప్పి, నన్నురక్షింపు మనెను. విశ్వామిత్రుఁడు శునశ్శేపుని రక్షింతునని మధుచ్ఛందాదులగు తనపుత్రులలో నొకనిని శునశ్శేపునకుఁ గాను, నంబరీషునియజ్ఞమునకుఁ బశువుగాఁ బొం దన, వా రామాటలకు రోసి, "శ్వమాంసము" దినుటవంటిమాటను జెప్పితివి దీని నెట్లు చేయఁగలమన, నామాట కెదు రాడితిరిగాన మీరు కుక్కమాంసమునే దినుచు వేయివత్సరములు పరివర్తింతురుగాక ! యని శపించెను శునశ్శేపునకు రెండుమంత్రముల నుపదేశించి వీనిని బఠించితివేని దేవతలు నిన్ను 'యూపస్తంభమునుండి' విడిపింపఁగల రని చెప్పి పంపెను

పైగాథాంశములఁ బరిశీలింపఁగా విశ్వామిత్రుఁడు తనపుత్రులగు నూర్వురను 'పుష్కర' తీర్థమునఁ దపం బొనరించుకాలమున శపించెనని స్పష్టమగును కాన, నాంధ్రుల యాదిమస్థలము పుష్కరతీర్థమే. వేదవాక్యమువలన నాంధ్రాదు లేఁబదిమందియే శప్తులై రని కలదుకాని, రామాయణగాధవలన వైశ్వామిత్రులు నూర్వురు, వేయివత్సరములే శాపబాధ నొందువారుగా శపింపఁబడి రని కలదు. ఇది నిజమై యుండును. కారణ మేమనఁగా నెట్టిశాపమునకైనను, ఏనాఁటికైనను శాపవిముక్తి కలుగుట, శపించినవా రనుగ్రహించుటచేతనో, శప్తవ్యక్తి యొక్క తపశ్చరణాదులచేతనో నగుట సర్వసాధారణము.

కాన, నాంధ్రులును గాలాంతరమున శాపవిముక్తి యౌన్నత్యము నొంది యుండుట తప్పక దగు మధుఛందుఁడు ఋగ్వేదమహర్షులలో నగ్రగణ్యుఁడు అతనిసూక్తములు, మంత్రములు, పెక్కులు ఋగ్వేదమునఁ గలవు మధుఛందుఁడు గాక యతనికంటెఁ బెద్దవారే శపింపఁబడిరను వాదము నంగీకరించినను, పుండ్రజాతీయుఁడగు పౌండ్రవాసుదేవుఁడు శంఖ,చక్రాదిచిహ్నములను ధరించి శ్రీకృష్ణునంతటివానితో డీకొనఁ గడఁగెను శబరులలోనె తాంత్రికవిద్య (శాబరము) వృద్ధి నొందెను పూర్వమీమాంసాసూత్రములకు భాష్యము వ్రాసినయాతఁడు తాను "శబరస్వామి" యని వ్రాసికొనుట గౌరవాస్పదముగానే తలఁచెను ఆంధ్రులవ్యాప- ప్రవర్తనగౌరవాదుల ఆపస్తంబునికథాసందర్భమున వివరింపఁబడును

రెండవకథ (త్రిలింగదేశపుమహారాణి)

ప్రసిద్ధిఁగాంచిన కాకతీయసామ్రాజ్యమునందు రుద్రాంబ సుప్రసిద్ధ. స్త్రీపరిపాలకులలో దక్ష యని, యనేకగాథలు దేశదేశములనున్వ్యాపించి యున్నవి. అట్టివానిలో రుద్రాంబ యెట్లు 'కంటకపరిశోధనము చేసి ప్రజాపరిపాలనము చేసెనో, సంసారుల కిక్కట్లుఁ గాకుండ నెట్లు చేయుచుండఁగ నొనర్చెనో, సుస్పష్టముగాఁ జెప్పఁబడెను. ఈ కథలోని యంశములను 'శ్రీ మాడపాటి హనుమంతరావు పంతులుగారింపుగా' భాషావైచిత్రితోఁ జిత్రించి యున్నారు. నవకథామంజరిలోని తొమ్మిదిగాథలలో నీకథయు, 'వరరుచి'గాథయు,

మత్కృతములు గాకుండినను. హృదయంగమము లగుటచేతను, విడువరాని వగుటచేతను వారియనుమతిపై నిందుఁ జేర్చితిని

మూఁడవకథ (ఆంధ్రపిత)

లోకమునం దొక్కొక్క జాతికిని, జాతియందలి భిన్నసంఘములకును వేర్వేఱు సాంప్రదాయము లుండును అవి — కన్ను, ముక్కు, తల — మొదలగు నవయవరూపములవంటివిగాక 'పితృ, పితామహ, ప్రపితామ'హాదులవలన, అనూచానముగా సంప్రాప్తమైన 'నిత్యనైమిత్తిక గృహ్య'కర్మములు వీనిచే నజాతియో నిర్ణయించుట సులభము స్వజాత్యభివృద్ధికై యాజాతి సాంప్రదాయముల నేర్పఱచిన యామహామహుఁ డాజాతికిఁ బిత యనుట యుక్తము కాదా? కారణ మేమన, తండ్రి బిడ్డలపురోభివృద్ధిఁ గోరి వివాహాదిక్రియలఁ జేయించినట్లే, జాతికిఁ బిత యగునాతఁడును స్వసంఘాభివృద్ధికై యెన్నియో నిత్య నైమిత్తిక, క్రియాకలాప విధుల నేర్పఱచును అందుఁ గొన్ని దేశకాలపరిస్థితులచే మారుట స్వభావ మని మున్నే చెప్పితిని పై కారణములచే నాంధ్రపిత యెవ్వఁడో యాతని నివాసాదు లెక్కడివో విమర్శింపవలసి యున్నది వైశ్వామిత్రు లగు నాంధ్రులలోఁ బ్రాచీనయుగముననే బ్రహ్మ, క్షత్రియ, వైశ్య శూద్ర, సంఘము లేర్పడెను పైనాల్గు సంఘములకు—గృహ్యకర్మములలో—ముఖ్యములగు (1) వివాహ శ్రాద్ధకర్మములు మాత్రమే నేఁటికిని నిలిచి. ఆపస్తంబమహర్షి

1 ఆపస్తంబీయులు శ్రాద్ధక్రియ లొనర్చుటలో 'భరద్వాజ' సూత్ర

చెప్పినవిధుల ననుసరించి, సమంత్రకముగానో, అమంత్రకమ గానో చేయఁబడుచున్నవి. అతనివిధుల ననుసరించియే కర్మమ లొనర్చి యాంధ్రుల మగు మన మభివృద్ధి నొందితిమి గాన ఋ కాతఁడు పిత. అట్టి మనయాంధ్రజాతియొక్క పిత, విశ్వామిత్ర క్షేత్రమగు 'పుష్కర'తీర్థమునకు సమీపమున నుండవలెనుగదా!

విశ్వామిత్రబహిష్కృతులగు నాంధ్రులు 'పుష్కర'తీర్థము నుండి నానాదిశలకుఁ బోయినపిమ్మటఁ గొందఱు ఆరావళీ పర్వత శాఖగా దలంపఁబడు 'పారియాత్ర' పర్వతప్రదేశముఁ జేరిరి అందుచేతనే 'పారియాత్రమున' నాంధ్రు లుండిరని కూర్మపురాణ మునం గలదు కొందఱు 'కరూశ'దేశమును, బ్రవేశించుటచే నాం ధ్రుఁడగు 'చాణూరుఁడు' కరూశమున జన్మించె నని హరివంశ మునఁ గలదు మల్లుఁ డగు నాచాణూరుఁడే కంసునిచే శ్రీకృష్ణుఁ జంపింప రప్పింపఁబడి వానిని శ్రీకృష్ణునిపైఁ బురికొల్ప శ్రీకృష్ణుఁ డాచాణూరుం జంపెననియు 'హరివంశము'ననే గలదు. ('కరూశ'దేశము 'గంగా' నదీ పరిసరమునందు 'అయోధ్యా, మిథి లాపురీ' మార్గమధ్యమున నుండెనని శ్రీమద్రామాయణములోని బాలకాండమునఁ గలదు) శూద్రుఁడు భృత్యుఁడునైన 'సింధుబుఁ డను నాంధ్రుఁడు 'మగధ' దేశపాలకుఁడు కాణ్వాయనుఁడు నగు

ముల ననుసరింతురు ఆపస్తంబుఁడు, తన శిష్యుఁడగు భారద్వాజునిచే నంతే ష్టికకర్మసూత్రములను రచింపఁజేసె నని పెద్దలు చెప్పుదురు

'సుశర్మ' యను 'బ్రాహ్మణరాజుం' జంపి యారాజ్యము నాక్రమించె నని 'విష్ణు, వాయు, మత్స్య, భాగవతాది పురాణములు చెప్పు చున్నవి

పై కారణములచేఁ బ్రాచీనకాలమున నాంధ్రు లార్యావర్త నివాసులేగాని నేఁటి యాంధ్రదేశవాసులు కారని తెలియనగును. ఆంధ్రపితయు నచ్చటివాఁడే యగుటలో నాశ్చర్య మేమి ?

ఆంధ్రపిత యగు నాపస్తంబుని విధుల ననుసరించి నేఁటి యాంధ్రావనిలోని "బ్రాహ్మ క్షత్రియ వైశ్య శూద్ర" సంఘములలో నూటి కెనుబదిమంది వివాహాదివిధులఁ జేయుచున్నారు గాన, ఆపస్తంబుఁ డాంధ్రదేశమున నొక్కెడ జన్మించి యుండు నని కొందఱు చరిత్రకారు లభిప్రాయపడుచున్నారు. కాని యాచారిత్రకులే ఆపస్తంబుని క్రీ. పూ 4, 5 శతాబ్దముల నాఁటివాఁడుగాఁ దలఁచుచుండుటచే నది యెట్లు పొసఁగును ? ఏలయన దేని నిపుడు మన మాంధ్రదేశ మనుచుంటిమో యది, క్రీ. శ. 2 వ శతాబ్దము వఱకు నాంధ్రసంజ్ఞ నొందలేదు. ఆంధ్రప్రభువులగు 'శాతకర్ణుల' పాలనముచేతనే యాంధ్రసంజ్ఞ పెరిగెను. అది యంతకుముందు "కళింగ, తెలుఁగు, వేఁగి, [1] ఓఢ, ములకి' రాష్ట్రములు కలిగి యునా

1 'ఓఢ' శబ్దములోని 'ఢ'కారమును 'ళ'కార సన్నిహితస్థానమునఁ బుట్టున ట్లుచ్చరింపవలెను. అట్లే 'కళింగ' శబ్దములోని 'ంగ' 'జ్ఞ' సన్నిహిత స్థానమున నుచ్చరింపవలెనఁట! 'తెలుఁగు, ములక' శబ్దములు 'త్రిలింగ' 'మల్లక' శబ్దభవములు అనియు, 'తెలుఁగు, ములక' శబ్ద సంస్కృతీకరణమే 'త్రిలింగ, మల్లక' శబ్దము లనియు నవీనపరిశోధకుల తలంపు, ములకనాఁడు ములికినాఁడై, మురికినాఁడుగా నేఁడు ప్రాగాంధ్రులనుట కాస్పద మైనది

ద్యులగు "కాళింగ, తెలుఁగు, కోయ, చెంచు, లంబాడి, ఎరుక, యానాది, మాల, మాదిగ" మొదలగు విభిన్నజాతులతోఁ గూడి యున్నది.

కాలాంతరమున నా యనార్యజాతులవా రాంధ్రు లనిపించుకొనిరి. కాని వారి మొదటిభాషయగు తెనుఁగు (తెనుఁగు పైశాచీ భాషాభేదము) ఆంధ్రుల సంస్కృతప్రాకృతభాషలతో మిశ్రితమై యాంధ్రమనికాని, తెనుఁ గనికాని వ్యవహరింపఁబడెను. భిన్నజాతులొక్కచోటునకుఁ జేరినపు డందు బలవత్తరమైన జాతియొక్క నామముతోఁ దమజాతికిని భాషకును దేశమునకును బేరు నుంచుకొనుట లోకమునఁ గాంచుచుందుము. ఇది యింగ్లండు, అమెరికా, కనడా, మొదలగు దేశముల చరిత్రలఁ జదివినవారికిఁ దెలిసినదే. కాని యిప్పటి యాంధ్రదేశమునం దాంధ్రజాతికంటెఁ దెనుఁగు జాతులవారే హెచ్చుగ 'రాజరాజనరేంద్రుని' కాలమునం దుండుటచే మహాభారతగాథలయందత్యాదరముగల యాప్రభుఁడు నన్నయ మహాకవిని భారతము బహుళసంఖ్యాకులగు తెనుఁగువారికిఁ బ్రీతి గలిగింపఁ దెనుఁగు జేయుమనెను. భారతదేశాన నాఁటికాలమున సంస్కృతమే హెచ్చుగ గ్రంథకర్తలచే వాడఁబడుచుండుటచే నన్నయచేఁ దెనిఁగింపఁబడుటలో సంస్కృతమే హెచ్చుగఁ జేర్ప

ద్వీపాలలో మిక్కిలినాఁటివారు, బెలగాం జిల్లాలో కొందరు నైజాం రాజ్యమున తెనుఁగువారనువారు 'ముత్తరాసులు' సన్నితులు ఉన్నారు. ఆంధ్రగ్రంథములలో క్రీ. శ. 13 వ శతాబ్దివఱకు త్రిలింగశబ్దము లేదు.

బడెను దానిఁజూచి యది యాంధ్రీకరణమని (సంస్కృతమెక్కు డై తెనుఁగుతక్కువగుటచే) తిక్కనమహాకవి "నన్నయ యాంధ్ర కవిత్వవిశారదుఁ"డనియు నేను తెనుఁగుఁ జేసెదననియు" 'విరాట పర్వాదిని' జెప్పెను. ఆంధ్ర తెనుఁగు శబ్దములే సంస్కృత, సం స్కృతేతరభాషల రూపములను స్పష్టపఱచుచున్నవి. 'ఆంధ్రపిత చెప్పిన 1 వివాహాదివిధులు తెనుఁగుజాతులలో లేవు ఆగుర్తుల చేతనే, ఆంధ్ర, తెనుఁగుజాతులఁ దెలిసికొన వీలగును.

ఆంధ్రు లనఁబడు ద్విజులలోను గాలాంతరమున 'ఆశ్వలా యన, సాంఖ్యాయన, పారస్కర, విఖనసాది' భిన్నశాఖీయులు చేరి తాముసు సాంధ్రులుగా ననిపించుకొనుచున్నారు. 2

---

1 వివాహాగ్నిహోత్రము వేదోక్తముగానో, లౌకికముగానో, చేయు నప్పుడు ఒండొకరొండ రెండుగ్రుమునుంచి బంగరు తడిపిన నీరు పెండ్లికొడుకుపైఁ బడునట్లు చేయుట, 'సప్తపదక్రియ, అరుంధతీ దర్శనము' మొదలగునవి యు, మరణానంతరము (ప్రేతఁ) శ్రాద్ధపిండప్రదానము, ఎట్టిను జందెముపలె కట్టుకొనుట అన్న (లేక) 'ఆమ' (శ్రాద్ధాదులు' ఆపస్తంబీయులగు నాంధ్రు లలోనె కలవు తెనుఁగుజాతులలో నట్టిక్రియలు లేక వేర్వేఱు విధులున్నవి.

2 మహమ్మదు గజనీదండయాత్రలచే నుత్తరహిందూదేశమున నుండ వెరచి, యానాఁడు కాశి మొదలగుచోటులనుండి 'ఆశ్వలాయన' సూత్రకు లీయాంధ్రావనికి వలస వచ్చిరని డాక్టర్. కృష్ణస్వామి అయ్యంగారు వ్రాసి యున్నారు. వారిలో నండవరీకు లనఁబడువారు ముఖ్యులు అలసాని పెద్దన్న మహాకవి యాశాఖీయుఁడే 'నందవరీకచరిత్ర' పైయంశమును వేఱువిధ ముగాఁ జెప్పుచున్నను వలస వచ్చుటను మాత్రము స్థిరపఱచుచున్నది.

మహర్షులలోఁ గొందఱు తమ నివాసాదులను, తమరు గ్రంథములను రచించిన ప్రదేశములను. తమ గ్రంథములఁ బేర్కొందురు, వ్యాసుఁడు భారతమును హిమాలయమున రచించి నట్లును 'యాజ్ఞవల్క్య, పులస్త్య, దేవల' స్మృతికర్తలు, తాము 'మిథిలాపురి,కురుక్షేత్రము, సింధునదీతీరప్రదేశములందుండి, తమ స్మృతులఁజెప్పినట్లును నుడివిరి మఱికొందఱు గ్రంథకర్తలు, స్వస్థలములను స్పష్టముగా జెప్పకుండినను, ఎట్లో తమప్రదేశస్థితిని స్వగ్రంథముల సూచింతురు మనుస్మృతికర్త 'గంగా, యమునా' నదుల మధ్యప్రదేశాచారమే యోగ్యమనుటయు, 'కాళిదాస' మహాకవి 'మేఘసందేశ' కావ్యమున ' ఉజ్జయినినగరము ' తా వర్ణించు మార్గమునకు దూరమున నుండినను, నెటులనో కల్పించి దానివి మిగుల వర్ణించుటయు దీనికి నిదర్శనములు

పై రీతినే 'యాంధ్రపిత'యుఁ దాను యమునానదీ పరిసరము నందలి 'సాల్వ'దేశమును, తన గృహ్యసూత్రములలోఁ జెప్పి తన ప్రదేశమును సూచించెను దాని కనుగుణముగ నొకమంత్రముఁ గూడఁ 'ఏకాగ్నికాండము'నఁ జేర్చెను దాని నిట వివరింతును. 1 'సీమంతోన్నయన'కర్మమునందు (గర్భవతియగు స్త్రీకి నాల్గవమాసమునఁ జేయఁబడు నొకకర్మము) "వీణాగాయకుల నిద్దఱను గానముచేయుఁ దనవలెను. ఆగానమున ముందు చెప్పఁబోవు రెండు

---

1. సూ॥ వీణా గాథినౌ సగ్ంశాస్తి

ఉత్తరయోః పూర్వ్యా సాల్వానాం బ్రాహ్మణానామితరా॥

నదీనిర్దేశశ్చ యస్యాం వసంతి॥ ఆపస్తంబగృహ్యసూ॥

పటల. 6 ఖండ. 14

మంత్రములలోను మొదటిమంత్రము 'సాల్వ' దేశీయులకు మాత్ర
మే. రెండవమంత్రము బ్రాహ్మణు లందరికి నగును. ఏనదీ సమీప
మున వసించుచుందురో యానదిని బేర్కొనవలెను."

ఇందు సాల్వదేశీయుల కొకమంత్ర మాపస్తంబునిచే
వేఱుగఁ జెప్పఁబడెను చెప్పఁబోవు రెండుమంత్రాలలోఁ బూర్వపు
మంత్రము 'సాల్వుల' దని. ఏ యితరగృహ్యసూత్రకర్తయు నీ
సందర్భమునఁ జెప్పలేదు అందులకు నిదర్శనముగా 'ఆశ్వలా
యన, పారస్కర' గృహ్యసూత్రాంశముల నిందువ్రాయుచున్నాను.

"సోమను" రాజును గానము చేయుఁ దని (పురోహితుఁడు)
ఇద్దఱు వీణావాదకుల కానతిచ్చును."

"సోమరాజు మనుష్యులను రక్షించుగాక యనియు, తమ
తమ వృత్తులలో నేనది ననుసరించి యుందురో యానదిని గూడఁ
బేర్కొనవలెను"

2 "వీణావాదకుల నిద్దఱను గానము చేయుఁడని యాజ్ఞా

---

1. సూ॥ వీణా గాథినౌ సగ్ంశాస్తి సోమంరాజానం సంగాయతమితి॥
సోమో రాజాఽనతు మానుషీః ప్రజా వివృత్తచక్రాఽసావితి
యాంనది ముపవసితా భవంతి।

ఆశ్వలాయన గృహ్య సూత్ర 1-15-19

2 సూ॥ వీణాగాథినౌ, రాజానగ్ం సంగాయేతాం, యో
వాప్యన్యో వీరతార ఇతి॥ నియుక్తా వప్యేకో గాథా
ముపోదాహరతి॥ సోమఏవనో రాజేమా మానుషీః
ప్రజా, అవిముక్తచక్రా ఆసీరంస్తే తుభ్యమసావితి ॥
యాం నదీ ముపవసితా భవంతి ॥

పారస్కర గృహ్య సూత్ర. 1-15

పింపవలెను అం దెవఁడైన నొకఁడు వీరునిగూడ గానముచేయ వలెను. మఱియొకఁడు సోముఁడే మామనుష్యులకు రాజనియు, ఏనది నాశ్రయించి యుందురో దానిని బేర్కొనుచు నీతీరమున నానావృత్తులను నిర్వహింపుచు నున్నారమనియు గాన మొనర్ప వలెను ''

ఆపస్తంబుఁడు, సాల్వదేశీయుల కని ప్రత్యేకించిన మంత్రముయొక్క యర్థము గనుఁడు.

1. ''ఓయమునా ! నీతీరమునందు 'సాల్వ' దేశప్రజలు వివిధ వృత్తులను నిర్వర్తింపుచున్నవారై (లేక సుభద్రముగఁ దిరుగుచున్నవారై) ''యౌగంధరియే మారాజు అని గానముచేయుచున్నారు''

2. 'మాకు సోముఁడే రాజని' యోయమునా ! నీ తీరమునందు బ్రాహ్మణస్త్రీలు నిర్వర్తించిన పనులు గలవారై గానము చేయుచున్నారు''

పై మంత్రములలో రెండవ మంత్రమును ''సూత్రకారు'' లందఱును జెప్పిరి. గాని మొదటిమంత్రము నెవరును జెప్పలేదు.

3 'పండితసార్వభౌమ … చిన్నస్వామిశాస్త్రిగారు'' ఇతర సూత్రకర్త లెవ్వరును జెప్పని సాల్వదేశప్రశంస గలసూత్రమును

---

1 మంత్రం యౌగంధరి రేవనో రాజేతి సాల్వీరవాదిషుః
వివృత్తచక్రా ఆసీనా స్తీరేణ యమునే తవ.

2 సోమఏవనో రాజేత్యాహుర్బ్రాహ్మణీః ప్రజాః
వివృత్తచక్రా ఆసీనా స్తీరేణాసౌతవ॥

3. చూ హరిదాస సంస్కృతగ్రంధమాలా ప్రచురణమగు, ఆపస్తంబగృహ్య సూత్ర. పీఠిక '

బురస్కరించుకొని ఆపస్తంబుడు సాల్వదేశీయుఁడే యగుననిరి. కాని పై మంత్రమును శ్రీశాస్త్రిగారు గుర్తింపలేము. 'యౌగంధరి రేవ నోరాజా' అను మంత్రమునుగూడ నాపస్తంబ ప్రోక్తమేయని నాతలంపు కారణ మేమన, ఆపస్తంబుడు వేదర్షియై తైత్తిరీయ సంహితాబ్రాహ్మణములతో, 'కారకములను' (కరర్షి ప్రోక్తములగు నెనిమిది కాండములను) ఏకాగ్నికాండమును గలిపి ప్రత్యేకవేద శాఖ నేర్పఱచి యున్నాఁడు. 1.

అందువల్లనే మహారాష్ట్రాదిదేశములలో, 'తైత్తిరీయ' వేద శాఖను 'ఆపస్తంబ' శాఖ యనియే చెప్పుదురు ఇంతమాత్రమె కాదు ఆపస్తంబునిచేఁ బేర్కొనఁబడిన 'యౌగంధరి' ప్రాచీన యుగములలోనివాఁడు కాఁడని ముందు సిద్ధియింపఁబడును మి త్రీయు ఋషులలో 'మంత్రర్షులని, కాండర్షులని, ద్వివిధములగు మహర్షు లుండినట్లు, 'యజుఃకారకములలోఁ గలదు. 2

ఇంతమాత్రమే కాదు. ఆపస్తంబమహర్షియే తనకాలము నందు "బ్రహ్మచర్యవ్రతలోపముచే వేదర్షులు పుట్టుచుండుట లేదనియు పూర్వకర్మఫలముచేఁ గొందఱుమాత్రము 'శ్వేతకేతువు వలె నిప్పుడును జన్మించుచున్నార'నియుఁ జెప్పెను 3.

'కొందఱు పుట్టుచున్నారు' అను కేచిచ్ఛబ్దమును 'భవంతి' అను వర్తమానార్థక క్రియను బ్రయోగించుటచే, తన కాలమునం

1 చూ భట్టభాస్కరకృతిమగు పరాయతభాష్యము 3_9

2 చూ యజుర్వేద కారకములు 4_1_1

3 ఆ ధ 1_2_5

దును, గొందరు పుట్టుటను స్పష్టపఱచెను. ఆకొందఱిలో నాపస్తంబుఁడును వేదర్షి యెట్లు కాఁడు ?

ఈ సందర్భములో డాక్టర్ బుల్హార్ దొరగారు, "కేచిత్తు భవంతి" అనువాని యర్థవైచిత్రిని గమనింపక 'ఆపస్తంబుని కాలమునకు వేదర్షుల కాలము దాఁటిపోయిన దని (తమధర్మసూత్రాంగ్లీకరణపీఠికలో) వ్రాయుట చింత్యము 1.

పాణినిమహర్షియుఁ దన యష్టాధ్యాయియందు 'తేనప్రోక్తమ్' అనుసూత్రము నధికరించి పెక్కండ్రు వేదకర్తల పేరులను నుడివెను. ఇంతమాత్రమేకాదు కాళిదాసు మహాకవియు 'వరతంతుమహర్షి' మంత్రములఁ జేయువారిలో నగ్రగణ్యుఁ డని తన రఘువంశ మహాకావ్యమునఁ గంఠోక్తిగఁ జెప్పియున్నాఁడు.

వేదము పరబ్రహ్మగతమె కాని మహర్షిప్రోక్తము కాదను వారికి, పై నిదర్శనములు విరోధించును. కాని, ఇందులకు విద్యారణ్యభాష్యమున 'సాయణాచార్యులవారు' కొంత వ్యవస్థ నేర్పఱచి

---

1 డాక్టరు బుల్హర్ (1880 సం॥ర ప్రాంతమున) ఆపస్తంబధర్మసూత్రములను, ప్రసిద్ధికెక్కిన మాక్సుమ్యులర్ (1870 సం॥ర మున) ఆపస్తంబ శ్రౌతపరిభాషను ఓల్డెన్బర్గు ఆపస్తంబ గృహ్యసూత్రములను (1865) ఆంగ్లీకరించిరి డాక్టరు 'వింటర్నిడ్జు' ఆపస్తంబ గృహ్యసూత్రములను 'హారదత్తుని' 'అనాకులా' వృత్తితో 'వియన్నా' పట్టణమందు నాగరలిపిలో ముద్రింపించెను పై నల్వురు జర్మను జాతిజులు

యున్నారు. 1. అదియంతయు నిట వివరింపఁ బనిలేదు గాని, ఆపస్తంబుఁడు 'యౌగంధరి' మహారాజును గూర్చి యొకమంత్రమును రచించె ననుటమాత్రము సత్యదూరము కాదు.

'యౌగంధరి' ఎప్పటివాఁడు ?

బుద్ధునకు సమకాలికుఁడై మగధదేశము నేలుచున్న 'అజాతశత్రు'ని పుత్రికయు, 'దర్శకుఁడు' అనువానికి సోదరియు నగు 'పద్మావతి'ని బెండ్లియాడిన 'ఉదయన' మహారాజునకు యౌగంధరాయణుఁడు, అనునాతఁడు మిత్రుఁడు మంత్రియు నై యున్నాఁడు 2. పాణినిమహర్షి తన యష్టాధ్యాయియందు 'అనంతరాపత్య' (కుమారుని తరువాత సంతతి) రూపనిష్పత్తులఁ గూర్చి చెప్పుచు 3'నడాదిగణము'నొకదానిని నుడివి యున్నాఁడు. ఆగణము నందు 'యుగంధర'శబ్దము కలదు దానివలనఁ 'యౌగంధరాయణ' రూపము కల్గును యుగంధరునిపుత్రుఁడు 'యౌగంధరి' అనురూపము, అపత్యసమాసముచే నేర్పడునుగాన, యుగంధరపుత్రుఁడు యౌగంధరి. ఆయుగంధరుని మనుమఁడు యౌగంధరాయణుఁడు అగుననుట సుస్పష్టము.

ఆయౌగంధరాయణుఁడు బుద్ధునకు సమకాలికుఁ డగుటచే

---

1 యజుర్వేదకాండకభాష్యము 4-1-1

(2) ఈయంశము క్రీ. పూ. 6,5, వ శతాబ్దములనాఁటి దని పరిశోధకులు నిర్ణయించిరి 'భాస మహాకవికృత' మగు 'స్వప్నవాసవదత్త, ప్రతిజ్ఞాయౌగంధరాయణ' నాటకములవల్ల నిది తెల్లమగును

3 సూ. నడాదిభ్యః ఫక్ నడ శకట జాలంధర యుగన్ధర బదర...నడాదిః 4-1-99

నాతని తండ్రియగు యౌగంధరిని, తన ఏకాగ్నికాండ మంత్రములలోఁ జెప్పిన 'ఆపస్తంబుఁడును' బుద్ధునకు నేఁబది యఱువది సంవత్సరములకుఁ బూర్వపువాఁ డగును. అందువలన నాపస్తంబుఁడు క్రీ॥పూ॥ ఏడవ శతాబ్దపువాఁ డగుట స్పష్ట మగుచున్నది.

కాని, ఆపస్తంబుని నివాస మేది ?

తనసూత్రములందును, మంత్రమునందును, యమునాతీరమునందలి 'సాల్వ' దేశమును జెప్పుటచే నాతఁ డాసాల్వదేశీయుఁడై యుండును. ఇట్లని శ్రీపండితసార్వభౌమ చిన్నస్వామిశాస్త్రిగారు గూడ ధ్రువపఱచిరి. సాల్వదేశము 'దేరాడూన్' జిల్లాలోని 'జాన్సార్ బావార్' అను ప్రదేశమని జయచంద్ర విద్యాలంకారులు వ్రాసిరి.

పై కారణములచే నేఁటి యాంధ్రదేశస్థుఁడే యాపస్తంబుఁడనువారి వాద మసాధ్య మగును. కాని సాల్వదేశీయుఁ డగు నాంధ్రుఁడుమాత్ర మగును. ఇందులకుఁ గారణము నింతకుఁ బూర్వమె చెప్పఁబడెను. విశ్వామిత్రుఁ డాంధ్రాదులను శపించిన "పుష్కరతీర్థ" మెచ్చటిది ? సాల్వదేశ మెచ్చటిది ?[1] ఆంధ్రుల ప్రథమస్థానమగు 'పుష్కర' క్షేత్రము నేఁడు 'పోకార' అను పేరితో రాజపుత్రస్థానమునందు 'అజ్మీరు' నకు సమీపమునఁ గలదని, 'రాప్సన్' దొరగారు పశ్చిమభారతదేశము నేలిన 'సహపాన'

---

1 సాల్వదేశ మెచ్చటిదనియు, దాని యిప్పటి పేరేమనియు, వాకబుచేసి పంపఁగోరుచు 'లీడర్' పత్రికాసంపాదకులగు సర్ చింతామణిగారికిని (అలహాబాదు) కాశీలోని భారతీయ విద్యాపరిషత్తున కధ్యక్షులగు, డాక్టరు బాబూ రాజేంద్రప్రసాదుగారికిని (పాట్నా) వ్రాసితిని. చింతామణిగారు తమ కస్వస్థతగా నున్నది గాన తెలియఁజేయఁజాలనని వ్రాసిరి. (26-9-40) డాక్టరు బాబూ రాజేంద్రప్రసాదుగారు తామీయంశముఁ గూర్చి

క్షేత్రపుని యల్లుఁడగు ఋషభదత్తుని' శాసనాదులను శోధించి వ్రాసియున్నారు. ఈ 'పౌఖార' తీర్థము ఋషభదత్తునినాఁడు (క్రీ. త రెండవశతాబ్దాదిని) పౌష్కర'తీర్థ మని పేరుగలదనియు 'పౌష్కర' పుష్కరశబ్దప్రాకృతీకరణమనియు దొరగారి తలంపు. 'పౌఖార' విశ్వామిత్రుని కాలమునుండి నేఁటివఱకు పుణ్యయాత్రాస్థానమే.

'పౌష్కర'తీర్థము 'ఆపస్తాఁటని సాల్వదేశమునకుఁ బశ్చిమముగా నిరువదియోజనముల దూరమునం దుండవచ్చును.

'సాల్వ'దేశము యమునానదీపరిసరదేశము అది భారతములోని 'అంబోపాఖ్యానము'వల్ల 'కాశీ, హస్తినాపురము'లకు నడుమనుండినట్లు స్పష్టమేగదా!

హస్తినపుర, పాండవుల యనంతర మేడవతరమున, గంగాప్రవాహమునఁ గొట్టుకొని పోఁగా "నిచక్షుఁడు" అను పాండవవంశస్థుఁడు 'కౌశాంబి'యను యమునాతీరపుపట్టణముఁ జేరి పాలించినట్లు విష్ణుభాగవతాదిపురాణములు చెప్పుచున్నవి. హరివంశమునందు జనమేజయునకు నాల్గవ తరమువాఁడగు 'శ్వేతకర్ణుఁ'డను వాఁడు విరక్తితోఁ దానును, భార్యయును హిమాలయ సానువులలోఁ బోవుచుండ నాతనిభార్య మార్గమధ్యమునందుఁ బ్రసవించి,మగబిడ్డం

'కాశి'కి వ్రాసితి మఱియు, పరిషత్కార్యదర్శినుండి మీకు జవాబు వచ్చుననియు (13-10-40) వ్రాసిరి కాని దానికి జవాబు రాలేదు ది 20-6-41 తేదీని బాబు రాజేంద్రప్రసాదు గారికి మఱియొక యుత్తరముఁ గూడ వ్రాసితిని. ప్రథమముద్రణానంతరము జయచంద్రవిద్యాలంకారులు సెక్రెటరీ వ్రాసినదానిని వ్రాసియే యున్నారు.

నాతని తండ్రియగు యౌగంధరిని, తన ఏకాగ్నికాండ మంత్రములలోఁ జెప్పిన 'ఆపస్తంబుఁడును' బుద్ధునకు నేఁబది యఱువది సంవత్సరములకుఁ బూర్వపువాఁ డగును. అందువలన నాపస్తంబుఁడు క్రీ॥పూ॥ ఏడవ శతాబ్దపువాఁ డగుట ధ్రువ మగుచున్నది.

కాని, ఆపస్తంబుని నివాస మేది ?

తనసూత్రములందును, మంత్రమునందును, యమునాతీరమునందలి 'సాల్వ' దేశమును జెప్పుటచే నాతఁ డాసాల్వదేశీయుఁడై యుండును. ఇట్లని శ్రీపండితసార్వభౌమ చిన్నస్వామిశాస్త్రిగారు గూడ ధ్రువపఱిచిరి. సాల్వదేశము 'దేరాడూన్' జిల్లాలోని 'జాన్సార్ బావార్' అను ప్రదేశమని జయచంద్రవిద్యాలంకారులు వ్రాసిరి.

పై కారణములచే నేఁటి యాంధ్రదేశస్థుఁడే యాపస్తంబుఁ డనువారి వాద మపాస్త మగును. కాని సాల్వదేశీయుని సుందు నాంధ్రుఁడుమాత్ర మగును. ఇందులకుఁ గారణము చింతనఁ బూర్వమె చెప్పఁబడెను. విశ్వామిత్రుఁ డాంధ్రాదులను శపించిన "పుష్కరతీర్థ" మెచ్చటిది ? సాల్వదేశ మెచ్చటిది ? । ఆంధ్రుల పవిత్రస్థానమగు 'పుష్కర' క్షేత్రము నేఁడు 'పోఖార' అను పేరితో రాజపుత్రస్థానమునందు 'అజ్మీరు' నకు సమీపమునఁ గల దని, 'రాప్సన్' దొరగారు పశ్చిమభారతదేశము నేలిన 'నహాపాన'

1. సాల్వదేశ మెచ్చటి దనియు, దాని కిప్పుడే పేరుండె ననియు, వాకబుచేసి పంపఁగోరుచు 'లీడర్' పత్రికాధిపతులగు సి. వై. చింతామణి గారికిని (అలహాబాదు) కాశీలోని భారతేతిహాసపరిషత్తున కధ్యక్షులగు, డాక్టరు బాబూ రాజేంద్రప్రసాదుగారికిని (పాట్నా) వ్రాసితిని. చింతామణిగారు తమ కస్వస్థతగా నున్నది గాన వివరము దెలుపఁజేసికొనుఁడే నని వ్రాసిరి. (26-9-40) డాక్టరు బాబూ రాజేంద్రప్రసాదుగారు ఈయంశముఁ గూర్చి

క్షేత్రపుని యల్లుఁడగు ఋషభదత్తుని' శాసనాదులను శోధించి వ్రాసియున్నారు. ఈ 'పౌష్కర' తీర్థము ఋషభదత్తునినాఁడు (క్రీ. త రెండవశతాబ్దాదిని) పౌష్కర'తీర్థ మని పేరుగలదనియు 'పౌష్కర' పుష్కరశబ్దప్రాకృతీకరణమనియు దొరగారి తలంపు. 'పౌష్కర' విశ్వామిత్రుని కాలమునుండి నేఁటివఱకు పుణ్యయాత్రాస్థానమే.

'పౌష్కర'తీర్థము 'ఆపస్తంబుని సాల్వదేశమునకుఁ బశ్చిమముగా నిరువదియోజనముల దూరమునం దుండవచ్చును.

'సాల్వ'దేశము యమునానదీపరిసరదేశము. అది భారతములోని 'అంబోపాఖ్యానము'వల్ల 'కాశీ, హస్తినాపురము'లకు నడుమ నుండినట్లు స్పష్టమేకదా!

హస్తిపుర, పాండవుల యనంతర మేడవతరమున, గంగా ప్రవాహముచేఁ గొట్టుకొనిపోఁగా "నిచక్షుఁడు" అను పాండవవంశస్థుఁడు 'కౌశాంబి'యను యమునాతీరపుపట్టణముఁ జేరి పాలించినట్లు విష్ణు భాగవతాదిపురాణములు చెప్పుచున్నవి హరివంశమునందు జనమేజయునకు నాల్గవ తరమువాఁడగు 'శ్వేతకర్ణుఁ'డను వాఁడు విరక్తితోఁ దానును, భార్యయు హిమాలయ సానువులలోఁ బోవుచుండ నాతనిభార్య మార్గమధ్యమునందుఁ బ్రసవించి,మగబిడ్డం

'కాశి'కి వ్రాసితి మరియు, పరిషత్కార్యదర్శినుండి మీకు జవాబు వచ్చుననియు (13-10-40) వ్రాసిరి కాని దానికి జవాబు రాలేదు ది 20-6-41 తేదీని బాబు రాజేంద్రప్రసాదుగారికి మఱియొక యుత్తరముఁ గూడ వ్రాసితిని. ప్రథముముద్రణానంతరము జయచంద్రవిద్యాలంకారులు సెక్రటరీ వ్రాసినదానిని వ్రాసియే యున్నారు.

గని, శిలాభూమి నాబాలుని విడిచి భర్తతోఁబోగా నాబిడ్డఁడు రాల లోఁ గొట్టుకొని, 'పైప్పలాద, బైల్వ, కౌశిక'లను బ్రాహ్మణు లాబిడ్డను బోషించి పార్శ్వములు 'మేక' ప్రక్కలవలె నుండుటచే, వానికి 'అజపార్శ్వ'నామమునుంచి కౌశాంబిపట్టణములో రాజుం జేసి తాము మంత్రులై పాలించి రని కలదు కౌశాంబి నేఁడు "కోసం' అనుపేరు కల్గి ప్రయాగకు 40 మైళ్లదూరమునఁ గలదు.

వత్స పేరితో 'కౌశాంబీ' రాజ్యము పాలింపఁబడుటచే నా రాజ్యమునకు 'వత్స' రాజ్యమని పేరువచ్చెను. "ఉదయన" మహారాజునకు వత్సరాజనియే కాళిదాసమహాకవి 'మేఘదూత కావ్యమునఁ జెప్పెను. అజపార్శ్వుని మంత్రులగు బ్రాహ్మణులు తపోవృత్తిని మాని రాజ్యపాలకులైరి అందువలననే, విష్ణుభాగవతాది పురాణములలోఁ బశ్చిమభారతదేశమును వ్రాత్యబ్రాహ్మణులు పాలింతు రని చెప్పఁబడియుండెను యుగంధర, యౌగంధరి, యౌగంధరాయణులు, అజపార్శ్వుని మంత్రి సంతతివారేమో? యౌగంధరి 'ఉదయన' మహారాజు తండ్రి యగు 'పరంతపు'నికి లోఁబడిన మాండలికప్రభువై నం గావచ్చును. 1

ఆపస్తంబశాఖ యనఁబడు తైత్తిరీయశాఖ, అధ్వర్యవ(యజ్ఞములు చేయించుటలో ముఖ్యాంశములు గలది) ప్రాధాన్యము కలదగుటచేతను, దానియతిశయవ్యాపకము యమునానదీ పరిసరము లందున్న 'సాల్వ,వత్స' దేశములలో విశేషముగా నుండుటచేతను, 'హింసాత్మక' యజ్ఞములను మాన్పుటకై బుద్ధుఁడు 'కౌశాంబి'కిఁ

1 హరివంశముననే అజపార్శ్వునిమంత్రుల సంతతి మిక్కిలి వృద్ధి నొందె నని కలదు.

జుట్టుప్రక్కలలోఁ (భద్రక, కుక్కుట, ప్రోషిత, అమ్ర, మొదలగు వనాశ్రమములు) బెక్కునాళ్ళు బోధము లొనర్చుటకును, అశోక చక్రవర్తియు నహింసాత్మకబోధకములగు శిలాశాసనము లా 'కౌశాంబీ'నగరముననే స్థాపించుటకును గారణము లయ్యెను ।

బౌద్ధులు వైదికమతాంశములఁ గూడఁ దమ మతములోనికి గొన్నిటిని దీసికొనిరి అందు 'చైత్య' చిహ్నమొకటి ఇది వైదికమత చిహ్నమే. ఆపస్తంబుని శ్రౌతసూత్రములలో 'చైత్య' నిర్మాణపద్ధతులు పెక్కు గలవు అందుఁ గొన్ని 'శ్యేనా,' ద్యాకారములు గలవి ఆచైత్యముల కెన్నెన్ని ఇటికలు కావలెనో దానిఁగూర్చికూడ నియమములున్నవి యజ్ఞములలో 'ఇష్టాప దానము'ను నొక ముఖ్యాంగమె

ఆపస్తంబమతోదితమగు 'చైత్య'చిహ్నమే ఆంధ్రసామ్రాట్టులగు 'గౌతమీపుత్రశాతకర్ణి' మొదలగువారి నాణెములపైఁ గాన్పించును ఇప్పటి చారిత్రకు లాపస్తంబకృతసూత్రములఁ జూడకపోవుటచే నది 'బౌద్ధుల' చిహ్నమనుచుందురు.

ఆపస్తంబీయులగు నాంధ్రులు మధ్యభారతమునుండి పరుల యొత్తిడిచే స్వస్థలములను విడిచి, పూర్వోత్తరదేశమునఁ గొంతకాల మాగి, పిమ్మట మహారాష్ట్రాదిదేశములకు వలసవచ్చి తుదకు 'ప్రతిష్ఠాన'(పట్టాన్) పురాధీశు లైరి. అదియే మొదటి యాంధ్రసామ్రాజ్యపురాజధాని. గోతమీపుత్రశాతకర్ణినాఁడే 'తెలుఁగు కళింగదేశము

---

1 కౌశాంబిశిలాశాసనాలలో వివాహాదిక్రియలలో జరుగు జంతువధ 'గోమధుపర్కము' మొదలగువానిని నిరసింపుచు వ్రాయఁబడెను

లలోఁ బ్రథమమున నాంధ్రులకుఁ బ్రవేశము కలిగె నని నాదృఢాభిప్రాయము. శ్రీన్యాయమూర్తి సర్ వేపా రామేశం పంతులుగారును 'ప్రతిష్ఠానపురము' నుండియే యాంధ్రులు తెనుఁగు దేశమునకు వచ్చిరని చెప్పియున్నారు.

మా మిత్రులును ప్రసిద్ధాంధ్రచరిత్ర పరిశోధకులు నగు శ్రీమల్లంపల్లి సోమశేఖరశర్మగారు గూడ నాయభిప్రాయము కలవారే.

ఆంధ్రసమ్రాట్టుల శాసనములలో 'వాసిష్ఠీపుత్రపులుమావి' (క్రీ॥ శ॥ 150 సం॥ర ప్రాంతము)వఱకు నీ ప్రాగాంధ్ర మనఁబడు దేశమున నాంధ్రసమ్రాట్టుల శాసనములు లేకపోవుటయు. 'నాసిక, కార్లీ' మొదలగు స్థలములలోనె వారిశాసనము లుండుటయు నిందులకుఁ బ్రబలకారణము లనఁదగు. గోతమీపుత్రశాతకర్ణి విజయముల నీప్రాగ్దేశమాంధ్రమునఁ జేరి యుండినట్లు కాన్పించును. మఱియు పుష్యమిత్రునను (మగధరాజు) సమకాలికుఁడును, కళింగదేశపు రాజును నగు 'ఖారవేలుఁడు' (క్రీ॥ పూ॥ 2వ శతాబ్ది) 'శాతకర్ణిని' జయించుటకై పశ్చిమముగా సైన్యముల నంపినట్లాతని 'హాథిగుంఫా' శాసనములవలనఁ దెలియనగుచున్నది ప్రాచీనకాలమునుండియు కళింగమునకుదక్షిణపుసరిహద్దు 'గోదావరీ' నది. ఖారవేలుని నాఁటికి 'ధాన్యకటక' మే శాతకర్ణుల రాజధానియైనచో ఖారవేలుఁడు శాతకర్ణిని జయింపఁ బశ్చిమముగా నెచటికి సైన్యముల నంపవలసి యుండును ?

ఇంతమాత్రమే కాదు, 'టాలిమి' అను 'ఈజిప్టు' దేశపు పండితుఁడు, తన భూగోళశాస్త్రమున 'వాసిష్ఠీపుత్ర పులుమావి'

(క్రీ॥ శ॥ రెండవశతాబ్దము) రాజధాని, 'ప్రతిష్ఠానపురము' అని వ్రాయుటకూడ నప్పటి కాంధ్రులకు 'ధాన్యకటకము' రాజధాని కాదని దృఢపఱచుచున్నది

ఉజ్జయినిని బాలించుచున్న వంశజుల యొత్తిడిచేతనే 'శాతకర్ణు'లనఁబడు నాంధ్రులు ప్రాగాంధ్రమునకుఁ దమ రాజధానిని మార్చుకొని యుందురు.

ఆంధ్రులు' ప్రాచీనకాలమున 'ఆయుధజీవిక' గణములుగా ననేకప్రదేశములకుఁ బోయి రాజ్యములను స్థాపించిరి. అందొక శాఖ తూర్పుగా మగధదేశమున కేఁగి యచటను, నింకొక శాఖ ప్రతిష్ఠానము"న కేఁగి యచటను వేర్వేఱు రాజ్యములను స్థాపించిరి. తూర్పువా రాంధ్రభృత్యులు, ప్రతిష్ఠానపురాధీశులు "శాతకర్ణులు" లేక, సాతవాహనులు. వారికిని వీరికిని గొన్ని పేరులలో మాత్రమె సామ్యమున్నది. వారిపేరులు వీరిపేరులు పూర్తిగ సరిపోవుచుండుట లేదేమని కొందఱు చారిత్రకులు సందేహించుచున్నారు

ప్రాచీనగ్రంథములలో 'ఆంధ్ర, ఆంధ్రభృత్య' శబ్దములం జూచినను, బ్రహ్మాండపురాణమునం దాంధ్రు లైదు తెగలవారై వేర్వేఱు రాజ్యములను స్థాపించి రనువంశము పరిశీలించినను, శా

1 పాణినిమహర్షి తనయష్టాధ్యాయియందు తనకాలమున [illegible]తఖండమునందుండిన పెక్కు 'ఆయుధజీవిక' సంఘములఁ జెప్పెను (ఆయుధములను ధరించి పరుల నోడించియో, వేఁటాడియో జీవించుసంఘము లాయుధజీవికసంఘములు) (5-3-114, 4-3-9)

తకర్ణులు, ఆంధ్రభృత్యులు, భిన్నసంఘములవారని స్పష్టమగును. శాతకర్ణులు ద్విజులు, ఆంధ్రభృత్యులు ద్విజేతరులునై యున్నారు.

ఆపస్తంబుని సంబంధులగు నాంధ్రులు సాల్వదేశీయులు గదా! సాల్వదేశము 'అభిజనము' (ప్రాచీననివాసమై) గాఁగలిగి యాయుధములను ధరించి జీవించు సంఘమొకటి కలదని 'పాణిని' మహర్షి 'సింధ్వాదిగణము' 1 నందు స్పష్టముగాఁ జెప్పియున్నాఁడు. ఆ సంఘమునుండియే 'శాతకర్ణులు' దక్షిణమునకును 'సింధులా' ద్యాంధ్రభృత్యులు 'మగధ' దేశమునకును బోయినట్లు గాన్పించును. బ్రహ్మాండపురాణమునందు 'ఆంధ్రులు' ఐదుసంఘములై రాజ్యము నేలిరని చెప్పుటయుం నాయభిప్రాయమునకు బలమొసఁగుచున్నది.

'శాతకర్ణు'లు బ్రాహ్మణులని డాక్టరు జయస్వామిగారి యభిప్రాయము శాతకర్ణులలోఁ బెక్కండ్రు తమపేరులను తల్లులపేరులతో 'వైదికమతానుసారము'గా 2 (గౌతమీపుత్ర, వాసిష్ఠీపుత్ర, మాఢరీపుత్ర మొ॥) నుంచుకొనుటయు, 'వేద శ్రీశాతకర్ణి' యనురాజు 'అగ్నికాహుతుల' నిచ్చువాఁడని (యజ్ఞ మొనర్చినవాఁడు) శాసనములలో నుండుటయు, జయస్వామిగారి మతమును బలపఱచుచున్నవి. కాలాంతరమున 'ఆంధ్రభృత్యులును పద్మనాయకులును 'దామన్యాది' గణములోని 'కాకతి ముఖను' 3 నేఁటి యాంధ్రదేశమును బ్రవేశించి రాజ్యములను స్థాపించిరి.

---

1 అష్టాధ్యాయి (4-3-93)

2 చూ॥ శతపథబ్రాహ్మణ, బృహదారణ్యకోపనిషత్తులలోని 'వంశబ్రాహ్మణములు'

3. పాణినీయయష్టాధ్యాయి (5-3116)

మనుస్మృతి ననుసరించి 'అంధ్రులు' లేక 'ఆంధ్రులు సంకీర్ణజాతివా రని కొందఱు తలఁచుట పెద్దపొరపాటు 'ఆంధ్రులు' సంకీర్ణు లని చెప్పువారిని భ్రమింపఁజేయునది మనుస్మృతిలోని యీక్రిందిశ్లోకసంబంధముగా నున్నది.

శ్లో॥ కారావరో నిషాదత్తు చర్మకారః ప్రసూయతే
వైదేహకాదంధ్రిభేదౌ బహిర్గ్రామప్రతిశ్రయా

మనుస్మృతి. 10_36

తా॥ (వైదేహస్త్రీయందు) నిషాదునివలన 'చర్మకారుఁ'డగు కారావరుఁడు జన్మించును (వైదేహునివలన వైదేహస్త్రీయందు జన్మించిన) వైదేహుఁడు, సైరంధ్రుఁడు నను జాతిభేదములు గలవారు గ్రామమునకు వెలుపల నుండఁదగినవారు

ఈశ్లోకము క్రీ. త. 1867 సం॥రమున మద్రాసునందు 'భువనగిరి' రంగయ్యశెట్టిగారు, వాడి వేంకటసుబ్బశాస్త్రిగారిచేఁ బరిష్కరింపఁజేసి 'కుల్లూకభట్టీయ' వ్యాఖ్యానముతో ముద్రింపించిన 'మనుస్మృతి'నుండి గ్రహింపఁబడెను

మఱియు 1891 సంవత్సరములో హిందూథియలాజికల్ హైస్కూలుపండితు లగు నే పార్థసారథిఅయ్యంగారు 'మనుధర్మదర్పణ' టీకతో ముద్రింపించిన మనుస్మృతిపాఠముకూడఁ బైదానివలెనే యున్నది. భేద మేమియును లేదు. కాని యాంధ్రవిద్వేషులెవరో యీక్రింది తాత్పర్యముగల శ్లోకముగా నాగరలిపిలో ముద్రింపించిన మనుస్మృతిలోఁ గూర్చిరి చూడుఁడు.

శ్లో॥ కారావరో నిషాదాత్తు, చర్మకారం ప్రసూయతే
వైదేహికాదంధ్రమేదౌ, బహిర్గ్రామప్రతిశ్రయౌ

మను 10_36.

కారావరుఁడు నిషాదునివలన చర్మకారుని గనును.

వైదేహికునివలన గ్రామబహిష్కృతులగు 'ఆంధ్రుని, మేదుని' గనును

ఈ పారయి దోషసహిత మై యనన్వయయుక్తమై యున్నది. ఈపారవిశేషముచే నాంధ్రుఁడు సంకీర్ణుఁడని వ్రాయుట విచారకరము.

ఆమనుస్మృతిలోనె 'మేదుఁడు, ఆంధ్రుఁడు, చుంచుఁడు, మద్గుఁడు' అనువారు ఆరణ్యకపశుహింసయే వృత్తిగాఁ గలవారు (మను 10-48) అని చెప్పఁబడెను. అది నీచవృత్తి యని కొందఱు తలఁచుచున్నారు. ప్రాచీనకాలమునఁ బశుహింసనము నీచవృత్తి కాదు. యజ్ఞములలోఁ బశుహింసను బ్రాహ్మణుఁడే చేయుచుండెను. వానికి 'శమిత' అనిపేరు శమితకుఁ దోడుపడువాఁడు 'ఉపశమిత' ఇటీవల 'కులాలశమిత' (చంపువాఁడు కుమ్మరి) యయ్యె.

విరాటునికడకు సేవకుఁడుగాఁ బోవుభీముని, 'నీవేమి విరటునికడ నొనర్తు' వని ధర్మజుఁ డడుగ భీముఁడు (1) 'నేను పూర్వము ధర్మజుని కొలువునందు 'వంటవాఁడనై, గోవులను ఖండించువాఁడనై, సూపకారుఁడనై, మల్లుఁడనై 'యుంటి నని యాతఁ డడుగఁ జెప్పుదు' ననెను

నాఁ డావృత్తి తప్పు కాకుండుటచేతనె ధర్మజుసోదరుఁ డట్లనెను.

1. శ్లో॥ ఆరాళికో గోవికర్తా సూపకర్తానియోధకః
ఆసం యుధిష్ఠిరస్యాహ మితి వక్ష్యామి పృచ్ఛతః।
విరాటపర్వ.

ప్రాచీనయుగముననే కాదు. 'భట్టమురారికవి' కాలమునను బ్రాహ్మణవిద్యార్థులు గురువుల యజ్ఞములందు 'పశువిశసనముఁ జేయుచున్నట్లే చెప్పియున్నాఁడు. చూడుఁడు.

1. 'గడ్డిమోఁపులఁ దెచ్చి మేఁపుటచే నైనకష్టమువల్ల బహు కాలమునుండి ద్వేషించుచుండిన బ్రహ్మచారులు నవ్వుచు రెండేండ్లయీడుగల యావుదూడను జంపుచున్నారు.'

పై కారణములవలన మనువుచెప్పిన పశుహింసకవృత్తిచే నాంధ్రులు నీచులు గారు. సంకీర్ణుఁ డాంధ్రుఁడని చెప్పినశ్లోకభాగ మెవరో కల్పించినది ధర్మశాస్త్రచరిత్ర వ్రాసిన డాక్టర్ పి. వి. కాణేపండితుఁడు (బొంబాయి) మనుస్మృతిలో ననేకప్రక్షిప్తములు ప్రవేశించిన వని చెప్పినయంశము దీనికి నిదర్శనము.

ఇంకను నెన్నియో యాపస్తంబుని ఆంధ్రులను గూర్చి వ్రాయవలసియున్నది కాని గ్రంథవిస్తరభీతిచే మానితిని.

నే నింతకుముందు (అంగీరస సం॥ర ఆంధ్రపత్రిక ఉగాది సంచిక) 'ఆపస్తంబుని'గూర్చి వ్రాసిన వ్యాసమునకును, దీనికిని, 'కాల'నివాసాదులలోఁ గొంతభేద మున్నది. దానికంటె దీనిలోఁ గొన్నివిశేషము లుండునని చదువరులు తలంతురు గాక.

నే నాపస్తంబుని గుఱించి విమర్శించుటలో వాని ధర్మగృహ్య సూత్రములు, మంత్రపన్నములు కాక 'మహామహోపాధ్యాయ పరవస్తు వేంకట రంగనాథాచార్యుల'వారి 'లఘుశబ్దార్థ సర్వస్వ

1. శ్లో॥ తత్తాదృక్తృణ పూల కోపనసుత క్లేశాచ్చిర ద్వేషిభిః
మేధ్యా వత్స తరీ విహస్య వటుభిస్సోల్లుంఠమాలభ్య తే.
అనర్ఘ రాఘవనాటక. (2 అంక)

ము' సర్. జష్టిస్ శంకరనాయరుగారు 'మోడరన్ రివ్యూ' పత్రికకు వ్రాసిన వ్యాసము 'ఓల్డెన్‌బర్గు, మాక్సుముల్లరు'గార్లవ్రాతలంగూర్చి తెల్పిన, గుణితులు లగు శ్రీమద్దిరాల సూర్యప్రకాశరావుగారియుత్తరములు కూడ తోడ్పడినవి.

ఆంధ్రులంగూర్చి విమర్శింపుటలో శ్రీ చిలుకూరి వీరభద్రరావుగారి యాంధ్రులచరిత్రము, వీరభద్రరావుగారికిని, శ్రీమామిడిపూడి వేంకటరంగయ్యగారికి నైన పత్రికావాదములు, జష్టిస్ వేపా రామేశంపంతులు, ఆంధ్ర శేషగిరిరావు, గాదె నరసింగరావు, మల్లంపల్లి సోమశేఖరశర్మగార్లు 'భారతి' పత్రికలో వ్రాసిన వ్యాసములు తోడ్పడినవి. అందు శ్రీ సోమశేఖరశర్మగారి వ్యాసములలోనొకటి, ఆంధ్రుల ప్రథమస్థానమగు 'పుష్కరతీర్థము' (పొఖరా) ను దెలిసికొనుట కత్యంత ముపకరించెను తదితరగ్రంథముల నామము లాయాచోటులను స్మరించితిని పై గ్రంథకర్తలకు, వ్యాసకర్తలకుం గృతజ్ఞుండ నగుచున్నాను

నే నీపీఠకను ముగించుచుండంగా 'మండపేట'వాస్తవ్యులును, విద్యావయోవృద్ధులు, మిత్రులు నగు బ్రహ్మశ్రీ దేవులపల్లి నరసింహశాస్త్రిగారు "కారావరోనిషాదాత్తు" అను మనుస్మృతిలోని శ్లోకమునందు 'వైదేహా సైరంధ్ర' శబ్దములే గాని 'వైదేహాదంధ్రమేదౌ' అను పాఠము లేదనియు, కుల్లూకభట్టుకూడ సైరంధ్ర శబ్దమునే చెప్పెననియు, కొన్నిప్రతులలో నీశ్లోకమే లేదనియు వ్రాసిన యుత్తర మందినది అందులకు వారికిం గృతజ్ఞుండను. శ్రీశాస్త్రిగారి యుత్తరము కూడ 'అంధ్రుండు, సంకీర్ణుండు' అను నపవాదమును దొలంగించుచున్నది.

నాలవకథ (వరరుచి.)

ఈకథయందు 'పాణినిమహర్షి' ప్రశంస కలదు. 'వరరుచి' చంద్రగుప్తునకుఁ బూర్వమున మగధరాజ్యము నేలిన "నంద మహారాజు" నకుఁ గొంతకాలము మంత్రియైనట్లును, వరరుచి, గృహస్థుఁడైన తరువాతనె 'పాణిని' బ్రహ్మచారిగా 'వరరుచి, గురువగు 'వర్షోపాధ్యాయుని'కడ విద్యాభ్యాస మొనర్చినట్లును, జెప్పఁబడుటచేఁ బాణిని, 'వరరుచి'కంటె జిన్నవాఁడై 'మౌర్య చంద్రగుప్తుని' పాలనాకాలమున నుండెనని తెలియనగుచున్నది. అందుచేత, పాణినిమహర్షి క్రీ॥ పూ॥ 'నాలుగు, మూఁడు' శతాబ్దముల నడుమవాఁ డగుచున్నాఁడు

కొందఱేవేవో యుక్తులఁ జెప్పి, పాణినిమహర్షిని క్రీ॥ పూ॥ 5, 8, 12 శతాబ్దములలోనికి, నెట్టుచున్నారు. కాని, క్షేమేంద్ర మహాకవి (క్రీ॥ త॥ 11 శతాబ్ది) తన 'బృహత్కథామంజరి'లోను, 'సోమదేవభట్టారకుఁడు' (క్రీ॥ త॥ 12 శతాబ్ది) తన 'కథాసరిత్సాగరము'నను వరరుచి గృహస్థుఁడైనపిమ్మటనే పాణిని విద్యార్థిగా నుండినట్లు వర్ణించుటచే క్రీ॥పూ॥ నాల్గవశతాబ్దమునఁ బాణినియుం డుననుట నిజమగును. ఇంతమాత్రమెకాదు పాణినియే తన యష్టాధ్యాయియందు 'బిదాది' గణములో ఆపస్తంబ మహర్షిని (4-3-104 'నడాది'గణములో(4-1-99)యౌగంధరాయణుని స్మరించుటచే క్రీ॥ పూ॥ 8. 12 శతాబ్దములవాఁ డెంతమాత్రము కాఁడు. మఱియు గర్గాదిగణమున (4-1-105) చణకశబ్దమునకు 'యఞ్'

వచ్చిన 'చాణక్య'శబ్ద మగునని చెప్పుటచే చణకసూనుని, పణిన సూనుఁ డెఱిఁగియుండు ననుట స్పష్టమై, పాణిని మహర్షి క్రీ.పూ 4, 3 శతాబ్దముల మధ్యకాలమున నుండుట నీకథ విశదపఱచును.

ఐదవకథ (కుమారిల భట్టాచార్యుఁడు)

కుమారిలభట్టునితో వాదించిన జైనపండితుల పేరులు తెలియకపోవుట విచారకరము 'జైనమతము' 'ఛాందోగ్యోపనిషత్తు' ఆవిర్భవించినపుడే పుట్టెనని యాయుపనిషత్తునందలి 'ప్రజాపతీంద్ర విరోచన' గాథచేఁ దెలియనగును! జైనమతమునందలి యిరువదినాల్గవ ''తీర్థంకరుఁడగు'' మహావీరుఁడు బుద్ధునకు సమకాలికుఁడఁట! అట్లయిన మొదటి 'తీర్థంకరుఁ'డగు 'ఋషభుఁడు' క్రీ. పూ. 10, 12 శతాబ్దములనాఁటి వాఁడైన నగును. జైనమతమవైదికమతము, 'కుమారిలు'నిది వైదికమతము. వైదికమతమునకు 'నిదాన మగు 'పూర్వమీమాంసాశాస్త్రము'న, నిరీశ్వరత్వమె ద్యోతకమగును తన్మతప్రోక్తము లగు యజ్ఞములలోఁ బేర్కొనఁబడు ఇంద్రాగ్న్యాదులు' శబ్దవాచ్యులే గాని, యుపాస్యులు గారు. అందుచేతనే శ్రీశంకరుఁడు కుమారిలు నెదిరింపసిద్ధపడెను.

ఇట్టి కుమారిలుని వైదికమతమునందు 'కర్మ మేగాని,భక్త్యాదులు సున్న. ఆపస్తంబుని వైదికమతమునందు, కర్మము ప్రధానమైనను, చివరిదశలో గొంత సూక్ష్మమగు నద్వైతమత

---

1 ఛాందోగ్యోపనిషత్ 8-6 దినిని వేదాంతశాస్త్రజ్ఞులు 'దేహాత్మవాదము' గాఁ దలఁచియున్నారు.

ధర్మసూత్రములును గలవు. 1 అవి యుపనిషదర్థక బ్రహ్మపదార్థ బోధకములే. ఇట్టి సేశ్వరత్వము కుమారిలభట్టుని మతమున మృగ్యము అతని ప్రతికక్షులగు జైనులగురువులగు తీర్థంకరుల విగ్రహరూపములే, హిందూమతమున 'విగ్రహారాధనమునకు' దారి చూపినవని కొందఱు తలంతురు.

వైదికమతమున దేవుఁడు రూపము లేనివాఁడు, శబ్దవాచ్యుఁడు. కాన, ఉపాస్యుఁడగుట కష్టమని జైనులనుండి విగ్రహారాధనమును వైదికమతస్థులు శివాదిరూపములఁ దమ మతములోనికిఁ దీసికొని యుందురేమో? మనుజవ్యక్తి మృతి నొందిన పిమ్మట "సంచయనకర్మము" (ఎత్తుఁబోత) నాఁడు మొదలు పదియవనాఁటివఱకు శిలారూపియై సనాతనహిందువులచే నారాధింపఁబడి పిమ్మట (శిల) నీరిలో విడువఁబడును. 2 అంతేకాని, విగ్రహత్వము నొందఁడు అందుచేతనే, వేదర్షులగు నాపస్తంబాది మహర్షులకు, కాళిదాసాది మహాకవులకు, కుమారిలభట్టాది మహాశాస్త్రవేత్తలకు, విగ్రహరూపములు లేవు. పూజ్యులను శిలారూపులనుగాఁ జేయుట నార్యమతస్థులు తప్పుగానే తలఁచిరి. లేకుండిన నాఁటిభారతీయప్రభువులు, 'ఆపస్తంబ, కుమారిలభట్ట, కాళిదాసా'దుల శిలావిగ్రహముల నేల చేయింపరు? సనాతన ధర్మిష్ఠుల మనుకొను కవిపండితప్రకాండులు బ్రతికియుండఁగనే తాము శిలారూపముల నొంద నిచ్ఛగించుట, యజ్ఞానవిలసితము కాదా? కుమా

1 ఆపస్తంబ ధర్మసూత్రము 1_22, 23

2. భారద్వాజసూత్రములు. ఆపస్తంబయల్లాజీయము

రిలాదుల గ్రంథములే వారి దివ్యరూపములు విశిష్టాద్వైతమతమున భక్తులు శిలావిగ్రహరూపులై గౌరవార్హు లగుచున్నారు. పంచమహా యజ్ఞములు షట్కర్మలు చేయు వైదికికి విగ్రహారాధన మొనర్చు కాల మెపుడు ?

సంస్కృతవాఙ్మయమున 'పతంజలి, కుమారిలభట్ట, శంకరాచార్య, సాయణాచార్యుల' భాష్యము లప్రతిమానములు. వానికివియే సాటి.

ఆఱవకథ (తెలుఁగునాటి తురుష్కయోగి)

ఈకథ యన్ని మతములలోను, సద్బోధకులు, నిస్పృహులు, సర్వసములు, నగుమహాభక్తు లుండిరనియు, హైందవేతరులైనను స్వదేశభాషలను బోషించి వృద్ధి నొందింపఁగలరనియుఁ జెప్పును

ఏడవకథ (ఆంధ్రగాయకుఁడు)

భారతీయులు ప్రాచీనకాలమునుండియు, గానకళాకోవిదులని, యజ్ఞములందలి వారి 'ఔద్గాత్రమె' (సామగానభాగము) వెల్లడిచేయును. ఉద్గీథము (సామగానము) మోక్షహేతువని ఛాందోగ్యోపనిషత్తులోఁ గలదు లౌకికగానమునందును వైదికకాలపు భారతీయుల జంత్రగాత్రములు విలసనము గానవచ్చును. వేదమునందు *భారతీయగాయకుల భేదములును, తద్వృత్తికుల భేదములును జెప్పఁబడెను అందు, గొన్ని పేరుల నిట వ్రాయుచున్నాను.

(1) సూతుఁడు=సంగీతము పాడి జీవించువాఁడు. (2) వీణావాదుఁడు = వైణికుఁడు (3) కోశకారిణి = పాడునపుడు తిత్తి

---

* తైత్తిరీయబ్రాహ్మణము. 3-4.

నవకథామంజరి

* ఆంధ్రులదాయాదుఁడు

ఇక్ష్వాకువంశమున 'వేధసుఁ' డనురాజు కలఁడు, పౌరాణికు లాతనిని ద్రిశంకుఁ డందురు. ఆతనికి హరిశ్చంద్రుఁడను పుత్రుఁడు పుట్టెను. ఆహరిశ్చంద్రునకు నూర్వురు భార్య లుండినను బహుకాలమువఱకు పుత్రసంతతి లేనందున నారాజు చింతించుచుండెను.

ఇట్టుండ నాహరిశ్చంద్రుని గృహమున కొకప్పుడు 'పర్వతుఁడు, నారదుఁడు' నను మహర్షు 'లతిథులు'గా రాఁగా, హరిశ్చంద్రుఁ డామునుల కాతిథ్యమిచ్చి గౌరవించి, నారదుని తోఁ బుత్రోత్పత్తిప్రశంసంజేయ నాముని పుత్రోత్పత్తివలనఁ గల్గు లాభములను జెప్పెను. హరిశ్చంద్రుఁడు తనకెట్లు పుత్రోత్పత్తియగునో చెప్పుమనెను. అందులకు నారదుఁడు, ఓ రాజా ! నీవు 'వరుణ'దేవుని, నాకుఁ బుత్రునొసఁగిన నేనాపుత్రుని బశువుగాఁ జేసి నిన్నుఁగూర్చి యజ్ఞముఁ జేయుదునని ప్రార్థింపుము. అట్లు చేసితివేని నీకు వరుణుఁడు పుత్రునొసంగుననియెను.

పిమ్మట హరిశ్చంద్రుఁడు వరుణుఁ గూర్చి నాకొక పు

---

* ఈకథ ఐతరేయబ్రాహ్మణమునుండి యాంధ్రీకరింపఁబడెను.

తుని నొసంగిన నే నాపుత్రుని బశువుగాఁ జేసి, యజ్ఞముఁ జేయుదునని ప్రార్థింప వరుణుఁడు ప్రత్యక్షమై పుత్రుఁడుకలుగ వరమిచ్చెను.

పిమ్మట హరిశ్చంద్రునకు 'రోహితుఁ డను పుత్రుఁ డుద్భవింప వరుణుఁడు వచ్చి, యీ బాలునిచే నాకు యజ్ఞముఁ జేయుమన హరిశ్చంద్రుఁడు, పుత్రప్రేమచే బిడ్డను వదలలేక "జాతాశౌచదినములు వెళ్లినగాని బాలపశువునకు యజ్ఞార్హత లే"దనఁగా వరుణుఁడు వల్లెయని వెడలిపోయెను.

జాతాశౌచదినములు వెళ్లినపిమ్మట వరుణుఁ డేతెంచి నీవు చెప్పిన గడువు ముగిసినది గాన వీనిచే నాకై యజ్ఞము నొనర్పుమనఁగా హరిశ్చంద్రుఁడు 'పశువునకు దంతములు వచ్చినఁగాని మేధ్యము కా'దనఁగా వరుణుఁ డంగీకరించి వెళ్లిపోయెను.

పిమ్మట రోహితునకు దంతములురాఁగా వరుణుఁడు ప్రత్యక్షమై బాలునకు దంతములు వచ్చినవి గాన వీనిని యాగ పశువుం జేసి యజనము నొనర్పుమనెను. "ఈబాలున కిపుడు వచ్చిన దంతములు స్థిరములైనవికావు. గాన నివి యూడినఁ గాని యాగార్హుఁడై యీబిడ్డఁ డుండ"డని హరిశ్చంద్రుఁ డన 'తథాస్తు' అని వరుణుఁడు తిరోహితుఁడయ్యెను.

తరువాత పాలపండ్లూడఁగా వరుణుఁ డెప్పటియట్ల వచ్చి పల్లూడినవి గాన, వీనిచే జన్నము నొనర్పుమనఁగా "రెండవ

సారి దంతములు రానిదే పశువు సర్వావయవసంపూర్ణతనొంద" దని హరిశ్చంద్రుఁడన వరుణుఁ డంగీకరించెను రెండవసారి దంతములు రాఁగా, వరుణుఁ డెప్పటివలె వచ్చి యవయవసంపూర్ణతకలిగెనుగాన నీకుమారునిచే, ఇష్టిని జేయుమనెను. "పశువు కాఁగల క్షత్రియుఁడు స్వకులోచిత మగు, సన్నాహశీలి. కాకుండిన. యజ్ఞమునందు వినియోగ్యుఁడుకాఁడు" అని హరిశ్చంద్రుఁ డనఁ బూర్వమునవలెనె వరుణుఁ డంగీకరించి యంతర్ధానుఁడయ్యెను.

పిమ్మట 'రోహితుఁడు' యుద్ధశాస్త్రమును నేర్చి కవచధనుర్బాణాదులను ధరించుచుండ వరుణుఁడేతెంచి, సన్నాహశీలిగాన నీకుమారునిచే సవనంబొనర్పుమనెను. దానికి హరిశ్చంద్రుఁ డట్లేచేయుదునని యంగీకరించి రోహితుని బిలిచి యిట్లు చెప్పెను. "నాయనా! నాకొఱకు నిన్ను వరుణుఁ డిచ్చెను. అయ్యో! నిన్ను బశువుగాఁ జేసి నేనీ వరుణుని గూర్చి యజ్ఞముం జేయుచున్నా"నన, నారోహితుఁ డంగీకరింపక, ధనుర్ధరుఁడై యరణ్యమునకుఁ బరుగిడి యటనుండెను.

హరిశ్చంద్రుఁ డవిపరీతిని యజ్ఞముచేయ నందున వరుణుఁడు హరిశ్చంద్రుని బట్టుకొనఁగా, హరిశ్చంద్రునకు 'జలోదరరోగముకలిగి, బాధపడుచుండెను.

—• రోహితుని ప్రవర్తనము. •—

తండ్రికి జలోదరరోగము కలిగెనని యరణ్యమం దొక సంవత్సరము నివసించిన తరువాత 'రోహితునకు' దెలిసి యాతఁడు తిరిగి పురమునకు వచ్చుచుండగా 'ఇంద్రుఁడు' బ్రాహ్మణవేషధారియై మార్గమధ్యమున నొక సాకుచెప్పి రోహితుని మరల వనమునఁ దిరుగునట్లు చేసెను. ఇట్లొకపర్యాయముకాదు—అయిదుపర్యాయములింద్రుఁ డిట్లువియో సాకులుచెప్పి రోహితుని వెనుక కరణ్యమునకుఁ బంపుచుండుటచే రోహితుఁ డరణ్యమున నాఱేం డ్లుండవలసివచ్చెను

ఎట్లయినను హరిశ్చంద్రుఁడు మనుష్యపశువుచే యజ్ఞముఁ జేయనియెడల నాతనికి రోగనివృత్తి కాదని, రోహితుఁడు తలఁచి తనకు మారుగా నొకనిని హరిశ్చంద్రుని యాగముకై యరణ్యమున వెదుకుచుండగా, నాయడవియం దొక పర్వతపుచరియలో దరిద్రముచే భుక్తికిలేక బాధనొందుచున్న 'సూయవసుని' పుత్రుఁడగు 'అజీగర్తుఁడు' అనునొక బ్రాహ్మణుని జూచెను. అయ్యజీగర్తునకుఁ 'శునఃపుచ్ఛుఁడు, శునశ్శేపుఁడు, శునఃలాంగూలుఁడు' నను ముప్వురు కుమారులుకలరు. అట్టి యాబీదబాపని జూచి, రోహితుఁడు "ఓ ఋషీ ! నీకుమారులలో నొకనిని నాకిమ్ము, నీకు నూఱుగోవుల నిచ్చెదను. నాకుఁ బ్రతినిధిగా వానిని జేకొని యజ్ఞము చేయింతు" ననెను. దానికి

నజీగర్తుఁ డంగీకరించెను. కాని, పెద్దవాఁడు నాకెంతయుఁ బ్రియతనూజుఁడు గాన నతని నీకు నీఁ జాల ననియెను, చిన్నవాఁడు నాకెంతయుఁ బ్రియుఁడు గాన యీకుమారుని నీఁ జాల నని తల్లి చెప్పెను. తల్లిదండ్రుల మాటలను విని మధ్యముఁడగు శునశ్శేపుఁ డిట్లనియెను.

‘ఓరాజా! పెద్దవాఁడు తండ్రికిఁ జాలఁ బ్రియసుతుండయ్యె; చిన్నవాఁడు తల్లికి ముద్దు బిడ్డఁడయ్యె. వారలిరువురు నొల్లని వాఁడనైన మధ్యముఁడను గాన నూఱుగోవులను వీనికిమ్ము, నీవెనుకనే వచ్చెద’’ ననిన రోహితుఁడు నూఱుగోవుల నజీగర్తున కిచ్చి శునశ్శేపుని వెంటనిడుకొని, పురప్రవేశంబు చేసి హరిశ్చంద్రునితో, తండ్రీ! నాకు మాఱుగ వీనిని యజ్ఞపశువుగాఁ దెచ్చితిననెను.

అందులకు హరిశ్చంద్రుఁడు సంతసించి, వరుణునితో నీ ‘శునశ్శేపుని’ బశువుగాఁ జేసి నీకు యజ్ఞము నొనర్తునన, వరుణుఁడు, క్షత్రియునికంటె బ్రాహ్మణుఁడె శ్రేష్ఠుఁడుగదా! వీనిం బశువుగాఁ జేసి ‘రాజసూయ’ యాగముం జేయుమని చెప్పగా, హరిశ్చంద్రుఁడు రాజసూయములోని సోమయాగాంగమగు నొకకర్మమునందు శునశ్శేపునిఁ బశువుగా నేర్పఱచెను. ఆయజ్ఞమున హరిశ్చంద్రునకుఁ విశ్వామిత్రుఁడు హోత, జమదగ్ని అధ్వర్యుఁడు, వసిష్ఠుడు, బ్రహ్మ, ఆయాస్యుఁడు ‘ఉద్గాత’’ అను ఋత్విక్కులైరి.

పై నల్వురు మహర్షులు రాజసూయముఁ జేయింపుచుండఁగా 'మనుష్యపశువును' బంధింపు సమయమాసన్నమైనది. విశసింపఁబడు పశువునకుఁ గొన్ని సంస్కారములఁ జేసిన పిదప రెండుపేటలు వేయఁబడి రెండుబారల పొడవుగల రెండు కుశనిర్మితములగు త్రాళ్ళతో కాళ్ళను తలను గట్టిగా బంధించి, మూఁడుపేటలు గలిగి మూఁడుబారలు పొడవు గల త్రాఁటిచే మధ్యభాగమును యూపస్తంభమున కంటఁగట్టవలయునను విధికలదు. ఇపుడు విశసింపఁబడు పశువో! సాధారణపశువా? కాదు! యువకుఁడు—మహర్షి గోత్రోత్పన్నుఁడు—మహాకవి—వేదవేది — బ్రహ్మవర్చస్వి— మహాభక్తుఁడు, అట్టివానిని, పై విధమున బంధింప నెవనికి చేతులువచ్చును? ఎవఁడును బంధింప నంగీకరింపలేదు గాని, నూఱుగోవులకుఁ బుత్రునమ్మిన శునశ్శేపుని తండ్రియగు 'అజీగర్తుఁడే' నాకింకను నూఱుగోవుల నిచ్చినయెడల నేను శునశ్శేపుని బంధింతునని పలుక, హరిశ్చంద్రుఁడట్లె నూఱుగోవుల నీయఁగా నజీగర్తుఁడు దారు హృదయముతో—కాదు, శిలాహృదయముతోఁ బుత్రుని విశసింపఁ యూపస్తంభమునకుఁ బై రీతి నంటఁగట్టెను.

అపుడధ్వర్యుఁ డేతెంచి, బంధితుఁడగు శునశ్శేపునకు వధించుటకుఁ బూర్వము చేయఁదగిన కొన్నికర్మములఁ జేసెను. పిమ్మటఁ బశువును ఖడ్గముతో విశసించుసమయమే తేర బ్రహ్మతేజస్వియగు శునశ్శేపుని బంధించుటకే నెవఁడును సిద్ధపడకుండినపుడు

ఖడ్గముతో ఖండింప నెవఁడా యత్నపడును ? ఆమహాక్రూరుఁ డగు నజిగర్తుఁడే తన కుమారుని మఱినూఱుగోవుల నిచ్చినయె డల నేను ఖండింతునని వజ్రమయహృదయముతోఁ బల్కెను. నూఱుగోవులను వారిశ్చంద్రుఁ డియ నజిగర్తుఁడు కుమారుని విశసింప ఖడ్గము వహించెను.

హా ! ఎంతక్రూరకర్మము ! తనగర్భమున జన్మించిన సు గుణవంతుఁడై, విద్యాయుక్తుఁడై సురూపుఁడై పితృభక్తుఁడై వ భక్తులుగలిగి సుకుమారుఁడైన పుత్రుం జంప నెవనికి మనసొ ప్పును ? అజీగర్తుఁడు మాత్రమె ఖండింపఁదలంచెను. ఇది దరిద్ర దోషము. ఆకలిచేఁ గడుపుమాడి యుదరపోషణముకై చేయఁ దలఁచిన మహాపాతకము ! మఱిద్వేషముచేఁ గుమారుని ఖండింప నెంచిన హిరణ్యకశిపుని చర్యయు నిట్టిదేకదా ?

శునశ్శేఫుఁడు, తొలుతఁ దన్ను బంధించి, యశ్వమేధ ములో సింహాదిజంతువుల కొనర్చినట్లు కొన్ని సంస్కారములం జేసి,మనుష్యుని గూడ నరణ్యమున విడువఁగలరనియుఁ దానెచ టనైన విడువఁబడిన నెటులనో జీవింపవచ్చుననియుఁ దలఁచెను. కాని, రాజసూయమునఁ దప్పక నరుఁడు విశసింపఁబడవలయు నను విధి యాతనికిఁ దెలియలేదు కాని తండ్రిఖడ్గముఁ జేబూన గానె యిట్లనుకొనెను.

హా ! నన్ను విడువక సాధారణపుయాగపశువువలెనే విశ సింతురా ? అయ్యో! నే నిప్పు డేవేల్పుఁజింతింతును? శుభకరుఁ

డగు నే దేవుని బ్రార్థింతును ? తిరిగి నన్నే దేవతభూమిపై నుండ నిచ్చును ? నిజముగ నేను మాతల్లిని జూచు స్థితికలుగునా ? ఓవరుణా ? నా మొఱ్ఱనాలకింపుము. రక్షణేచ్ఛచే నీకెదురుగఁ జేయునాస్తోత్రముల నాలకించి నన్ను సుఖవంతునిగాఁ జేయుము. (1) బహుజనులచే స్తుతింపఁబడునో వరుణదేవా ? సమీపము నందే మరణముగల నేను వేదవాక్కుచే నిన్ను నుతింపుచు నా కాయువునిమ్మని కోరుచున్నాను, యజమానుఁడు గూడ (హరిశ్చంద్రుఁడు)హావిస్సులచే నిన్నాయాయువునే కోరుచున్నాఁడు, నీవు మాయిరువురకోర్కెల ననాదరముతోఁజూడక హేళనము చేయక మా యిరువురయొక్క యాయురారోగ్యములను వృద్ధిఁజేయుము.

శునశ్శేపుఁ డిట్లు పెక్కువిధముల వరుణాదిదేవతలను స్తోత్రముచేసిచేసి " గొప్పవారలకు నమస్కారము, పిల్లలకు వందనము, యువకుల కభివాదనము, వృద్ధులకు జోహారు. ఓ దేవతలారా ! నాకు శక్తి గలిగి జీవించినయెడల మిమ్ముల నర్చింతును ! ఓ పరమేశ్వరా ! నిన్ను స్తోత్రముచేయుటలో లోపమును గల్పింపను రక్షింపుము, రక్షింపుము, రక్షింపుము; అని స్తోత్రము చేయుచుండఁగా, పటుక్కుమని యూపాదమ

(1) ఈయర్థముగల మంత్రమిప్పుడును బ్రాహ్మణులచే సాయంసంధ్యలో జపింపఁబడుచుండును

స్తంభమునఁ గట్టిన కట్లొకసారి తెగిపోఁగాఁ శునశ్శేపుఁ డెదుర నుండిన విశ్వామిత్రుని యొడిలోఁ బడి రక్షింపుము, రక్షింపు మని వేఁడెను. దయాళుఁడై విశ్వామిత్రుఁడు రక్షింతు ననెను.

శునశ్శేపుఁడు విశ్వామిత్రునంకతలముఁ జేరగనే శునశ్శేపుని తండ్రియగు నజీగర్తుఁడు విశ్వామిత్రుకడకేఁగి నాపుత్రుని నాకిమ్మం, విశ్వామిత్రుఁడు నీకు నే నీయను వీనిని దేవతలే నాకిచ్చిరనెను. కాదు నాకొడుకే యని యజీగర్తుఁడును, నాకొడుకే యని విశ్వామిత్రుఁడును వివాదము నొందిరి. అపుడు శునశ్శేపుఁడు నేను విశ్వామిత్రుని పుత్రుఁడనేగాని, యజీగర్తుని పుత్రుఁడను గాననెను. హరిశ్చంద్రుని రాజసూయము నెఱవేరుటెట్లను ప్రశ్నము కలిగెను. ఇంతలో వరుణదేవుఁడే ప్రత్యక్షమై శునశ్శేపుని ప్రార్థనములచేఁ దనకుఁ దృప్తి కలిగెననియు, ఇఁక యజ్ఞముఁ జేయు నవసరములేకుండగ యజ్ఞఫలమును హరిశ్చంద్రున కొసఁగుచున్నాననియు నాతఁడు నీరోగి యగుననియు వరమిచ్చి వరుణుఁ డంతర్హితుఁడయ్యెను. హరిశ్చంద్రుఁ డరోగియయ్యెను.

శునశ్శేపుఁడు దేవతలకు మిత్రుఁడగుటచే 'దేవరాతుఁడు' అను నన్వర్థనామము కలవాఁడయ్యెను. విశ్వామిత్రుఁడు ఆంధ్ర, మధుచ్ఛందాది సంజ్ఞలతో నొప్పు తననూర్వురు పుత్రులకను 'దేవరాతుని' జ్యేష్ఠపుత్రునిగా నంగీకరించుటచే మన యాంధ్రులకు దేవరాతుఁడు దాయాదుఁడయ్యెను.

*త్రిలిఙ్గదేశపు మహారాణి.

(రుద్రమదేవి)

ఇంచుమించుగ నిప్పటి కాఱువందల యేఁబది సంవత్సరములకుఁ బూర్వ మొకనాఁటి సాయంసంధ్యాసమయమున, 'ఓరుగల్లు, అంబాల' యను పట్టణములకు నడుమనుండు మహారణ్యప్రదేశమున, నొక్క పల్లకి, యోరుగల్లుముఖముగా వచ్చుచుండెను. పల్లకియందున్న యువతి ప్రాయశః పదునెనిమిది వసంతర్తువులఁజూచి యుండవచ్చును. భర్తయు నామెతోఁ గూడ నశ్వారూఢుఁడై చనుదెంచుచుండె. ప్రయాణపు బడలిక

---

* ఈకథ శ్రీయుత మాడపాటి హనుమంతురావు పంతులు గారి 'మల్లికాగుచ్ఛము' అను గ్రంథమునుండి గైకొనఁబడినది. పంతులుగారు నేఁటి హైదరాబాదు సంస్థానములోని యాంధ్రప్రముఖులలో నొకరు. వీరు బహువిధములగు చారిత్రిక సాంఘిక విషయికములగు వ్యాసములను గ్రంథములను వ్రాసిరి. వారిగ్రంథములలో ప్రసిద్ధికెక్కిన 'చింతామణి వైద్యా' 'పండితుని శాత్రియుగము' అను గ్రంథమునుండి యాంధ్రీకరింపఁబడిన వ్యాసము లాంధ్రవాఙ్మయములోఁ గ్రొత్తవి. మల్లికాగుచ్ఛము చారిత్రక సాంఘిక విషయములఁ జెలిపెడి యింపైనకథలు కలది. వీరి వ్రాఁత ధారాశుద్ధిగలదై సలక్షణమైన భాషకలదిగా నుండును. హనుమంతరావు గారు, ఆంధ్రాంగ్లసంస్కృతభాషల నేకాక, ఉర్దూభాషను నేర్చి నైజాము గవర్నమెంటులో బహుకాలముద్యోగము చేసి, పిమ్మట నచటి హైకోర్టులో న్యాయవాదవృత్తి నవలంబించి యిప్పు డఱువదవపడిగలవయున్నను విశ్రాంతిం గైకొనుచు నచటి యాంధ్రుల యభివృద్ధికై బహువిధముల పాటుపడుచున్నారు.

వారిరువురయొక్కయు, పల్లకీబోయలయొక్కయు, ముఖములం దేకాక, గుఱ్ఱమునందు సైతము స్పష్టముగఁ గనఁబడుచుండెను. వేళ సాయంకాలమును, ప్రవేశించిన దరణ్యమును, నగుటచేత నయ్యాశ్వికుఁడు వేవేగము నడువ బోయిల కాజ్ఞాపించుచుఁ దన యశ్వమునువడిగ నడువ హెచ్చరించుచు నాసుందరికి భయము కలుగకుండునట్లు వినోదములగు ముచ్చటలఁ జెప్పుచుఁ బోవ సాగెను. బోయలంతకుమున్ను వారి కుక్షులలోఁ బ్రవేశించిన మద్యముయొక్క ప్రభావముచేత, వడివడిగ నడుగు లిడఁదొడఁగిరి. కాని, యాశ్వికుని వాహనము బోయలనడకతోఁ దులఁ దూగలేక మెల్లఁగఁ బోవుచుండెను. అస్తమయభానుఁడు తన కరములచే నావనమునందలి వృక్షాగ్రములకు బంగరుపూఁతఁ బూయుచుఁ బూయుచుఁ దుట్టతుదకు పశ్చిమసముద్రమున నంతర్హితుండయ్యెను. వీరె నంతవేగముగ సురక్షితప్రదేశమును జేరఁదొందరపడుచుండిన యాత్రికె, గుఱ్ఱముయొక్క మందగమనము నిరుత్సాహకరముగ నుండినందున నతఁడు వెనుకఁబడి చింతించుచుఁ, బల్లకిని ముందుఁ బోనీయ నిష్టములేక, మెల్లఁగ నడువుఁడని బోయలకుఁ గేకవేసి చెప్పెను; కాని వారామాటలు వినుపించుకొనక పల్లకితోఁ బఱువిడసాగిరి. వారియోంకారనినాదవశమునఁ బల్లకిలోనున్న జవ్వనికిఁ గూడ భర్తయొక్క కేకలు వినవచ్చినవికావు. అయినను, నాయువతి భర్త వెనుకఁ జిక్కుటకు విచారించుచు, డోళాందోళితమానసయై కొంతసే పేమి

యుఁ జేయఁదోఁచక భర్త వచ్చువఱకుఁ బల్లకి నట్లే యాపియుం చఁబోయల నాజ్ఞాపించెను. కాని, యరణ్యము భయంకరమైన దనియు, తమ యేలికకెట్టిభయమును లేదనియుఁ జెప్పుచు, బోయ లెప్పటియట్లే పోవసాగిరి. కొన్ని నిముసములలోఁ బల్లకిదని యాశ్వికునకును నొకమైలెడమయ్యెను !

అంతరాత్రి పొడసూపెను. అది శుక్లపక్షమగుటచేఁ జంద్రకాంతి స్ఫుటముగలేక, గుడ్డివెన్నెల కాయుచుండినందున, నాప్రయాణికుల కెంతయు నిరుత్సాహముగ నుండెను. సురయొక్క మైకము దిగినందున బోయలవడియుఁ దగ్గి వారు మెల్లమెల్లగ నడువమొదలిడిరి. అట్టితరుణమున మార్గమున కొక ప్రక్క నుండిన పొదలో నేదియొ చప్పుడౌ సుందరి వీనులకు సోఁకఁగా నామె యనుమానముతో నటు నిటు పరికించి చూచెను. కాని యేదియుఁ గన్పట్టలేదు. తనమనమున సందడించినది యుత్త భ్రమయే యని సమాధానము చేసికొని యాయువతి ధైర్యముతో గూర్చుండిన మఱియొకనిమేషమునకు, అక్కటా ! మూర్తిభవించిన యమదూతలోయన, నల్లనియాకారములును, తదనుగుణ్యములగు వస్త్రములును గలిగిన జనులగుంపొకటి, యాపొద నుండి సాయుధముగ బయలువెడలి వచ్చి, "నిలుఁడు, నిలుఁ"డని బోయల గద్దరించుచుఁ బల్లకి కడ్డముగ నిలచెను ! వెలవెలఁ బోయిన మోములతో బోయలు గత్యంతరముఁ గానక నిలవఁబడి తమ దొరసానివైపు విస్మయవిచారమిళితము లగు చూ

దృక్కులఁ బరపిరి. ఇఁక నాసుందరి మానసికస్థితిని వేఱుగ వర్ణిం పవలయునా! మొదట నీదృశ్య మామె హృదయమును భేదించుచున్నుండెను, వెంటనే సహజదౌర్బల్య మామె యెదనువదలి యాస్థలమును ధీరత్వ మాక్రమించెను. కానున్నదిగాక మానదని గుండె రాయిచేసుకొని యాలేమ ధైర్య మూనియుండునంతలో, దోఁపిడికాండ్ర నాయకుఁడు రెండు దండప్రహారములతో బోయలచే బల్లకినిదింపించి యాజవ్వనిని సమీపించెను. అంతవఱకితి కర్తవ్యతామూఢయై యుండిన, యాయువతి యెట్టులో ధైర్యముఁ జిక్కఁబట్టి గుప్తముగ నుండిన కటారుతో నాదోఁపిడికాని రొమ్ముం గ్రుమ్మఁ జేయి యెత్తెను. నాయకుఁడును మాఱినస్థితిని నిముసమున గ్రహించి, మొలను వ్రేలాడుచుండిన ఖడ్గమును విద్యుద్వేగముతో నూడఁబెఱికి తటాలున దానితో నొకబలమగు వ్రేటు నాయువతి కోమలకంఠమును గుఱిచూచి వ్రేయ నెత్తెను.

11

మనకథ జరుగుకాలమునఁ ద్రిలింగరాజ్యమును 'కాకతి రుద్రమదేవి' మహావైభవోపేతముగ నోరుగల్లునగరము రాజధానిగఁ బరిపాలించుచుండెను. ఆపురమునకు దాదాపు పండ్రెండుమైళ్ల దూరముననున్న 'అంబాల'యను గ్రామము దేవిగారికిఁ బ్రియతమమగు ప్రదేశముగ నుండుటవలన నోరుగంటికిని నాగ్రామమునకును రాకపోకలు తరుచుగ నుండినను, నాప్రదేశ

ముల నడుమనుండిన సాంద్రారణ్యభాగ మొక్క కప్పుడు దారి దోఁపిడిగాండ్ర కాశ్రయమిచ్చుచుండుటకూడ సంభవించుచుండెను. గత ప్రకరణాంతమునఁ జెప్పఁబడిన భయంకరకార్యము జరుగుచుండిన సమయమున నోరుగల్లునుండి వెడలి యంబాల గ్రామోన్ముఖులై వచ్చుచుండిన యుద్ధాశ్వికభటులు హఠాత్తుగ నారంగమున వ్రాలిరి. గ్రొత్తగా వచ్చుచుండిన వారి స్వల్పసంఖ్య బందిపోటుగాండ్ర కేమాత్రమును భయమును గలిగింపక వారిని తమపని యథేచ్ఛముగఁ జేయనిచ్చెను. వెనుకఁజెప్ప బడిన విధమున నాదోఁపికాండ్రనాయకుఁ డాసుందరికుత్తుకను గత్తితోఁ దెగవ్రేయ నుంకించుచుండెను. మఱియొక నిముసమున కానిర్దోషియగు నాకోమలి పరలోకగామినియై యుండును. కాని, యాగంతుకులలో నొక్కరుఁడు వెనుకనుండి యాఘోర కార్యమునకై కే లెత్తిన యానాయకుని కేలు నెత్తినట్లే తటాలునఁ దనపట్టాకత్తియొక్క తీవ్రమును సమయోచితమును నగు వ్రేటచే నేలఁ బడవేయునంతవఱకు నొక్కఁడేనియు నిట్టిపని జరుగు నని యెంచియుండలేదు. ఇఁక రెండవయాశ్వికుఁడు తక్కిన బందిపోటుగాండ్రపని చక్కఁబెట్టసాగెను. నాయకుఁడు తనకు సంభవించిన యాపదకు దల్లడిల్లుచు బ్రతుకుజీవుఁడా యని పిక్కబలముఁ జూప, తన యనుచరులకు మార్గదర్శి యయ్యె.

మన కథానాయిక ప్రాణములఁ గాపాడిన మొదటి

యాశ్వికుఁ డందమైనమోమును, స్ఫుటమగు తేజమును గలిగి యుండెను, కాని పురుషసౌందర్యమునుమాత్రము సంపూర్ణముగ నొనర్చు మీసము లాతనిముఖము నలంకరించి యుండలేదు. తన్నుజంప సిద్ధముగనుండిన దోఁపిడికానిని రూపుమాపి ప్రాణదానమొనర్చిన యాగారౌతుపై నాసుదతి కృతజ్ఞతావలోకనములఁ బరపి, స్వీయభావమును వెల్లడింప యత్నించెను. కాని యానందాతిశయ మామె నోటమాట వెలువడనీయలేదు. ముత్తియములవంటి బాష్పకణము లామె కనుదమ్ములనుండి పరంపరగ వెడలి నునుజెక్కులపై జాఱుచు నప్పటికే దేదీప్యమానముగ వెలుంగుచుండిన చంద్రకిరణప్రతిఫలనముచే ధగ ధగ వెలుంగుచుండెను ఆమె మనమ్మున వెల్లివిరిసి పారుచుండిన భావములను ముఖమున జదివిన యయ్యాశ్వికుని హృదయము చాలజాలినొందిన ట్లగపడియె. అంత నాతఁ డప్రయత్నముగ ముందడుగిడి యాముద్దియను తనవక్షమున కదిమికొని కన్నీరుగార్చుచుండుటయు, మైలుదూరమున వెనుకఁ బడియుండిన యాముద్దరాలి భర్త యాస్థలమునకు వచ్చుటయు నొక్కపరియే సంభవించెను. తస్కరనాయకుని తెగిపడిన హస్తమును, రక్తపుమడుగులును, బోయల చిన్నవోయిన మోములును, నాయుధపాణులగు క్రొత్తమనుష్యుల తెఱంగును, నాతనికి జరిగినకథ చెప్పకయె చెప్పెను. ఆరంగమునుజూచి వివరముల నెఱింగినతోడనే దుఃఖమును, సంతసమును, కృతజ్ఞతయు నొక్కతని హృదయమ్మున ముప్పిరిగొనెనో వర్ణించుట యసంభవము.

'యమునా! యనుమాట నోటవెడల నాపురుషుఁడు తనభార్యను కౌఁగిలించుకొనెను యమునయుఁ బ్రాణేశున కెదురుగఁబోయి, యాతనికంఠమున బాహులతలు వైచి వెక్కి వెక్కి యేడ్వసాగెను.

అంత, ప్రతాపుఁడు భార్యనూఱడించుచు నిట్లుపల్కెను. "నెచ్చెలీ! ఏడువకుము, దైవము నేఁడు మనపాలిఁట నుండుటచేత, నీయాశ్వికరూపమున వచ్చి నీప్రాణమును, దన్మూలమున నామానప్రాణములఁ గాపాడెను. లేనిచో ." యని యింకేమా పలకఁబోయి తనప్రియభార్యను రక్షించిన యాయాశ్వికునివంకఁ జూచి వినయముతో నిట్లుపల్కెను. "అయ్యా! తమయుపకారమును దగినవిధమున శ్లాఘింపఁజాలను నేనేమి ప్రత్యుపకారమొనర్పఁగలను? మముఁబోలు మందభాగ్యుల రక్షణమునకై యీశ్వరుఁడు మిమ్ముఁ జిఱకాలజీవులుగ నుంచుఁగాక!"

ఆశ్వి:—"అయ్యా! మేమంతటి శ్లాఘనీయకార్యము నేమియుఁ జేయలేదు. ఏమైనఁ జేసితిమేని యది మాకర్తవ్యమే యగును గాని యంతకన్న నేమియులేదు. ఈసుందరిప్రాణముఁ గాపాడఁగల్గినందు కెంతయు సంతోషముగ నున్నది. మేమిఁకఁ బోయెదము. ఈగౌతు మీవెంట నీయరణ్యము దాఁటువఱకు రాఁగలఁడు. పాపమీసుందరిని వదలిపోవుటకు నాకిష్టముగ లేదు. అయినను అట్లుచేయకతప్పదు. మీగ్రామ మెద్దియో తెల్పిన నొకమా ఱచ్చటికి వచ్చి మిమ్ముదర్శించి ధన్యతనొందెదము."

ప్రేమా.—ఇంతకన్న నానందప్రదము నాకు మఱేదియు నుండదు. ఇచ్చటికి కొలఁది మైళ్లు దూరమునున్న రుద్రవరము మా నివాసగ్రామము. తమరు మా గృహమును దప్పక పావనమొనర్చి మా యాతిథ్యము నంగీకరింపవేఁడుచున్నాము.

ఆశ్వి —'సుందరీ! సెలవు. అయ్యా! సెలవు!'

యమునాప్రతాపులు — "అయ్యా! వందనములు; మాకమితోపకారమొనర్చిన తమ పవిత్రనామమును మేము విన వేఁడుచున్నాము. అంతలో నయ్యాశ్వికుఁడు కొంత దవ్వేగియుండెను. వారి ప్రశ్నమున కిచ్చిన ప్రత్యుత్తరమున రుద్రదే .' అను మాత్రము వినవచ్చెను. అతని పేరు "రుద్రదేవుఁ"డని వారు నిశ్చయించుకొనిరి

III

యమునాప్రతాపుల వాసస్థలమగు రుద్రవరము చిన్న గ్రామమైనను అందముగ నుండెడిది. ఈ కథ ప్రారంభమగుటకు కొలఁదిసంవత్సరములకుఁ బూర్వము, పితరులు పరలోకగతులైనందునఁ బ్రతాపుఁడు స్వత్వకములగు భూములఁ దన వశమునకుఁ దెచ్చికొనవలసినవాఁడాయెను. అతని వార్షికాదాయము కొన్నివేల రూప్యముల పరిమితి కలిగియుండెను. రుద్రవరములోని యాతనిగృహము రాజభవనమువలెఁ గడురమ్యమై చక్కని యుద్యానవనమునకు నడుమ నుండెను. ఆవరణపు

గోడలు మిగుల నెత్తుగనుండి, దాని యుత్తరదిశను నట్టనడుమ నొకగొప్ప కమానును, అంతర్మందిరపుసింహద్వారమున కెదురుగ గంభీరాకృతిం బ్రకాశించుచు, నా గృహమున నివసించుచుండు దంపతుల గొప్పఁదనమును జాటుచుండును. యమున కాపుర మునకు వచ్చిన నాల్గు సంవత్సరముల నుండియుఁ బ్రితాపుఁడు సంసారసౌఖ్యములను సంపూర్ణముగ ననుభవించుచుండెను. ఆమె హృదయము కడుమృదులము, పరిశుద్ధమునై యుండెను. తాను భర్తను మనఃపూర్వకముగఁ బ్రేమించుచు, నతనివలన గాఢ ముగఁ బ్రేమింపఁబడుచుంటి నను నానంద మామెహృదయ మును సర్వదా సంతుష్టిం గల్గించుచుండెను.

ప్రితాపుఁడుసైతము భార్యను మనఃపూర్వకముగఁ బ్రేమించువాఁడే, అయినను, ననురాగమున గానికిప్పు లగు స్త్రీలు, పురుషుల నెంతగాఢముగఁ బ్రేమింపఁగలరో, పురుషులు స్త్రీలనంతగాఢముగఁ బ్రేమింపగల్గుట కొన్నిపట్టుల నసంభవము గదా! పురుషులహృదయము బహుసులభముగ సందియములకుఁ దావొసంగును. యమునప్రాణములు రక్షింపఁబడిన యానాఁడు వారింటికి నచ్చి చేరినప్పటినుండియుఁ బ్రితాపుని యమలినహృ దయమున నేదియో మాలిన్యము ప్రవేశించెను. వస్త్రముపైఁ బడిన మచ్చను గడిగివేయవచ్చును గాని హృదయమునఁబడిన మచ్చను దుడిచివేయుటదుస్సాధ్యము. నీవితరుని వెలగల ముత్తి యమును పొరపాటునఁ బగులఁగొట్టితివేని, దానికిఁ బ్రతిగఁ

దమూల్యమగు ధనమునిచ్చిన నీ నేరము తీఱిపోవును, కాని నీ వాక్కునిమనస్సును జితుకఁగొట్టితివేని ప్రపంచమునఁగల యెట్టి యమూల్యమగు వస్తువు నిచ్చినను నాకొఱంతఁ దీర్పఁజాలదు. దురదృష్టకారణమగు నాఁటినుండియుఁ బ్రతాపుఁడు క్రమక్రమముగ విచారాందోళిత మనస్కుఁడై ప్రవర్తించుచుండెను. భార్యయెదుట నున్నవేళ సంతసమును వ్యక్తపఱచుచు, నెవ్వరును లేని తరుణమున దీర్ఘ విచారసాగరమున మున్గియుండును. ఈస్థితి నానాఁటికి హెచ్చెను. అంతకు మున్నుదినము ప్రేయసితోఁ గూడ సాయంసమయములందు గృహారామమున విహారమొనర్ప నలవాటుపడియుండిన ప్రతాపుఁడు, ఒకనాఁడు తల దిమ్ముగ నున్నదనియు, మఱియొకనాఁడు గాలి కడుఁజల్లఁగ వీచుచున్నదనియు నేదేవో మిషలఁ బన్నుచు విహారములను మానెను. విశ్రమసమయములం దభ్యంతరగృహమున యమునసరసఁ గూర్చుండి వినోదసంభాషణములఁ బ్రొద్దుపుచ్చు నాతఁ డట్టి యవకాశము లభించినపుడు, ఉక్కగా నున్నదనిగాని, వాకిట నెవరో పిలుచుచున్నట్లున్నదనిగాని పలుకుచు లేచిపోవును. ఏకాంతమాతని కెక్కువ రుచించునట్లు కన్పట్టసాగెను. స్వవ్యవహారములను గడుజాగరూకతతోఁ గనుపెట్టుచుండు తనతొంటి యభ్యాసమును మానుకొనఁజొచ్చెను. పనికలిగి వచ్చు పెద్దమనుష్యులతోఁ బూర్వమువలె వివరముగ మనసిచ్చి భాషించుట మాని నాల్గుమాటలతో సరిపుచ్చి వారి నవ్వల కంపివేయుచుం

డును. యమున భర్తయొక్క యిట్టి మానసికావస్థకుఁ గారణ మారయఁ బలుమారులు యత్నించెను. కాని యామె యత్నములు వ్యర్థములయ్యెను. ప్రతాపుఁ డామెపలుకు నర్థగర్భములగువాక్యముల నొకప్పుడు ఖండింపుముగను, వేఱొకప్పుడు కసరుకొనియు నిచ్చుప్రత్యుత్తరము లారంభము లయ్యె. ఆముఖవికాసము, ఆమందహాసము, ఆ యనురాగప్రకటనము అంతయు మాయమయ్యెను. ఈమార్పులు యమున నిర్మలహృదయమును జింతాసముద్రమున ముంచివైచెను. భర్తమనస్సునకుఁ దాత్కాలికవిశ్రాంతియైన కలిగించునను నాశజనించి, యామె మిగుల జాలి బుట్టించు నానాఁటి తన ప్రాణరక్షణావృత్తాంతపుఁ బ్రసక్తిఁ దెచ్చి, ముష్కరుఁడగు నాబందికాండ్రనాయకుఁడు తన యనుచరులఁ గొనఁబూనినవిధమును, రుద్రదేవుఁ డాదుర్మార్గుని చేతిని నఱికి యాబందిపోటునాయకుని బరుగెత్తించినవిధమును, మనసు కరగునట్లు చెప్పఁబూన నతని దృక్కులుకొంచెము ప్రసన్నములుగ మాఱినట్లామెకుఁ దోఁచెను. కాని తరువాత జవ్వని, రుద్రదేవునియెడఁ గృతజ్ఞతఁ జూపినపుడెల్ల నతని హృదయము మఱింత ఖిన్నమై యుండుటయు, నొక్కొక్కప్పుడు రుద్రదేవుని పేరామె పెదవులనుండి వెడలునప్పు డతఁడు భార్యముఖమునఁ దనదృష్టిని దీక్షముగ నిల్పి, యామె హృదయాంతరాళము నన్వేషించువానివలె నగపడుటయు, సంభవింపుచుండెను. ఈలక్షణములనుబట్టి యమున భర్తహృదయమును గలంచుచున్న విచార

కారణమును గొంతవఱకు—కాదు సంపూర్ణముగఁ బోల్చుకొనఁ గల్గెను. ఆమె నిర్దోషియగుట నిశ్చయము. యమున మానసము గంగాంబువువలెఁ బవిత్రమైనదని మన మెఱుఁగుదుము, కాని, ప్రతాపు నెట్లు నమ్మింపఁగల్గుదుము? తన హృదయమును విచ్చి భర్తయెదుటఁ బెట్టి భర్త యంతస్తాపముం దీర్ప యమున పలుమారు తలఁచుకొనెను, కాని యెంతమాత్రమును నాతని 'హృదయశల్యము' పీడఁగల్గినదో నంతకుఁ బూర్వమామె భర్త యెడఁ జూపియుండిన నిశ్చలానురాగమును, నామె పవిత్రప్రవర్తనము నాతని మనస్తాపముం దీర్చియుండఁగూడదా? ఇట్టి భావము లామె నట్టియుద్యమమునుండి మఱలించెను. మానవ హృదయము విచిత్రమగు క్షేత్రము. అందొక నిముసమునఁ బరిమళవంతములై ఘ్రాణతర్పణములగు కుసుమము లుదయించును, మనోజ్ఞములగు ఫలములు పండును, వేఱొకనిముసమున నాహృదయక్షేత్రముననే కంటకావృతమైన విషవృక్షము లచటఁ బాదలమై దుష్టఫలయుక్తమగును. ప్రతాపుని మనోక్షేత్రమీ విధముగ మాఱుటఁ జదువరులు తెలిసియున్నారుగదా! అక్కటా! ఈహృదయశల్యము పోవుటెట్లు?

IV

ఈ విధముగ దినములు గడచెను. యమునప్రాణములు రక్షింపఁబడిన యా యదృష్టదినము—కాదు—దురదృష్టదినము

గడచి నేఁటికి మూఁడుమాసములయ్యెను. వారిభవనము నాశ్రయించి యుండిన యారామములోని వృక్షతతియు, లతావితానములును నవవసంతసమాగమమున, నవనవలఁ జిగుర్చెను. కుసుమసంతానము తెపు గంధమును, ఎల్లయు దేవ్రని ముఖములను పలు దెసలకుంప యుత్తరమారుతములఁ బంపింపఁ జేయసాఁగెను. ఉద్యానవనములలోని కేళాకూళుల స్వచ్ఛసలిలముల కడకు జల విహంగ మిథునములు మాటిమాటికివచ్చి జలక్రీడలు సల్పుచు పరస్పర సహవాససౌఖ్యముల నవ్వారిగా ననుభవించుచుండెను కాని దైవ నిర్మితము లగు నీసౌఖ్యసాధనములలో నొక్కటయేనియు సంతప్తహృదయులగు యమునా ప్రతాపులకుఁ జిత్తవిశ్రాంతి నియ్యఁ జాలవయ్యె. ఇన్నిసంవత్సరముల సహవాసము ననుభవించినతరువాతఁగూడ భర్తృవియోగాంతరంగము నెఱుంగఁడయ్యెఁగదా యను సంతాపమామెను మఱిమఱి బాధింపఁజొచ్చెను "దైవమా ! నాకేల యిట్టిచిక్కులఁ దెచ్చిపెట్టితివి ! బందికాండ్రచేతులలో నసువులఁ బాయనున్న నన్నానాఁడు రక్షింపకుండిన నీకేమిచేటు మూడియుండును ? ఓమాయలమారి రుద్రదేవా ! నీహృదయ మెట్టిదో నేనెఱుంగను కృతజ్ఞతాభారవివశనై యున్న నన్నానాఁ డేలదయగలవానివలె దగ్గరకుఁ దీసికొని నానాథుని మనస్సు నను మానము పాలుచేసితివి దయావిధివగు నోదైవమా ! ఇప్పుడైన నెట్లో నాప్రాణములఁబాపి నాకు సంతసమును నాజీవితేశ్వరునకు శంకారాహిత్యమును, నేలకల్గింపవు !" అని కన్నీరు మున్నీరుగ

నేడ్చుచుండెను. ఆదంపతుల మనోవ్యాకుల మిట్టిదశ నుండినదిన ములలో నొక్కనాఁ డకస్మాత్తుగ రుద్రదేవుఁ డని యాదంపతు లనుకొనిన యాయ్యాశ్వికుఁడు వారియింటికి వచ్చెను.

ప్రతాపుఁడు రుద్రదేవు రాకనినఁగానే మనస్తాపమును మఱుగుపఱచి సగౌరవముగ నతని నెదుర్కొని లోనికిఁ దోడితెచ్చెను. తన చేయఁబడిన యాతిథ్యమునకు రుద్రదేవుఁడు కృతజ్ఞతఁ దెల్పెను. యమున కనఁబడినప్పుడు తయ్యతిథి యామెను కుశల ప్రశ్నముచేసెను. కాని, యుత్సాహపూర్వకముగఁ బ్రత్యుత్తరము నామెచేఁ బలుకఁజాలఁడయ్యె. ప్రతాపుఁ డెంతెసంతోసము జూపినను, నాదంపతుల హృదయాకాశములందుల ముడుగులు కలుగ మొదలుచుండిన కంటకముల నాతఁడు కనిపెట్టకపోలేదు. ఇన్నివిధముగ నాయతిథి రెండుదినములచ్చటఁ గడిపెను. ఈ రెండుదినములును యమునకు రెండుయుగములుగ గడచెను. ఈదినద్వయమును నామెమనస్సు చిత్రవిచిత్రములగు తర్కవితర్కములమునింగి కర్తవ్యమును నిర్ణయింపఁజాలక తొట్రుపడుచుండెను. ఎవ్వాఁడు తనభర్తమానసి కాస్వస్థతకుఁ గారకుఁడయ్యెనో-తనచింతకు హేతుభూతుఁడయ్యెనో-అట్టి రుద్రదేవు నామెమనస్సునఁ బరిపరి విధముల నిందించుచుండెను. ఆతఁడు వచ్చినదాఁది వెడలిపోక దినములు గడపుచుండిన యాతనియునికి యామున దుఃఖసముద్రమున క్షోభింపఁజేయుచుండెను. తుదకామె నెనుకముందాలోచింపక-భర్తయే మనునో యని తలంపక- తనప్రాణములను

రక్షించిన రుద్రదేవునియెడఁ గృతజ్ఞతను నవహింపక—క్రోధావేశ పరవశయై, భర్త సన్నిధినుండఁగనే మూఁడవనాఁడు కన్నుల జలజల బాష్పములు రాల, రుద్రదేవునిదిక్కు మొగమై యిట్లనెను "చాలు, చాలును, బహుమంచివాఁడ వయ్యా నాఁటి నీదుశ్చేష్టమూలమున నాపచ్చని కాపురము పాడై పోవుదినముఁ దెచ్చితివి! ఆవిధముగ మాగార్హస్థ్యసుఖమును దగ్ధముచేసి యంతటితోఁ బోవక, మరల యిటకు వచ్చి మమ్ము వేధించుట నీకు న్యాయమా? సిగ్గులేదా?"

అని పరుషవాక్యములఁ బల్కునప్పుడు కనుసన్నచే పరితాపుఁడు భార్యను వారింపనెంతయు యత్నించెనుగాని, యామెని గోర్కె నెఱవేఱదయ్యె. ఆమాటలకుఁ బెదవులపై నాట్యము సేయుచుండిన చిఱునగవును బలవంతముగ నడఁచుకొని యామెకన్న నెక్కుడుక్రోధము నభినయించుచు రుద్రదేవుఁ డిట్లనెను. "అమ్మా! నే నేల నిందింపఁబడుచున్నానో యెఱుఁగను. నాఁడు నిన్నుఁ గాపాడుటయే నేచేసిన ఘోరపాపమైనదో, పరోపకారమహాత్మ్యమును నాకుఁ గడుఁజక్కగ బోధించితివి! ఆనాఁడు నీభర్త నారాకను గోరినందున, నే నిటు రా సాహసించితిని. తినఁ గూడులేక మీసత్రమునకు వచ్చినవాఁడఁగాను నాకును నలుగురఁ బోషింపఁదగుస్థితి కలదు మీకిట్టి యగౌరవభావమున్నదని నాకు వచ్చినతోడనే తెలిసియుండినచో రెండుదినములు నీగా యింట నుండువాఁడ గాను" అని యాయతిథి యనుచుండఁ దన

భార్యమూలముగ నయ్యాగంతుకునకు గోపమొదవుట కెంత
యుఁ జింతిల్లి ప్రతాపుఁడు యమునను ముఖము వాచునట్లు
చీవాట్లుపెట్టె రుద్రదేవునికిఁ దనభార్య పిచ్చితనమును బోధించి
శాంతింపఁజేయఁజూచెను, కాని యాతఁడు ముఖలక్షణములను
మార్చక చావడిలోనికేఁగి కూర్చుండెను. ప్రతాపుఁడు జరిగిన
దానికి వగచుచు వాకిట నిలువఁబడియుండెను. అంతలో 'జరీబు
టుదారి యల్లికపనిచే' దళసరిమైనయు నల్లపట్టుబట్టతోఁ జేయఁ
బడిన సైనికపు దుస్తులను ధరించి, స్థిరకాయుఁడుగనున్న యొక
యాశ్వికుఁడు మందిరద్వారముకడకు వచ్చి యచట నున్న
ప్రతాపునిఁజూచి, గుఱ్ఱమును దిగి, నమస్కరించి "అయ్యా!
మూఁడుదినములక్రిందట నిచటికి వచ్చిన మామహారాణి శ్రీరు
ద్రమదేవిగారిని వెంటనే దర్శింపవలసియున్న" దని గంభీరస్వర
ముతోఁ బల్కెను. "మహారాజ్ఞిగా రిచ్చటి కేలవత్తురు" రను
మాట ప్రతాపునినోట వెడలఁబోవుచుండునంతలో, చావడిలోఁ
గూర్చుండియున్న రుద్రదేవుఁడు ద్వారముకడకు వచ్చి నిలచెను.
అంత నాకొత్త యాశ్వికుఁడు రుద్రదేవుఁడని మనము వ్యవహ
రించుచున్న యాపురుషునిజూచి వంగి సవినయముగ జోహా
రొనర్చి యిట్లు విన్నవించెను. "అమ్మా! మహారాజ్ఞిగారి
యానతిప్రకారము రెండువందల భటులు వాకిట సిద్ధముగను
న్నారు. దేవిగారికొఱకు పల్లకి నాయత్తపఱుతుమా! లేక
యశ్వము నాయత్తపఱుప సెలవా? దేవియ్యా" యని మగల

నొకమారు జోహారొనర్చి తలవాల్చి నిలచెను. 'పల్లకి చాలును రెండుగడియలలో మన మోరుగల్లు చేరవలెను. జాగ్రత్త' అని పల్కి రుద్రదేవుఁడు—కాదు మహారాజ్ఞియగు శ్రీరుద్రమదేవి—నుడివెను. అంత నయ్యాశ్వికుఁ డచ్చోటువాసి పోయెను. ఆసంభాషణములను వినిన ప్రతాపుఁడు తత్తఱపాటుతో లోని కఱగి యంతకుముందు తనభార్యచే నిందితయైన వ్యక్తి, త్రిలింగ సామ్రాజ్యమునకు రాణియగు శ్రీరుద్రమదేవియని యమునకుఁ దెల్పి వెంటనే యామెను గూడఁ గొనివచ్చి, యిరువురును మహారాణీగారి పాదరాజీవము లపైఁ బడి తమ యపరాధమును మన్నింప వేఁడుకొనిరి.

రాణి మందహాసముతో నాదంపతులను లేవనెత్తి సాదరముగ నిట్లుపల్కెను. "అమ్మాయీ! నీవు నిందించితివనినాకుఁ జింతలేదు. నేను క్రోధము నభినయించితినే గాని యనుభవింపలేదు. ఆనాఁడు స్త్రీ జాతికి సహజమగు హృదయమార్దవము చేతను, అనేక దుఃఖముల ననుభవించిన నామనస్సునకు నీవపుడనుభవించు దుఃఖము జ్ఞప్తికి వచ్చుటచేతను, నావేషస్వభావమును మఱచి జాలిచే నిన్నుఁ గౌగలించుకొంటిని; కాని పురుషవేషముననున్న నేనట్లుచేయుట నీ భర్త కనుమానము నాపాదించు నను మాట తరువాత స్మరణకు వచ్చి, మిమ్ముల మఱలనొకమారు దర్శింప ననుజ్ఞవేఁడి యిపుడు మీయాతిథినై యిటకు వచ్చితిని. నీ నిష్కాపట్యస్వభావము

నకును మీపరస్పరాను రాగమునకును నానందించితిని, కాని కొంతకాలము మీ మనస్తాపమునకుఁ గారణభూత నైనందులకు నన్ను మీరు మన్నింపవలెను" అని రుద్రమదేవి యనెను.

అంత నా దంపతులు దేవికి మఱల మఱల వందనము లర్పించి 'దేవిగారియెడఁ జేసిన యవజ్ఞతను క్షమింప వేడవలసినది మేము కాని తమరు కాదని' కేలుమోడ్చి భయభక్త్యాశ్చర్యావేశములతోఁ గన్నుల నానంద బాష్పముల రాల్పసాగిరి

అంతలోఁ బల్లకివచ్చి వాకిట నిలిచెను. దేవి దాని నెక్కఁబోవుచు నా దంపతుల నాశీర్వదించి యిట్లనెను "మీ హృదయశల్యమిఁక పీడించదని నేను దృఢముగ నమ్మవచ్చునా" అన నా దంపతులు, "దేవిగారి యనుగ్రహము చేత నిస్సందేహముగ వదలినది" అని పునఃపునఃప్రణామము లొనర్చిరి. మహారాణీగారి రథ్యాంబు యాందోళిక బోయల యొంకారనాదములతో సంప్రస్థిత మయ్యెను.

---

*ఆంధ్రపిత

(ఆపస్తంబమహర్షి)

విశ్వామిత్రమహర్షి, ప్రాణభీతిచే దనను శరణుజొచ్చిన శునశ్శేపుఁడను దేవరాతుని రక్షించుటయేగాక, దేవరాతుఁడు, "నేను అజీగర్తుని పుత్త్రుఁడనుగాను నీ బిడ్డఁడనే" యనుటచే నతికరుణాసమన్వితుఁడై "ఆంధ్ర, పుళింద, పుండ్ర, శబర, మూతిబ, మధుచ్ఛంద, అష్టక, రేణుక, ఋషభ," నామముల నొప్పు వారధ్యక్షులుగాఁగల తన నూర్వురుపుత్త్రులం బిలిచి, "మీరీ దేవరాతుని మీసోదరునిగాఁ జేసికొనుటయేగాక, మీ యందఱికి నగ్రజునిగాఁ గూడ నంగీకరింపుఁ"డన, మధుచ్ఛందుఁడును, నాతని యనుజులగు 'అష్టక, రేణుక, ఋషభు'లను వారధిపులుగాఁగల యేఁబది విశ్వామిత్రులును శునశ్శేపుని దమసోదరునిగాను, నగ్రజునిగాను గూడ నంగీకరించిరి. కాని, మధుచ్ఛందునికంటెఁ బెద్దవారగు "ఆంధ్ర, పుళింద, పుండ్ర, శబర, మూతిబ" సంజ్ఞలతో నొప్పు నేఁబదిమంది విశ్వామిత్రులును, తండ్రిమాట కెదురాడి "శునశ్శేపుని మేము సోదరునిగాను, నగ్రజునిగాను గూడ నంగీకరింప"మనిరి. అందులకు సులభక్రోధియగు విశ్వామిత్రుఁడు తనమాట నతిక్రమించిన యాంధ్రా

---

* ఇది ఆపస్తంబ సూత్రములు, మన్వాదిస్మృతులు పురాణములు, ఐతరేయబ్రాహ్మణము పరిశోధించి వ్రాయఁబడెను.

దులపై నలిగి (1) "మీరు వేయిసంవత్సరములు నీచవృత్తులఁ జరింపుఁ" డని శపించుటయేగాక, వారికేమియుఁ దన యాస్తి నీయక, తనయాశ్రమమునం దుండనీయక వెలివైచెను. వృత్తిహీనులైన యాంధ్రాదివైశ్వామిత్రులగు "పుండ్ర, పులింద" సంఘములవారు. "ఆయుధజీవు"లై కాలాంతరమునఁ దమ పేరి రాజ్యములను స్థాపించుకొనిరి. శబరు లారణ్యకులై కొందఱును, అథర్వవేదవేత్తలై 'క్షుద్రబోతుతనము' నేర్చి, మఱి కొందఱును జీవించిరి. క్షుద్రబోతుతనము గలవారి విద్యకందుచే 'శాబరవిద్య' యను నామము పిమ్మటఁ గలిగెను. మూతిబులును ~~చేతనే~~ నారణ్యకులై యుండి వివిధవృత్తుల నవలంబించి జీవించిరి.

ఆంధ్రులు తండ్రిచే నిస్సారితులై జీవనాధారముకై కొందఱు బ్రాహ్మణవృత్తిని, మఱికొందఱు ఆయుధధారులై క్షాత్రవృత్తిని, వేఱుకొందఱు వైశ్యవృత్తిని, అనక్షరులు సేవకావృత్తిని నవలంబించి నాల్గుశాఖలుగా విడిపోయిరి.

వైశ్యవృత్తి నవలంబించిన 'కాలదమనుఁడు' అనునాంధ్రుఁడు విశ్వామిత్రునికి విరోధియు వశిష్ఠపుత్రుఁడు నగు శక్తిమహర్షికి శిష్యుఁడై ప్రవర్తించెను.

---

(1) విశ్వామిత్రుఁడు, శునశ్శేఫుని సోదరునిగా నంగీకరింపని తన పుత్రులను వేయిసంవత్సరములు మాత్రమే నీచులుగండని శపించినట్లు శ్రీమద్రామాయణములోని బాలకాండమునఁ గలదు. వేదమునఁ గాలనియతి చెప్పఁబడలేదు.

ద్విజత్వము నవలంబించిన యాంధ్రులను, తదితరు లగు నార్యసంఘములవారు, తండ్రిచే వెలివెట్టఁబడినవా రగుటచేఁ బ్రాయశ్చిత్తార్హులనుగా నెంచి వారిని (1) "వ్రాత్యు" లనిరి. స్వాశ్రమములనుండి తరుమఁబడినవా రగుటచే నాంధ్రులను (2) ద్రావిడులని కూడఁ గాలాంతరమునఁ బేర్కొనిరి.

ఇట్లుండఁ గొంతకాలమునకుఁ గురుపాండవయుద్ధ మేతెంచెను. యావద్భారతఖండస్థసంఘములవారు నాసంగ్రామమునఁ జేరినట్లు మనయాంధ్రులలోని యాయుధజీవికులును గౌరవపక్షమునఁ జేరి, పోరి, పెక్కండ్రు మడిసిరి.

భారతయుద్ధానంతరమునను దత్పూర్వమునను గల్గినసాంఘిక ధర్మవిప్లవములలో మన యాంధ్రులును బ్రహ్మచర్యాది నియమములను బురుషులును, బాల్యవ్రత్యములను స్త్రీలును బాటింపనందునఁ బెక్కువిధముల నీయాంధ్రులు భ్రష్టులయిరి. నాఁడాంధ్రులు విస్తారముగాఁగల 'సాల్వ'దేశమున నారణ్యకపశువులు విస్తారముగా నుండుటచేతను, పశుభక్షణ మాకాలమునందంతగా నిషిద్ధము కానందునను, ఆంధ్రులలోఁ గొంద ఱారణ్యక పశువులను వేఁటాడి యామాంసమునమ్మి జీవించుచుండుటచేత

(1) వ్రాత్యశబ్దమునకు "ప్రాయశ్చిత్తార్హుఁ" డను వ్యుత్పత్తిని గొందఱు వైయ్యాకరణులు సాధించిరి దీని నాపస్తంబుఁడు వేఱుగ నిరూపించిన యంశము ముందు వ్రాయఁ బడును

(2) ద్రావిడులకు "తరుమఁ బడినవారు" అని వ్యుత్పత్త్యర్థము.

నాన్నృత్తినసహ్యాంచుకొను'మనువు' తనస్మృతిలో (1)"మేదరులు, ఆంధ్రులు, చెంచులు, అరణ్యకపశువులను హింసించి జీవించువారు" అని నింద్యముగా వ్రాయుటకుఁ గారణమయ్యెను.

మఱియు 'అనులోమ, ప్రతిలోమ' వివాహములవలన నైన సంకరోత్పన్నజాతివా రాంధ్రులని కూడ మనువువ్రాయుటమాత్ర మతిశయోక్తియు, నసూయాజనితవాక్యము నని తలంపవలసియున్నది.

భారతీయుద్ధమునఁ బురుషక్షయము కలుగుటచే నైన విపరీతసాంఘికపరిస్థితులను సవరింప జనమేజయాది మహారాజులును, 'ఉద్దాలక, నాక, కుమారహారీ'త్యాది మహర్షులును యత్నించిరి. (2) ఉద్దాలకుని పుత్రుఁడును మహామేధావియు నగు 'శ్వేతకేతుమహర్షి' విచ్చలవిడిగ స్త్రీపురుషులు తిరుగ రాదని వివాహనియమము నేర్పఱిచెను. (3) పిమ్మట యాజ్ఞవల్క్యమహర్షియు నాతని ప్రశిష్యుఁడగు 'బోధాయన' మహర్షియు మఱికొన్ని సాంఘిక, రాజకీయనియమముల నెలకొల్పిరి. ఇంచుమించుగ బోధాయనుని కాలమునందే హస్తినాపురము గంగాప్రవాహమునఁ గొట్టుకొని పోఁగా 'నిచక్షుఁ'డను పాండవ వంశపురాజు 'కౌశాంబి' పట్టణమును రాజధానిగాఁ జేసికొనెను.

(1) చూ మనుస్మృతి 10 అధ్యా.

(2) ఈయంశము బృహదారణ్యకోపనిషత్తునందు గలదు.

(3) మహాభారతములోని ఆదిపర్వమున నిది గలదు.

ఆకాలమునందే జరాసంధునివంశజులలోఁ గడపటివాఁడగు 'పురంజయుఁడు' మగధరాజ్యము నేలుచుండెను. యమునాతీరమునం దుండిన 'సాల్వ'దేశము నాంధ్రక్షత్రియుఁ డగు 'యుగంధర' మహారాజు 'మనుమార్గవర్తియై' పాలించుచుండెను. ఆకాలమునం దారాజ్యమునందు, ఏమహర్షియొక్క ధర్మములు 'యాజ్ఞవల్క్య, పరాశ'రాది స్మృతికర్తలచే గ్రహింపఁబడెననివారు తమ స్మృతులలో వ్రాసికొనిరో-ఎవ్వానినామమును 'పాణినిమహర్షి' తన యష్టాధ్యాయి'లో స్మరించెనో—ఏమహర్షి చెప్పిన విధులచే సౌరాష్ట్రాది పశ్చిమోత్తర భరతఖండస్థదేశములలోని బ్రాహ్మణులే గాక దక్షిణాపథములోని 'మహారాష్ట్ర, కర్నాట, ద్రవిడదేశస్థబ్రాహ్మణులలోని శతసహస్రసంఖ్యాకులును, ఆంధ్రదేశములోని బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర నామములతో నొప్పు రెండుకోట్లమంది జనులును, 'శ్రౌత'స్మార్త,నిత్య, నైమిత్తిక' కర్మలను సమంత్రకముగనో, యమంత్రకముగనో నేఁటికిని నెఱవేర్చుకొనుచుండిరో—ఎవనిసూత్రవిధులచేఁ దాము పవిత్రుల మైతిమని 'నన్నయమహాకవి' మొదలు నేఁటివఱకుఁ గల యాంధ్రమహాకవులలోని శతసంఖ్యాకులు తమగ్రంథములలో వ్రాసికొనుచుండిరో-ఎవనిసూత్రములకు'హరదత్త, రుద్రదత్తాది' భారతీయ మహాపండితులే గాక, 'వింటర్నిడ్జు, బూలర్' మొదలగు ఖండాంతరపండితులును మెచ్చుకొని బహువిధముల వ్యాఖ్యానించిరో—ఎవని 'శుల్బ' సూత్రములలోని 'క్షేత్రరేఖాగణిత'

విధానముఁ జూచియు, ఖగోళవిజ్ఞానము నాలోకించియు నేఁటి ప్రపంచమునఁగల సర్వదేశపండితులును నాశ్చర్యచకితు లగు చుందురో, (1) ఎవని వేదాంతసూత్రములపై శంకరాచార్యుల వారు 'అద్వైతపరముగ' భాష్యము వ్రాసిరో, అట్టి మహామేధావి—విజ్ఞానఖని—బ్రహ్మవర్చస్వి—బ్రహ్మవాది—ఆంధ్రజాత్యుద్ధారకుఁడు, నగు 'ఆపస్తంబుఁడు' అను మహర్షి జన్మించెను.

(ఈమహర్షి విశ్వామిత్రునిచే స్వాశ్రమమునుండి వెడలఁ గొట్టబడిన, వారిలో నాంధ్రసంఘములోనివాఁడై నట్టియు శక్తి మహర్షికి శిష్యుఁడై, వైశ్యవృత్తి నవలంబించిన 'కాలదమునుని' యాపస్తంబావతారమని యొకపురాణము చెప్పుచున్నది (2)

ఈమహర్షి యొక్క మాతాపితల నామము తెల్లియో తెలియవుగాని 'అక్షసూత్రి' యను నామె యాపస్తంబుని భార్యయనియు, 'కర్కి' యనునాతఁ డతని పుత్రుఁ డనియు నొకపురాణము చెప్పెను. ఆశ్వలాయనమహర్షి యాతనికి మామగారనియు. బోధాయనమహర్షి గురువనియు లోకప్రథ కలదు. పలకో తలిదండ్రుల నామములను బోధాయనుని పేరును

---

(1) ఆపస్తంబ ధర్మసూత్రములలోని ప్రథమప్రశ్నమునం గల 22,23 ఖండలు పరబ్రహ్మబోధకములగు వేదాంతసూత్రములు, వానికి శ్రీమచ్ఛంకర భగవత్పాదాచార్యుల వారు వ్రాసిన అద్వైత భాష్య మిటీవల "తిరువాన్కూరు" సంస్థానము వారికి లభించినదఁట!

(2) వామనపురాణమున నీయంశము సూచింపఁబడెను

నీమహర్షి యెచటను స్మరింపలేదు. తన గ్రంథములో ననేకస్థలములయం దీమహర్షి 'శ్వేతకేతు' మహర్షినే స్మరింపుచుండుటయేగాక, అట్టివారే పుట్టరని పొగడుటచే నీతఁడా శ్వేతకేతుమహర్షియొక్క శిష్యుఁడై యుండునని తలంపఁబడును. శ్వేతకేతుని తండ్రియగు 'ఉద్దాలకమహర్షి'కి శిష్యుఁడగు వాజసనేయుని 'బ్రాహ్మణము' నీతఁడు పలుమార్లు ప్రమాణముగా గ్రహించుచుండెను. 'ఆపస్తంబుఁడు' అనుపేరీతనికి వచ్చుటకు క్రిందికథను జెప్పుదురు.

(ఒకప్పు డీ మహర్షి యమునానదీ తీరమునందు గ్రీష్మతో నెండలోఁ గూరుచుండి కఠినమగు తపస్సు చేయుచుండఁగా సౌందర్యరాశియగు నీతనిని వచ్చిపోవు జనులందఱును "నెండలోఁ గూరుచుండి తపస్సు చేయుచు శుష్కించుచున్నాఁడే." యని యాశ్చర్యముతో గుమిగూడి చూచుచుండిరఁట! ఆజనుల సంభాషణాదికముచేఁ దనతపస్సునకు విఘ్నము కల్గుచున్నదని యీమహర్షి నీరును మంత్రించి తనచుట్టును ద్రిప్పుకొనఁగా, నాయుదకము పడినచోటున నొక "రెల్లుపొద" బయలుదేరి, యామహర్షినిఁ జాటు చేయుటచేత (1) 'ఆపస్తంబుఁడు' అను బిరుదనామము నొందెనని కొందఱందురు.

అట్టి మన యాంధ్రజాతిలోని బ్రహ్మర్షి తన యేడవ యేఁటనె యుపనీతుఁడై యథావిధిగ గురుకులమునఁ జేరి ముప్పది

(1) అపః = ఉదకము, స్తంబ= పొదయైనవాఁడు.

యాపేండ్లు బ్రహ్మచర్యవ్రతముఁ జేసి 'వేదములను, వేదాంగములను, పశుపక్షికిమికీటాది శాస్త్రములను, రాజసాంఘిక నీతులను సంబంధించిన సమగ్రగ్రంథములను గురువులనుండి సాంగముగ నభ్యసించుటయేగాక, అంతటి కాలమునందును, అంతకుఁ బూర్వమునను "మత, సాంఘిక, రాజకీయ" విషయములను గూర్చి వ్రాసిన మహాపండితులగు 'వాజసనేయుఁడు, శ్వేతకేతువు, హారీతుఁడు, పుష్కరసాది, మనువు, కణ్వుఁడు, కౌత్సుఁడు, కుణికుఁడు, వార్ష్యాయణి' మొదలగు మహర్షుల యొక్క గ్రంథములఁ జదివెను."

ఆంధ్రజాతియందు—కాదు, ఇతరభారతజాతులందును నింతటి పండితుఁడు 'నభూతో నభవిష్యతి' యని చెప్పఁదగును; అందువలననే వృద్ధబ్రాహ్మణపండితులు గొప్పపండితునిగా నెవనినైనఁ జెప్పునపుడు వాఁడు 'ఆపస్తంబుఁడండీ!' యని నేఁటికిని జెప్పుచుందురు.

(ఆపస్తంబుఁడు విద్యలునేర్చి గడిదేఱునాఁటికి 'సాల్వ' దేశమునకు యుగంధరుని పుత్రుఁడగు 'యౌగంధరి' రాజయ్యెను. యౌగంధరియు మహారాజన్యగుణయుక్తుఁడు. ఆమహారాజును, నీమహర్షియు నిమ్నత్వమునం దుండిన తమయాంధ్రజాతి నుద్ధరింపఁదలంచి, తొలుత జాతిని సర్వవిధముల వృద్ధిపఱచు శ్రుతిస్మృతుల ధర్మములను దమజాతియందుఁ బాదుకొన యోచించి తగినవిధానములఁ జేసిరి.)

ఆపస్తంబుఁడు తాఁ జదివిన గ్రంథముల ననుసరించి మనుష్యుని యాయుర్బలవిద్యల నభివృద్ధిఁ జేయునదియు తమ సంఘమున నప్పటికెని సడలియున్నదియు నగు బ్రహ్మచర్యమును గట్టి యేర్పాటుతోఁ ననుష్ఠించుటకును దానికి వెలియైన విశేష ప్రాయశ్చిత్తములను, శిక్షలను బొందుటకును విస్తారమగు నియమములఁ జేసెను. అట్లు చేయుటయేగాదు, బ్రహ్మచర్యమును యథావిధిగఁ జేసి వేదశాస్త్రములఁ జదివినవాఁడు రాజుకంటె నధికుఁడుగా గౌరవింపఁబడు నట్లొనర్చెను. అట్టి బ్రహ్మచారి యేగృహస్థునింటి కతిథిగా వచ్చిన నాగృహము సమస్తదేవతలు వచ్చిన నెంతపవిత్రమగునో యంతపవిత్రము నొందునను గౌరవమును స్వసంఘమునఁ గలుగఁజేసెను. మన్వాదిస్మృతికర్తలాంధ్రులు నీచకర్మములఁ బ్రవర్తించు దినములలో వారిని వ్రాత్యులని, యేవిరుద్ధార్థముగాఁ జెప్పిరో, మనయాపస్తంబుఁడావ్రాత్యశబ్దమును సర్వోత్కృష్టగుణములు గలపూజ్యుఁ డని బ్రహ్మచర్యవ్రతముతో ముప్పదియాఱేండ్లు వేదవేదాంగములను నేర్చి విద్యాస్నాతకుఁడైనవాని పరముగా నర్థమును సమర్థించెను. (1) నాటినుండియే యాంధ్రులకు నీచత్వబోధకమగు వ్రాత్యత్వము తొలఁగినదని చెప్పవలసియున్నది.

---

(1) వ్రత=బ్రహ్మచర్య వ్రతమునందు, సాధువు= సమర్థమైనవాఁడు, వ్రత్యు డనఁబడును, ఆతడే వ్రాత్యుఁ డనఁబడును, అనగా బ్రహ్మచర్యమున వేదవేదాంగములు నేర్చి స్నాతకవ్రతము నొందినవాఁడు.

మహాభారతయుద్ధానంతరమునను, ఆపస్తంబునకుఁ బూర్వ మునను, సంభవించిన స్త్రీపురుష విరుద్ధధర్మములను శ్వేతకేతు మహార్షి నిర్బంధముతో వ్రాసి, వివాహనిబంధనము నేర్పఱచెనని వ్రాసియున్నాముగదా ! ఆకాలమున దేశమునం దార్యజాతి తక్కువసంఖ్య గలదిగా నుండుటచే స్వజాతి నభివృద్ధిపఱచు కొనుటకై మహర్షులు సంతానములేని పురుషుఁ డెట్లయిన స్వవంశమును నిలుపుకొనుటకై నియోగపద్ధతి నంగీకరించిరి. అందు యాజ్ఞవల్క్యుఁడు,బోధాయనుఁడు ముఖ్యులు. తమస్మృ తులలో నీయంశమును స్పష్టముగా వ్రాసిరి. పై నియోగపద్ధతి వలనఁ బెక్కులవి నీతికరకార్యములు జరుగుచుండుటఁ జూచియు అనులోమ ప్రతిలోమ సంకీర్ణ సంతతులవల్ల కల్గు విద్వేషములఁ జూచియు నాపస్తంబమహర్షి నియోగపద్ధతి యెంతమాత్రమును గూడదనియు, స్త్రీపురుషనియమము యావజ్జీవము దంపతులకు నుండవలయు ననియు, వివాహపద్ధతిలో కఠినమైన నిబంధన ముల నేర్పఱచి బ్రతికినన్నినాళ్లు తనభార్యను జాగ్రత్తగాఁ గాపా డుకొని పోషించువిధులను బురుషునకును, భర్తయు నతని ననుస రించి ధర్మము నాచరింపఁదగు విధములను స్త్రీకిని నేర్పఱచు టయేగాక, యధావిధిని వివాహితులైన దంపతులు పై విధు లకు వ్యతిరేకించినచో శిక్షార్హులని కూడ శాసించెను. పరలోక భీతి కల్గించునట్లు స్మృతిలో నిరూపించెను. అన్యభార్యను మోహించువానికిఁ గీడు కల్గించు నభిచారహోమాదులును,

రాజదండనమును, అట్లె స్త్రీకిఁ గొండదండనములను జెప్పెను. అనులోమ ప్రతిలోమ వివాహజనితులు ధర్మకార్యార్హులు కారని నిరూపించెను

మఱియు గార్హస్థ్యము బ్రహ్మచర్య, వానప్రస్థ సన్న్యాసాశ్రమముల నుండువారి కాధారభూతుఁడగుటచేత గృహస్థుఁడు పరమార్థచింతతో, దయాధర్మబుద్ధులతో, నితరాశ్రమముల నుండువారికిఁ జేయఁదగు విధులను జక్కఁగా నేర్పఱచెను.

ఇట్లె వానప్రస్థసన్న్యాసాశ్రమముల నుండువారును స్వాశ్రమకర్మములను నిర్వహింపుచు శక్తికొలఁది జాతిమతోద్ధరణముల నొనర్చు బోధనాదుల నొసఁగు కట్టడులనుజేసెను.

రాజు దేశారాధకుఁడై ప్రజలు వృద్ధినొందు కార్యములఁ జేయవలయుననెను. తనరాజ్యమున నెవరును, అన్నవస్త్రములకు లోపములేకుండగ నుండునట్లును, శీతాతపవాతములకును, ఆధివ్యాధులకు నులోనుగాకుండునట్లును, రాజు పరిపాలింపవలయు విధుల నేర్పఱచెను.

రాజునకు 'బాలురు, వృద్ధులు, స్త్రీలు, కర్మకరులు, అంగవికలులు, మంత్రప్రవర్తకులగు శ్రోత్రియులు, విద్యార్థులఁ బోషించువారు నేవిధమగు పన్నులను నీయునవసరము లేదనియు—వ్యవసాయకులు తమపంటలో నాఱవవంతును, వర్తకులు తమలాభములో నిరువదవవంతును బన్ను నిచ్చుకొను విధులను జేసెను. మఱియు రాజు, నగరగ్రామాదులను

న్యాయముగాఁ గాపాడు నధికారులు నాగరకస్థలములను నియమింపవలయు ననియు—గ్రామమునందును దానికిఁ జుట్టును క్రోశములోపలను గ్రామస్థులు కాపాడని చోరు లపహరింతురేని యాద్రవ్యము నా గ్రామరక్షణమునకై నియోగింపఁబడిన రాజపురుషుఁడు తానే నష్టపడినవాని ద్రవ్యము నిచ్చుకొనవలె ననియు—అట్లే పట్టణపాలకుఁడు తననగరమునందును దానికిఁ జుట్టును యోజనము మేరను నెవని యాస్తి యైనఁ జోరాపహృతమయినచో దాని నానగరపాలకుఁ డిచ్చుకొనునట్లును శాసనమొనర్చెను. (1)

మఱియు రాజు, తనదేశమునందలి ప్రజలకు రెండేండ్ల కాలము సరిపడు ధాన్యమును నిలువ యుంచుకొనవలెననెను. వర్తకుఁడు తనదేశమునందలి యమూల్యములగు సువర్ణరత్నాదులను బరదేశీయులకు విక్రయింపకుండఁగ, రాజు చూచుచుండవలెనని చెప్పెను. ప్రజల వివాదములఁ దీర్ప నాయాప్రదేశములలోని విద్వాంసులు, పెద్దలు సభచేసి న్యాయములఁ దీర్ప నా తీర్పులప్రకారము రాజు శిక్షాదులఁ జేయవలెను.

ఆపస్తంబునకుఁ బూర్వమున 'ద్యూతము, మద్యపానము, గోవధము.' విశేషముగాఁ బ్రబలియుండెను. ఒక్కసారిగా వాని నన్నింటిని నిర్మూలింప వీలుకాదని తలంచికాఁబోలు

(1) ఈపద్ధతి హైదరాబాదు మైసూరు సంస్థానములలోని కొన్ని గ్రామములలో ముప్పదియేండ్లనాఁ డుగ్రంథకర్త చూచియున్నాఁడు.

ద్యూతపానగోవధములకు విశేషములగు కట్టుబాటులఁ జేసి, పై కార్యములు జనసామాన్యమున కందుబాటుగ కాకుండు విధానముల నేర్పఱచెను. మతక్రియలలో వానికి సంబంధము గల్గించెను.

ఇట్లు పరహితైకబుద్ధితో—లోకాభివృద్ధియగు రీతిని—స్వజాత్యభివృద్ధిదృష్టిని సమాధి నిష్ఠాగరిష్ఠుఁడగు నాపస్తంబుఁడు గృహ్యధర్మసూత్రములఁ జేసి, తన యేలికయగు 'యౌగంధరి' రాజా స్మృతిప్రకారము రాజ్యముఁ జేయునట్లుగాఁ బ్రోత్సహించెను. యౌగంధరి పై రీతిని ప్రజాపరిపాలన మొనర్చి, ప్రజామోదమును, దేశాభివృద్ధిని నొందించుటచే 'సాల్వ' దేశీయులు తీరుఁబడికాలములలో— ఉత్సవసమయములలో—యమునానదీ తీరమునం జేరి, కొందఱు 'రాసక్రీడ' రీతిని మఱికొందఱు 'కోలాటము' వేయుపద్ధతిని గుండ్రముగాఁ దిరుగుచు, మఱికొందఱు కూరుచుండియు నానందముతో నీ క్రిందిరీతిని బాడుకొనుచుండెడి వారఁట!

(1) యౌగంధరియే మారాజు, మారాజు, మారాజు,
యౌగంధరియే మారాజు

---

(1) ఏకాగ్నికాండమంత్రప్రశ్నములలో నీయర్థముగలమంత్రము నాపస్తంబుఁడు విధితోఁ గూడఁ జెప్పెను. ఈమంత్రము సాల్వదేశీయులకు మాత్రమే యానెను. గృహ్యసూత్రకర్తలెవరును నీమంత్రమును సాల్వదేశ నామమునుఁగూడ దలంపలేదు.

యౌగంధరియే మూసాల్బ్వలరాజు, మాసాల్బ్వలరాజ,

మూసాల్బ్వలరాజు."

అని లయవేయుచుఁ బాడుచుండిరట!

ఆపస్తంబుఁ డింకను యజుర్వేదములోని 'తైత్తిరీయ' శాఖ ననుసరించి అనేకవిధములగు యజ్ఞములను జేయుటకుఁ శ్రౌతసూత్రములను, యాగవేదికలను వేయుటకును, భూమి, గొలుచుటకును ననువైన క్షేత్రరేఖాగణితసంబంధములు గల 'శుల్బ' సూత్రములను రచించెను. వేదీ నిర్మాణవిధులలో శిల్పాభివృద్ధిహేతువులకుఁ బునాదులు వేసెను. నీచకర్మలు కల వారని—బాహ్యజాతివారని—శాపదగ్ధులని మన్వాదులు నిరసించిన మనయాంధ్రజాతిజులను ఘనులనుగాను, మహోత్కృష్టులనుగాను, బలపరాక్రమవంతులనుగాను, ప్రపంచప్రసిద్ధులనుగాను, జేసిన యాపస్తంబుఁడు 'ఆంధ్రపిత' యై యొప్పుఁగదా!

*వరరుచి

కాత్యాయనునికి వరరుచి యనియు వార్త్తికకారుఁడనియు నామాంతరములు గలవు. పాణినిసూత్రముల కితఁడు వార్త్తికములు వ్రాయుటచే నీతనికి వార్త్తికకారుఁడను పేరు గలిగినది. ఈతని చరిత్రమును సోమదేవభట్టారకుఁ డిట్లు వర్ణించియున్నాఁడు.

వరరుచి పూర్వజన్మమునఁ బుష్పదంతుఁడను ప్రమథుఁడు. భగవంతుఁడగు శంకరుని యనుగ్రహమునకుఁ బాత్రులైన ప్రమథులలో నీతఁడే యగ్రగణ్యుఁడు. ఒకప్పు డీపుష్పదంతుఁడు శివుని సేవించుటకువచ్చి ద్వారపాలకుఁడగు నందిచే నివారింపఁబడియు స్వామిదర్శన కుతూహలాయత్త చిత్తుండై తన యోగవిద్యాప్రభావంబున నందికన్నులకుఁ గనఁబడకుండ నంతఃపురంబునఁ బ్రవేశించి పరమేశ్వరుఁడు పార్వతీదేవితోఁ జెప్పుచున్న యత్యద్భుతమైన విద్యాధరచరిత్రమును వినెను. ఇట్లాచరిత్రమును వినివచ్చి తనభార్యతో నాకథ నంతయు సవిస్తరముగ నుడివెను. పిదప నొకప్పు డీతనిభార్య "జయా" యను నామె పార్వతికిఁ బరిచర్యఁ జేయఁబోయి తాను వినిన యాచరి

* ఈకథ వేంకటరామకృష్ణ గ్రంథమాలనుండి గ్రహింపఁబడినది.

త్రము సమయొద్దఁ జెప్పెను. పార్వతి యదివిని యప్పుడు భర్త కడకరిగి "నపూర్వమని నాతోఁ జెప్పిన విద్యాధర చరిత్రము ద్వారపాలికయగు జయకుఁగూడఁ దెలిపినదే సుమీ" యని కోపముతోఁ బలికెను. పరమేశ్వరుండును దివ్యదృష్టిచే జరిగిన సమాచారమంతయుఁ దెలిసికొని "పార్వతి! నీవేలకోపించె దవు? నీతో నేనాకథఁ జెప్పినపుడు పుష్పదంతుఁ డదృశ్యస్వ రూపుఁడై వచ్చి యదివినెను. పిమ్మట భార్యతోఁ జెప్పెను. అంతియకాని యిది మఱియెవ్వరికిని దెలియదు." అని బదులుచెప్పెను. అది వినినతోడనే పార్వతీదేవి మనుష్యుల భంగైన చాపలముచేఁ బుష్పదంతుఁ డిట్టరహస్యమును వెలిఁ బుచ్చి యుండుటంబట్టి "మనుష్యలోకంబున మానవుండై యుండుఁగాక" యని శపియించెను. తచ్ఛాపానుసారంబుగఁ బుష్పదంతుఁడు మధ్యమలోకము నొంది భరతవర్షమందుఁ గౌశాంబీనగరమున "వసుదత్త సోమదత్తుఁడు" నను దంపతు లకుఁ బుత్రుఁడై జన్మించెను.

అతఁడు నోరెఱుంగని పసివాఁడుగా నున్నప్పుడే యాతని తండ్రి పరలోకగతుఁ డయ్యెను. భర్తృవిరహావిహ్వల యైనను దల్లి ధైర్యము నవలంబించి యెట్లో కష్టమునఁ గుమారుని బెంచుకొనుచు దారిద్ర్యము ననుభవించుచున్నను శక్త్యానుసార ముగ భూతబలి యతిథిపూజ దేవతారాధనము మున్నగు సత్కా ర్యముల నొనర్చుచుఁ గాలము గడపుచుండెను. ఆపిల్లవాఁడు

కష్టసుఖముల నెఱుఁగనివాఁ డగుటచేఁ బట్టణమున నచ్చటచ్చట జరుగుచుండు సభలకు సంతోషపూర్వకముగఁ బోవుచు నచటఁ దాను వినివచ్చిన సంగతులను దల్లితోఁ జెప్పుచు నామెకుఁ దనయెడలఁ గల ప్రేమాతిశయము నినుమడించుచు శుక్లపక్ష చంద్రునివలె దినదినము వృద్ధినొందుచుండెను.

ఒకప్పుడు వ్యాడి, యింద్రదత్తుఁడు నను బ్రాహ్మణు లిరువురు దేశసంచారము నొనరించుచు మార్గవశమున నాపట్టణ మునకు వచ్చి యానాఁటిరాత్రి నచటఁ గడపఁదలఁచి మనకథా నాయకుని యింట విడిసిరి. తరువాత నాయింటి యిరుగుపొరు గువా రా పిన్నవాని గుణవిశేషములును బుద్ధిసూక్ష్మతయు నేకసంథాగ్రాహిత్వమును గొనియాడుచుండుట విని ముచ్చట పడి వా రాతని బరీక్షించుటకుఁ బ్రాతిశాఖ్య మను నొకగ్రం థము నొకపరి పఠింప నది విని ధారణఁ జేసి వెంటనే యుఱల నీతఁడు చదివెను. అప్పు డాబ్రాహ్మణు లాతఁ డేకసంథాగ్రాహి యగుటఁ దెలిసికొని యబ్బురపడి యతనితల్లి వసుదత్తతోఁ "ఓ సాధ్వీమణీ! నీ కుమారుఁడు సాధారణుఁడుగాఁడు. ఇట్టి పిల్లవాని వెదకుటకే మేము దేశసంచార మొనర్చుచుంటిమి. మానివాస స్థలము వైతసపురము. బాల్యమందే మాతలిదండ్రులు స్వర్గస్థు లగుటచే మేమనాథుల మై మా తండ్రి సంపాదించిన ద్రవ్య ముండుటచే ధనార్జనముసేయు వృత్తి నవలంబింపక విద్యాధన మును మాత్రమే సంపాదింపఁదలంచి తపమువలనఁ గాని యెట్టి

కార్యమును సిద్ధింపదని యెంచి యేకాగ్రచిత్తులమై కుమార స్వామి నారాధించితిమి. మాతపమునకు మెచ్చి భగవంతుఁ డగు షణ్ముఖుఁడు స్వప్నమున సాక్షాత్కరించి ,,నందమహారాజు పాలించుచున్న పాటలీపుత్రమునకుఁ బోయి వర్షుఁ డను పేరుగల బ్రాహ్మణునివలన విద్యాభ్యాసము చేయుఁ" డని యాదేశిం చెను. మే మాతని యాదేశమును శిరసావహించి వచ్చి యా మహాపట్టణమున వర్షుం డెచ్చోటనుండెనో యని యన్వేషించు చుండ నొకచోటఁ గొందఱుమనుజులు గుమిగూడి ప్రసంగవశ మున ,,నీపట్టణమున వర్షుఁడను మూర్ఖబ్రాహ్మణుఁడుగలఁ" డని చెప్పుకొనుచుండిరి. మేమది విని యా జనసంఘమువలన వర్షుని నివాసస్థలమును సాభిజ్ఞానముగ నెఱిఁగి పట్టణమున నొకమూల నెలుకకన్నములును గూలుచున్న గోడలును శిథిలమైనకప్పును గలిగి యాపదలకుఁ బుట్టినిల్లనఁ దగియున్న యొక గృహమును జూచితిమి. అదియే మేము పోఁదలఁచుకొన్న వర్షునియిల్లు. మే మాయింటఁ బ్రవేశించునప్పటికి వర్షుఁడు కన్నులు మూసికొని ధ్యానముఁ జేయుచుండెను. అతనిచెంత ధూళిధూసరమైన శరీర మును జినిఁగిపోయిన మలినవస్త్రమును గలిగి వర్షగుణానురక్త యై యాతని వరింపఁదలంచి మూర్తీభవించి వచ్చిన దుర్గతియో యనునట్లున్న వర్షునిభార్యను జూచి నమస్కరించి వచ్చినపని నంతయుఁ జెప్పితిమి. అప్పుడామె ,,నాయనా! మున్నీపురం బున శంకరస్వామి యను బ్రాహ్మణోత్తముఁ డుండెను. ఆతని

గర్భమున మూర్ఖుఁడు దరిద్రుఁడు నైన యీ విప్రుఁడు పుట్టెను. ఈతనికి బుద్ధిమంతుఁడును ధనవంతుఁడు నైన యుపవర్షుఁ డను తమ్ముఁడు గలఁడు. ఒకప్పుడు విప్రుఁడు నాలోడికోడ లిచ్చిన పిచదానమును దక్షిణగాఁ గొనపడి ప్రతిగ్రహించి నాయొద్దకుఁ దీసి కొనివచ్చెను నేనప్పు డతని మిగుల నిందించితిని. ఆనింద వాక్యముల విని యాతఁడు మిగుల విచారించి విద్యాగంధము లేకుండుటచేతనే గదా యిట్లాఁడుదానిచే మాటలు పడవలసి వచ్చెనని పశ్చాత్తాపపడి నిశ్చలచిత్తుండయి కుమారస్వామి నారాధించెను ఆ దేవుఁడును సదయహృదయుఁడై సమస్త విద్యలు నీతనికిఁ బ్రసాదించెను. ఇదియుంగాక తొలుదొలుత నీవిద్యలనెల్ల నొక యేకసంథాగ్రాహియగు బాలుని కుపదేశింపు మని యానతిచ్చెను భగవంతుని యాజ్ఞానుసారముగ నడచు కొనుటకై యిట్లు రేపగలు ధ్యానము సేయుచున్నాఁడు. కావున మీకీయనయొద్ద విద్యాభ్యాసముఁ జేయుతలంపు గలదేని యట్టి బాలకుని గొనిరం” డని చెప్పెను వల్లెయని మే మామెకుఁ గొంతధన మిచ్చి బయలుదేఱి భూవలయము నెల్లఁ దిరిగితిరిగి మాకట్టిబాలకుఁ డెచ్చటను లభింపకపోవుటచే విసిగి వేసారి తుదకుఁ బుణ్యవశంబున నిచట నీబాలకుని బడయఁ గంటిమి. కావున నీపిల్లవానికి విద్యాభ్యాస మొనర్చుట కాజ్ఞ నిమ్మ.” అనిచెప్పిరి.

వసుదత్తయు వారివచనముల నాదరించి తన కుమా

రుఁడు పుట్టినప్పు డశరీరవాక్కు లాగఁ నేకసంథాగ్రాహియై వర్షునివలన విద్యాభ్యాస మొనర్చుననియు, వ్యాకరణశాస్త్రము లోకమునఁ బ్రతిష్ఠించుననియు వరరుచి యను పే రితనికిఁ దగి యుండు ననియుఁ జెప్పిన సమాచారమును వారికిఁ దెలియఁ జేసి సంతోషపూర్వకముగఁ దన కుమారుని వారిచేతులలో నొప్పగించెను వ్యాడీంద్రదత్తులును సంతోషముతో గొప్ప యుత్సవముఁ జేయించి వసుదత్తకుఁ బరాకాంక్ష లేకుండఁగ జీవించుటకుఁ దగినంత ధన మిచ్చి యానందబాష్పతరంగితలోచన యగు నామెయొద్ద సెలవుఁ దీసికొని వరరుచిని వెంటఁ బెట్టుకొని పాటలీపుత్రమునకు వచ్చి వర్షు నివాసస్థలమునకుఁ బోయిరి.

వర్షుఁడును వ్యాడీంద్రదత్తులచే నా చిన్నవాని వృత్తాంతము నెఱింగి సంతసించి కరుణారసభరితములైన వీక్షణములచేఁ గొంతతడవు గనుఁగొని తనివిసనక „ వత్సా ! రమ్ము.” అని చేరఁదీసి బిగ్గఁ గౌఁగిలించుకొని యా వెంటనే యొక పరిశుద్ధస్థలమునఁ గూరుచుండి మృదుమధురగంభీరం బగు నెలుంగు సెలంగ నోంకారపూర్వకంబుగా సాంగోపాంగములైన సమస్త వేదములను జెప్పుట కుపక్రమించెను ఒక్కసారి చెప్పినప్పటికి వరరుచియును రెండుమాఱులు వినునప్పటికి వ్యాడియు మూఁడుపర్యాయములు పఠించునప్పటి కింద్రదత్తుఁడును గ్రహించుచువచ్చిరి. అప్పుడు వర్షుని గృహమునుండి మున్నెన్నఁడును వినని యత్యద్భుతమైన ధ్వని వెలువడి భూమ్యాకాశములు

నించెను. వర్షుని తమ్ముఁ డుపవర్షుఁడును బట్టణమున నివసించి యున్న జనులును విస్మితులై వర్షుని ప్రభావమును వర్ణించుచుఁ బట్టణమున నెల్లచోటులఁ బెద్ద యుత్సవములు సేసిరి. తత్పురాధీశ్వరుఁడైన నందుఁడును షణ్ముఖప్రసాదలబ్ధవిద్యాసాంప్రదాయుండైన వర్షోపాధ్యాయుని గనుఁగొని సంతసించి యాతని యింట సువర్ణవర్షమును గురిపించెను.

ఇట్లు కొంతకాలము వర్షోపాధ్యాయునియొద్ద విద్యాభ్యాసముచేయుచుండఁ గాలక్రమంబున మనకథానాయకుఁడు బాల్యావస్థఁ గడచి సమస్తవిద్యాపారంగతుఁ డయ్యె.

పిమ్మట నొకప్పు డితఁడు సహాధ్యాయులైన వ్యాడీంద్రదత్తులతోఁ గూడి యింద్రోత్సవముఁ జూడఁ బోయి యందొక్కయెడ సర్వాలంకారభూషితయై చెలికత్తియలతోఁ గూడి సల్లాపములాడుచుఁ బుడమియందు సంచరింప వచ్చిన రతీదేవియో యన నొప్పుచున్న యొక్కకన్నియను గనుఁగొనెను. చూచినతోడనే యాతనిహృదయము నా లతాంగి దొంగిలించెను. శూన్యహృదయుఁడైన వరరుచి ,, మిత్రమా! ఇంద్రదత్తా! మదీయచిత్తము నాకర్షించి పోవుచున్న యా కన్నెమిన్న యెవ్వతె?" యని యడిగెను. ఇంద్రదత్తుఁడు పట్టణవృత్తాంతము నెఱింగినవాఁడగుటచే "నామె మనయుపాధ్యాయుని తమ్ముఁడగు నుపవర్షుని కూఁతు" రని చెప్పెను. అది మొద లాతఁడు తదాసక్తంబగు చిత్తంబును మఱలింపఁజాలక

నిశ్చేష్టుండై యాపూర్ణచంద్రముఖినే ధ్యానించుచు జగమెల్లఁ దన్మయముగ భావించుచు నాఁటిరాత్రియెల్ల జాగరమొనరించెను.

వేకువజామునఁ గొంచెము నిద్రపట్టుచుండ స్వప్నమునఁ దెల్లని వస్త్రమును ధరించిన యొక దివ్యవనిత యాతనికిఁ గనఁబడెను. ఆమె యాతని నుద్దేశించి ,, నాయనా! నేను నీలో నున్న సరస్వతిని. నీవు నిన్న నింద్రోత్సవమునఁ జూచి మోహించిన ,,యుపకోశ" యను మహిళారత్నము పూర్వజన్మమున నీకు ధర్మపత్ని. ఆమె యీజన్మమునఁ గూడ నిన్నే వరించును గాని యన్యు నిచ్ఛగింపదు నీ వేలవిచారించెదవు ?"అని చెప్పి యంతర్ధానము నొందెను. వరరుచి మేల్కని వెంటనే తన ప్రియురాలి యింటికి సమీపమున నున్న మావిగున్నయొద్దకుఁ బోయి యచ్చటఁ గూరుచుండెను.

ఇట్లు కొంత తడ వచ్చట నున్నపిదప నుపకోశసఖీజనము వచ్చి చూచి "యొంటిగ నిచ్చటఁ గూరుచుండనేమి? విచ్చేయుఁ" డని యాతని నుపకోశాగారమునకుఁ దీసికొనిపోయిరి. వరరుచి యుపకోశకుఁ దనయెడఁ గల యనురాగాతిశయము నెఱింగినవాఁ డయ్యును గురుజనాదత్త యగు కులకన్యకను బరిగ్రహించుట కనుమతింపఁ డయ్యెను అట్లు పరిగ్రహించుట ఐహికాముష్మికములైన వివేకులకు క్షేమకరముగా దని యాతని యభిప్రాయము.

తరువాత నుపకోశతల్లి తనకూఁతునకు వరరుచియందుఁ గల యనురాగాతిశయము నెఱింగి భర్తకును బావగారికిని దెలి

యుఁజేసెను. వర్షోపవర్షులును వరరుచి సత్కులప్రసూతియు గుణసంపదయు బుద్ధిసూక్ష్మతయుఁ దెలిసినవారలే కావునఁ దమ కొమార్తెకిట్టి వరలాభము గలిగినందుల కెంతయు సంతసించి యన్యోన్యానురక్తులైన యావధూవరులకు వివాహము చేయుటకు నిశ్చయించి వ్యాడిని కౌశాంబీనగరమునకుఁ బంపి వరరుచి తల్లియగు వసుదత్తను రప్పించిరి. తల్లి యనుమతినిగూడఁ గైకొని మనకథానాయకుఁడు శుభముహూర్తమున నుపకోశా పాణిగ్రహణ మొనర్చి తానును దల్లియు భార్యయు నచ్చటనే సుఖముగ నుండిరి.

ఇది యిట్లుండఁగాఁ గొంతకాలమునకు వర్షోపాధ్యాయుని విద్యావిశేషమునఁ బొడమినకీర్తి సమస్తదిక్కులయందును వ్యాపించెను. శిష్యసమూహము ప్రతిదినమును వృద్ధి యగుచుండెను. వర్షోపాధ్యాయునియొద్ద విద్యాభ్యాసముఁ జేయ వచ్చిన శిష్యు లందఱు సూక్ష్మబుద్ధిగలవారలై యుండిరి గాని వారిలోఁ బాణిని యను నొక్కవిద్యార్థిమాత్రము మిగుల మందబుద్ధిగలవాఁడై యుండెను. అతనిఁ జూచి తక్కినసహాధ్యాయు లందఱుఁ బరిహసించుచుండెడివారు ఇట్లుండ గురుశుశ్రూషాతత్పరుండైన పాణినిఁ జూచి గురుపత్ని జాలిపడి “ నాయనా ! పాణినీ ! నీవృథాపరిశ్రమమువలన నేమియుఁ బ్రయోజనము లేదు. దేవతానుగ్రహము లేక నీవు విద్య సంపాదింపనేరవు

కావున నీ విట్టి యడియాసలను విడిచి సర్వేశ్వరు నారాధింపుము." అని యుపదేశించెను.

ఆమాటలు విని నిర్విణ్ణుండై పాణిని గురుపత్నికి నమస్కరించి గుర్వాజ్ఞ వడసి హిమాలయపర్వతముమీఁదనుఁ బోయి యచ్చట నిశ్చలచిత్తుండై యీశ్వరునిగూర్చి తపం బొనరించి యాతని యనుగ్రహమున సమస్తవిద్యలకు నాధారభూతం బైన వ్యాకరణశాస్త్రమును బడసి మరలఁ బాటలీపుత్రమునకు వచ్చి వరరుచిని వాదమునకు రమ్మని పిలిచెను వరరుచియు నాతఁడును శాస్త్రవాదమునకుఁ బ్రారంభించి యేడుదినములు వాదించిరి. అష్టమదినంబున మునవరరుచి పాణినిని జయించెను. అప్పుడు శివుం డాగ్రహగ్రస్తుండై తా నుపదేశించిన వ్యాకరణమునకు నైంద్రవ్యాకరణముచేఁ బరాజయము సంభవించె నని పెద్దహుంకారము చేసెను ఆహుంకారము బయలు వెడలిన వెంటనే భూమియం దైంద్రవ్యాకరణము నశించెను. అప్పుడు వరరుచి మున్నగువార లెల్ల "వైయాకరణఖసూచులై" పాణినిచేఁ బరాజితులైరి. ఇట్లాకస్మికముగఁ దటస్థించిన యత్యాహితమును సహింపఁజాలక వరరుచి తాను సంపాదించిన ద్రవ్యమును హిరణ్యగుప్తుఁడను వైశ్యునకు దాఁచ నిచ్చి యీ సమాచారమును రహస్యముగఁ దనభార్యతోఁ జెప్పి యామె యనుమతిని గైకొని శివునిఁ గూర్చి తపముఁ జేయుటకు హిమాలయపర్వతమునకుఁ బోయెను.

తనభర్త యిట్లుగ్రమైన తపముఁ జేయుటకు దూరదేశమునకుఁ బోయెనుగదా? యని యుపకోశ "భర్తకు సర్వవిధముల భగవంతుఁడు సౌఖ్యముల నొసఁగుఁగాక" యని ప్రతిదినమును సర్వేశ్వరుని ధ్యానించుచు నియమవ్రతముల నాచరించుచు నుండెను. ఒకప్పుడు పరిపూర్ణసౌభాగ్యసుందరవదనారవింద యగునుపకోశ గంగాసమీపమున కరుగుచుండ రాజపురోహితుండును సేనాధిపతియు మంత్రికుమారుఁడును దైవవశమున నామెను గనుఁగొని దుర్బుద్ధులై మోహపరవశులై యామెను బలాత్కారముగ నైనను బరిగ్రహింపఁదలఁచి యాసమీపమున వేచియుండిరి. ఉపకోశయు సభక్తికముగ నాపుణ్యనది నవగాహనముఁ జేసి గృహమునకుఁ బోవుటకు బయలువెడలెను. అంతలో నాగుండాలు మువ్వురును అప్పుడాసమీపమున వేచియున్న దుర్మార్గుఁడగు కుమారసచివుఁ డాకస్మికముగ వచ్చి మార్గమధ్యమున నాసాధ్వీమణి నడ్డగించెను. అప్పుడామె యనన్యశరణయై తన్నట్టి మహాపత్సముద్రమునుండి యుద్ధరించుకొనుటకుఁ దగిన యుపాయమును జింతించుచు ధైర్యము నవలంబించి దైవవశమునఁ దనకుఁ దోఁచిన యొకయుపాయమున నాదుర్మార్గుని బారినుండి తప్పించుకొనఁదలఁచి యల్లన వానితో నిట్లనియె:—"ఓయీ! నేను సద్వంశమునఁ బుట్టినదానను. నాభర్త యిప్పుడు పరదేశమునకుఁ బోయియున్నవాఁడు. నీవు నన్ను బలాత్కరించుట కిసమయముగాని యీప్రదేశముగాని

యుచితమైనదికాదు. నీకు నాయందు దృఢమైన యనురాగముండెనేని రేపురాత్రి మనయూరి వారందఱు మధూత్సవముఁ జూడఁబోవుదురు గావున నీవు జాముఁరాత్రి కాకుండ మాగృహమునకు రమ్ము" అన వాఁడామాటలను సమ్మతించి యట్లే యగుఁగాక! యని యనుమతించి వెడలిపోయెను. తరువాత మఱి కొంతదూరము పోవునప్పటికి రాజపురోహితుఁడు వచ్చి యడ్డగించెను వానినిగూడ నట్లే రేపురాత్రి రెండవజామున రమ్మని చెప్పి పుచ్చెను మఱికొంతదూరము నడచునప్పటికి సేనాధిపతి వచ్చి బలాత్కరించెను. యథాపూర్వముగనే వానినిగూడ సమాధానపఱిచి మూఁడవయామమున రమ్మని చెప్పి పంపెను.

ఇట్లాదురాత్ములచేతులలోనుండి బయటఁబడి, తనభాగధేయమునే మాటిమాటికి దూఱుచు "హా! కృతాంత! నన్నిట్లు దుర్మార్గుల వాతఁబడఁజేసెద వేమి? నే నీక్షణభంగురమగు శరీరము విడిచెదనుగాని యుత్తమచారిత్రమును మాత్రము విడువను జుమీ" యని మనంబునఁ జింతించుచు నంతకంత కధికమగు దుఃఖమున మివ్రుల నేడ్చెను. చేటిక లుపకోశ నూఱడించి "ఈదురాత్ము లిట్లు వచ్చి తమ నడవడికిఁ దగిన ఫలము ననుభవింతురుగాక!" యని పలికిరి. సతీలలామయగు నుపకోశయు మఱలమఱలఁ దనశరీరమునుగూర్చి దుఃఖించుచు, జీవితేశ్వరు సుగుణములఁ దలంచుకొనుచు నిరాహారయై యా రాత్రి నాల్గుజాములను నాల్గుగడియలవలెఁ గడపెను. ప్రాతః

కాలమున బ్రాహ్మణపూజకొఱకుఁ గొంత ద్రవ్యముఁ గొని తెమ్మని యొకచేటికను హిరణ్యగుప్తునికడ కంపుటయు నాఁటి స్వయముగానే వచ్చి యుపకోశను రహస్యమునకుఁ బిలిచి "ఓకాంతామణీ! నీ లావణ్యాతిశయమును మోహితుండనైన నన్ను నీవేలికొనుము. లేనియెడల నసాక్షికముగ నీభర్త దాఁచ నిచ్చినధనము నొసంగ"నని లజ్జ విడిచి ప్రేలెను. పిడుగుచే నడఁపఁబడినదానివలె నుపకోశయు వణఁకుచు నొక్కక్షణ మేమి సేయుటకుఁ దోఁపక "ఏమిగతి? ఈకాల్మొఁడు నాదుర్మార్గులనే యనుకరించుచున్నాఁడు" అని తనహృదయమునం జింతించుచు మున్ను చెప్పిన రాత్రియందే నాల్గవజామున వానికిని సంకేత మేర్పఱిచెను.

అంత నిర్దేశింపఁబడిన యా రాత్రివచ్చుటయు నేరుపు కత్తియలగు నుపకోశ చేటికలు ముందే యోచించి కస్తూరి మొదలగు పరిమళవస్తువులను, తైలమును గూర్చిన కాటుకను దానిచేఁ బులుమఁబడిన గుడ్డపీలికలను సన్నద్ధముచేసి యింటి నడుమఁ బెద్ద మందస మొకటి యుంచి యా దుర్వినీతుల రాక కెదురుసూచుచుండిరి. మొదటిజామునఁ గుమార సచివుఁడు సర్వాలంకారభూషితుండై తన్నెవ్వరుఁ జూడకుండ నా సాధ్వీమణి యింటఁ బ్రవేశించెను. "స్నానము సేయని నిన్ను మా స్వామిని స్పృశింప" దని చేటికలు పలుకుటయు నతఁడు 'నట్లే' యని వారితో లోపలకుఁ జని యంధకారబంధుర మగు నభ్యం

తరగృహమున వస్త్రాలంకారములను దీసి యా చేటికలచే నొసఁగఁబడిన కాటుక పూసిన ప్రాఁగిపోస్త్రికను గట్టికొని వారిచ్చిన కాటుకను నఖశిఖపర్యంత మలందుకొని తన్నుఁ గృతకృత్యునిగాఁ దలంచుకొనెను ఇట్లు తెఁ డంధకారమునం దభ్యంగసుఖ మనుభవించుచు నెడతెగక పొంగము మనోరథపరంపరలచే బద్ధుండై మొదటిజాము గడచినను దెలిసికొన లేకపోయెను. రెండవజామున వచ్చిన పురోహితుని జూచి యాచేటికలు సంభ్రమముతో " ఈ పురోహితుఁని వరరుచి మిత్రము. మొదటఁ దెలియఁజేయకయే వచ్చినవాఁడు. ఏమిసేయుదుము? ఇచ్చట నొకనిముసము డాఁగి యుండుము" అని పలుకుచు వాని నచ్చట నున్న మందసములోఁ బెట్టి తాళమువేసిరి. అట్లే పురోధయు నా పనికత్తెలచేఁ బ్రలోభితుఁడై స్నానమిషమున లోనికిఁ గొంపోఁబడి, కాటుకచేఁ దల యంటుకొనుచు, దండనాయకుఁడు వచ్చినపుడు మొదటివానివలెఁ బెట్టెలో బంధింపఁబడెను. దండనాయకుఁడును గాటుక పూఁతలచేతనే సంతసించుచుఁ గోమటి వచ్చినతోడనే మందసములోఁ బ్రవేశించెను. ఈ దురాత్ములు మువ్వురును మీఁదఁ దమకు లభింపఁ బోవునంధతామిస్రవాసము నభ్యసించువారివలె నా పెట్టెలయం దన్యోన్యము స్పృశించుచున్న వారయ్యు సిగ్గుచేతను భయముచేతను బరస్పరము సంభాషింపరైరి. తన శరీరమును, భాగధేయమును నిందించుకొనుచు మొగము వంచుకొని యున్న పతివ్రతాశిరో

మణి యగు నుపకోశయుఁ బరిక్తియలచే బ్రేరితయై యెట్లో ధైర్యముఁ జిక్కఁబట్టి యెదుట నున్న కోమటిని "నా భర్త దాఁచనిచ్చిన ధనము ని"మ్మని యడిగెను. "అట్లె యిచ్చెద" నని యా జాలుకుఁడు పలుకుచుండ నామె మంజూషను దట్టి "ఓ గృహ దేవతలారా! యీ హిరణ్యగుప్తుని వచనముల నాలకింపుఁడు" అని పలికెను

అంత నభ్యంగ మొనరించుచున్న వైశ్యుఁడు "రాత్రి ప్రభాతప్రాయ మయ్యెను. ధూర్తాగ్రేసరా! నీ యింటికిఁ బొమ్ము" అని పరిక్తలచే బలాత్కారముగా మెడఁబట్టి గెంటఁబడి, యొడలునిండ మసితోడను, జిరిఁగిన కట్టుబట్టతోడను, సిగ్గువడుచు నింటికిఁ బోయి మసిఁ గడుగవచ్చిన దాసజనుల యెదుటఁగూడఁ దల యెత్తుకొనలేకపోయెను.

పిమ్మట సాధ్వీమణియగు నుపకోశ నందభూపాలునిభవనమున కేఁగి "దేవా! హిరణ్యగుప్తుఁడు నాభర్త దాఁచ నిచ్చిన ధనము నపహరింపఁదలఁచియున్నాఁ" డని విన్నవించెను. రాజు వానిని వెంటనే రప్పించి యడుగ "నీపె భర్త ధనము నాయొద్ద నించుకంతయు లే"దని శపథపూర్వకముగా నాబచ్చు నుడివెను. అప్పు డామె "మహారాజా! నాభర్త చేఁ బెట్టెలోఁ బెట్టియుంచఁబడిన గృహదేవతలే యీవిషయమునందు సాక్షులు. వారల యెదుట నీతఁడు తనయొద్ద నున్న ధనమునుగురించి ప్రస్తావించి యున్నాఁడు. కావున నిది చక్కఁగా విచారింప

వలయు" నని పలికెను. అది విని రాజు విస్మితుఁడై భటులచే నామందసమును సభకుఁ దెప్పింప నాయుపకోశ "దేవతలారా! ఈకోమటి మీయొద్ద నేమనియెనో యది యెల్ల నిచటఁ జెప్పి పిదప మీరు మీ గృహంబుల కేగుఁడు" అని బిగ్గరగాఁ బలికెను. రాజసభలోఁ దమ రహస్యము బయలుపడునేమో? యని వడఁకుచు వారు "నిజముగ నీవాఁడు తనయొద్ద నీపె ధనమున్న దని యంగీకరించె" నని చెప్పిరి అంత నా కోమటియు నిరుత్తరుఁడై యాద్రవ్య మంతయుఁ దనయొద్ద నున్న ట్లొప్పుకొనియెను.

పిమ్మట నా పతివ్రతను బ్రార్థించి యీ మందసమును తెఱచుట కనుజ్ఞ వడసి నందమహారాజు భటులచే నా పెట్టె మూఁత నెత్తించుటయు, మసిముద్దలవలె నున్న దుర్మార్గులు మువ్వురు బయలుపడిరి. ఎట్టకేలకుఁ గొందఱు వారిని గుర్తించి చెప్ప సభ్యు లెల్లరు నొక్కపెట్టున నవ్విరి. రాజు విస్మితుఁడై యిది యేమి? యని యా సాధ్వి నడుగ నాపె జరిగిన వృత్తాంతము నంతయు నా సభ్యు లందఱు వినునట్లు చెప్పెను. వినినవారందఱు నామె ననేకవిధముల నభినందించిరి నృపతియుఁ బరదారాసక్తులైన యాదుర్వినీతుల నలువురను దన దేశమునుండి వెడలఁగొట్టించి యుపకోశను సత్కరించెను వరోపవర్షు లామె వృత్తాంతమును విని యానందించిరి. పౌరు లామెను బతివ్రతా దేవత యని యర్చించిరి ఆమెయు ననుదినము భర్తృస్మరణ

పరాయణుఁడై తనయింట నుండెను. కాలక్రమమున హిమవత్పర్వతమునందుఁ దీవ్రతపముఁ జేయుచున్న వరరుచి పరమేశ్వరు ననుగ్రహమునఁ బాణినీయవ్యాకరణమునెల్ల సరహస్యముగఁ బడసెను. మహాదేవునానతి నతఁడనుక్తమును బూరించియు, దురుక్తమును సంస్కరించియు, నాపాణినిశాస్త్రమునకు మెఱుఁగు వెట్టెను. ఇట్లు గౌరీనాథుని ప్రసాదమువడసి ప్రతిభాశాలియై యుపకోశభర్త తుషారాద్రినుండి కొలఁదినాళ్ళకే యశ్రమంబునఁ బాటలీపుత్రము చేరెను. తల్లియు గురువులు నాతనిరాక నభినందించిరి. కాత్యాయనుఁడు వారల చరణములకు సాష్టాంగ మెరఁగి యద్భుతమగు నుపకోశావృత్తాంతమును విని విస్మయావిష్టుండై యట్టిధర్మపత్నిచేఁ దనగృహస్థ ధర్మము సఫలమయ్యెనని తలంచెను.

అంత వరరుచివలన, నూతనవ్యాకరణము వినఁదలంచిన వర్షునకు భగవానుఁడగు కార్తికేయుఁడే యదియెల్ల నెఱింగించెను. వ్యాడీంద్రదత్తులును వర్షోపాధ్యాయునితోఁ బాణినీయముఁ జదివిరి. పిదప వా రిరువురు వర్షునికి గురుదక్షిణ నొసఁగఁదలంచి తమ యభీప్సితము నాతనికినివేదించిరి. అదివిని వర్షుఁడు కోటిసువర్ణములఁగోరెను. నల్లెయని వారిరువురు నరిసికొని, వరరుచినిబిలిచి "మిత్రమా! మనయుపాధ్యాయుఁడు కోటిసువర్ణములు దక్షిణఁ గోరెను. ఇంతబంగారము, నందభూపాలునికడఁగాని వేఱొకనివలనఁ బడయనరిది. ఆతఁడు తొంబదితొమ్మిదికోట్ల సువర్ణములుగల

రాజు. మున్నె నీయిల్లాలాతనిచేఁ దోఁబుట్టువుగా నాదరింపఁ బడి నది. కావున నీగుణములకుఁ దనిసినయతఁడు నీవడిగిన దల్లఁదప్పక యొసంగును. అతఁ డిపుడయోధ్య యున్నవాఁడు. రమ్మిచటికిపో వుదము" అనివారరుచ్చిరి. పిమ్మట నాముగ్వురు సతీర్థ్యులు నయో ధ్యకరిగిరి అక్కటకట! వీరాపురముని చ్చినతోడనే నందమహా రాజుకీర్తి శేషుఁ డయ్యెను. దానరాష్ట్రిముస గొప్పయలజడి గలిగెను

అంత నాముగ్వురును జింతాక్రాంత మానసులై చేయు నదిలేక విచారించుచుండ, యోగసిద్ధుఁడగు నింద్రదత్తుఁడు "మిత్రులారా! నాకొక యుపాయముతోఁచుచున్నది. మృతుం డగు నందమహారాజు కళేబరమును యోగమహిమచే నేను బ్ర వేశించెదను. అపుడు వరరుచి ధనమడుగుఁగాక! నేను మరలవ చ్చునంతవరకు నాశరీరము నీపాడు దేవళమునందుంచి వ్యాడి రక్షించుచుండవలయు" నని పలికెను. ఇంద్రదత్తుని పలుకుల కలరి వ్యాడియు వరరుచియు మేలు! మే! లనిరి.

నందమహారాజు ప్రాణముల వీడినతోడనే యెల్లచోటుల నొక్కపెట్టున హాహాకారములు బయలు వెడలెను. శకటాలుఁడు లోనగుమంత్రు లంతిపురికిఁ జని "అయ్యో! అయ్యో! ఇఁక నేమున్నది. దిక్కుమాలిన వారమైతిమి. నంద! నయనానంద! నిన్ను గోల్పోయిన మామనుగడయేల? ధర్మసేతువు తెగినది. వసుధ యనాథమైనది. విబుధులు నిరాశ్రయులైరి. సరస్వతి ని

రవలంబమైనది. లోకులు నిరుత్సాహులైరి. దుర్మతులు నిరంకుశులైరి. సత్కార్యము, లదృశ్యములైనవి. జగమెల్ల జీర్ణారణ్యమయినది" అని యనేకవిధములఁ బలవించుచున్న రాజపత్నుల నూఱడించిరి. కాని కాంతిహీనమై పుడమిపైఁ బడియున్న మహారాజు శరీరముఁ గనుఁగొన వారికిని, దుఃఖమాఁగినదికాదు. ప్రధానమంత్రియగు శకటాలుఁడు "మహారాజా! మమ్ము నెల్లరనిట్లు వెతలఁబెట్టి, తపసుదారమోసికన్న యీపసిబాలుఁ జంద్రగుప్తుని శత్రువులపాలఁ బడవైచి, నీతోడిద లోకమనియున్న యంతఃపురకాంతలనైనఁ గలంపక యీ లోకము నిట్లువిడిచితి' వని వాపోవుచు సూక్ష్మదృష్టిచే నానృపాలుని బరికించి యాతనిమొగమునఁ జిఱునగవు పొడసూప నేమిది ? యని యదరిపడి యతని శిరముఁ దాఁకెను. అప్పుడా నందుఁడు నిదురవోయి మేల్కాంచినట్లు కన్నులు దెఱచి "ఎందుల కీకోలాహలము ? నేను మృతినొందలేదు. నాకేండ్లుఁ బ్రతుకఁ గోరెద" నని యల్లనఁ జెప్పెను

"ప్రజలపుణ్యంబున నందమహారాజు జీవించియేయున్నవాఁడు. మహాత్ముఁ డెవ్వఁడో మనరాజును మఱల బ్రతికించెను." అని యనుచరు లెల్లరు సంతోషభరితులైరి. మంత్రుల మొగములు తెలివొందినవి. అంతఃపురకాంతల డెందము లానందతుందిలములైనవి. ఆపన్నసేవకుల చిత్తములు ముదాయత్తములైనవి. వందిమాగధుల వక్త్రంబులు జయశబ్ద

ముఖరితములైనవి. రాజవైద్యు లందఱు ధన్వంతరిప్రోక్తమగు ధాతువిజ్ఞానము నభ్యసించుట వ్యర్థమని తలంచువారైరి. దిఙ్ముఖములు మంగళవాద్యధ్వని పూరితములైనవి. అంతట నొక ద్వారపాలుఁడు సత్వరము వేత్రహస్తుఁడై వచ్చి "మహారాజా! పాటలీపుత్రమునుండి సకలశాస్త్రపారీణుఁడగు వరరుచి యను నొకబ్రాహ్మణోత్తముఁడు వచ్చి దేవరసందర్శనముఁ గోరుచు ద్వారమున వేచియున్నాఁడ"ని విన్నవింప నందుఁడు "భద్రా! యావిప్రుని శీఘ్రముగఁ బ్రవేశపెట్టు" మని యానతిచ్చెను. తరువాతఁ గొందఱు కొత్వాలు వరరుచి నభ్యంతరమందిరమునకుఁ గొనిపోయిరి. కాత్యాయనుఁడు నందున కభిముఖుఁడై "మహారాజా! నేఁ గార్యార్థినై వచ్చితి. దేవర మఱల జీవించుటచే నిప్పుడు మహోత్సవము జరుగుచున్నది. ఇట్టియభ్యుదయమున గురుదక్షిణకై నాకొకకోటిసువర్ణముల దయసేయుము" అని వేఁడికొనెను. యోగనందుఁడనుమతించి వీనికిఁ గోటిసువర్ణము లిమ్మని ప్రధానమంత్రియగు శకటాలున కాజ్ఞాపించెను.

కుశాగ్రబుద్ధియగు నామంత్రిశేఖరుఁడు "దేవా! యట్లె యొసఁగెద" నని "ఇది మిగుల నద్భుతముగ నున్నది. విగతజీవుఁడైన మహారాజిప్పుడె బ్రతికెను. నేఁడె యీయాచకుఁడును వచ్చెను, ఇన్నియు నన్నియుఁగావు కోటిసువర్ణము లడిగెను. వెనకముందు నరయక యే "యిమ్మ"ని యాజ్ఞాపించెను."

అని సంశయించుచు "నోహో! ఇది యిట్లు. ఇతఁడు యోగనందుఁడే. సత్యనందుఁడు కాఁడు" అని జరగినట్లూహించి తనలో "ఎట్లయిన నగుఁగాక! నందమహారాజుపుత్త్రుఁడు పిన్నవాఁడు. రాక్షసమంత్రి శత్రువులు పెక్కండ్రుగలరు. చారులచే వెదకించి మృతకళేబరముల నన్నింటిని గాల్పించెద. దానఁ యోగనందుఁడు చిరకాలము జీవించు" నని తలంచెను.

పిమ్మట శకటాలుని యానతిచే రాజభటులు పాడుదేవళమున వ్యాడిచే రక్షింపఁబడుచున్న యింద్రదత్తుని కళేబరము సైతము బలాత్కారముననఁ గొనిపోయి తగులఁబెట్టిరి.

ఇక్కడ యోగనందుండు "శీఘ్రముగ వరరుచికిఁ గోటిసువర్ణము లొసంగిపంపు" మని సారెసారెకుఁ జెప్పుచున్నను, "పరిజనులందఱు మహోత్సవాకృష్టచిత్తులై యుండిరి. కావున నొకింతసేపీవిప్రుఁడు నిరీక్షించుఁగాక!" యనుచు శకటాలుఁడు కొంత కాలక్షేపము చేసెను. అంత వ్యాడి యోగనందునికడకు వచ్చి "మహారాజ! యోగస్థుఁడగు నొకబ్రాహ్మణుని శవముగాఁ దలంచి యెంతమొఱ్ఱపెట్టిన నాలకింపక రాజభటులు బలిమిందహించిరి"ని విలపించెను. అది వినుచునే శకటాలుఁడు వరరుచికిఁ గోటిసువర్ణము లొసంగెను.

పిదప యోగనందుఁడు నగుచు నేకాంతమున వ్యాడితో "మిత్రమా! నేను శ్రోత్రియకులసంభవుఁడనయ్యు నీజన్మమునందే శూద్రుఁడనైతిని. ఎంతసంపదగల్గిననేమి?" అని పలి

కెను. వ్యాడియు నతనినూఱడించుచుఁ గాలోచితముగ నిట్లు నుడివెను. "కడచినదానికి వగవఁదగదు. ఇప్పుడు శకటాలుఁడు నిన్నె ఱింగినవాఁడు." ఇతఁడు మహామతియుఁ బూర్వనందపుత్రుఁడగు చంద్రగుప్తునందు స్థిరానురాగము గలవాఁడునుగదా? ఆరాజపుత్త్రుఁ డభిషేకయోగ్యుఁ డయినంతోడనే నిన్నుఁ గడతేర్ప యత్నించును. నీవప్రమత్తుఁడవై యుండవలయు. వరరుచిని బ్రధానమంత్రిపదమున నిల్పుము నేనిపుడె పాటలీపుత్త్రమున కేగి గురుదక్షిణ నొసంగి వర్షోపాధ్యాయుని బూర్ణమనోరథుఁ గావించెద" నని యతఁడు వెడలిపోయెను.

వ్యాడిచెప్పినచొప్పున యోగనందుఁడు వరరుచిని ప్రధానమంత్రిగాఁజేయ నతఁడే కాంతమునందు "శకటాలుఁడు మంత్రి పదమునను్నవో రాజ్యము స్థిరముగాదు కావున వానినెట్లయినఁ దెగటార్పు" మని విన్నవించెను. యోగనందుఁడు „వీఁడు యోగనిష్ఠుఁడగు బ్రాహ్మణుని గాల్పించె" ననుదోషముఁ బ్రకటించి శకటాలుని బుత్రశతముతోఁ బాడునూతఁ ద్రోయించి వారిదేహయాత్రకయి ప్రతిదినము నటికెఁడంబలి యందుఁ బెట్టఁగట్టడచేసెను.

ఇట్లుతర్కితముగఁ గలిగించిన యాపదను వగచుచు శకటాలుఁడు „పుత్త్రులారా! ఈయంబలియొక్కని యాఁకలి నైనఁ దీర్పఁజాలదు. కావున యోగనందునిపగ సాధింప సమర్థుఁ డొకఁడే యాయాహారము బ్రతుకుఁగాక" యని పలికెను.

ఆమాటవిని శకటాలునికొడుకులంగఱు నేకగ్రీవముగా "తండ్రీ! యట్టిమహాకార్యము నెఱవేర్ప నీవె సమర్థుఁడవు అశక్తులము మేము జీవించియున్న నేమిఫలము?" అని పలుకుచు వారం దఱుఁ దండ్రిచూచుచుండఁగనే ప్రాణములనువదలిరి ధీరులకుఁ బ్రాణధారణముకంటెను శత్రుప్రతీకారము ప్రియముగదా?

శకటాలుఁడు స్వకర్మమున కనుతపించుచు నాయంబలిచే నెట్టెట్లో జీవించెను

యోగనందుఁడును శకటాలుని వృత్తాంతమును మఱచి రాజయోగ్యములగు వస్త్రములు నాభరణములు ధరించుచు నింద్రియవశుఁడై యిష్టభోగముల ననుభవించుచుండెను. వ్యాడియు గురుదక్షిణ నొసంగి మఱల యోగనందునియొద్దకు వచ్చి "నేనింక వనమునకుఁ బోయి తపముఁ జేసికొందు" నని చెప్పెను. పూర్వవృత్తాంతమును స్మరించి యోగనందుఁడు "మిత్రా! యదృష్టలబ్ధమగు నీరాజ్యమును నీవు ననుభవింపు" మనెను.

నందశరీరము నొందిన యింద్రదత్తునివిషయవిషాస్వాద ముగ్ధుఁడుగా నెఱిఁగి ద్విగుణీకృత వైరాగ్యుండైన వ్యాడి "ఇట్టి యసారంబులైన భోగంబుల బుద్ధిమంతుఁ డెవ్వఁడు ముఱుం గును? మరుమరీచికయగు లక్ష్మి ప్రాజ్ఞుని మోహపెట్టఁజాలదు" అని తెలుపుచు రాజుచే గజనిమీలితమ్మునఁదిరస్కరింపఁబడి తపోవనమ్మున కరిగెను.

సాచివ్యభారమును వహించుచు వరరుచి కొంతకాలము నకుఁ జతురంగబలసమన్వితుఁడై రాజుతోఁగూడఁ బాటలీపుత్రమునకు వచ్చెను. తపస్సంతోషితయగు జాహ్నవి యను గ్రహమ్మున మహైశ్వర్యంబు నొంది, యారాధితయై ప్రసన్నయైన సరస్వతి రాజ్యతంత్రము లుపదేశింపఁ, దల్లియు గురువులును బహుమానింపఁ, బతిదైవతయగు సహధర్మచారిణి పరిచర్య సేయ, నసహ్యుఁ డగుచునే సుఖముల ననుభవించుచుఁ బెక్కేండ్లు గడపెను.

ముఖ్యమంత్రియగు నతనియందు రాజ్యభారము నెల్ల నిలిపి యోగనందుఁడు విశ్రమదమత్తచిత్తుఁడై రేయింబవళ్లు లంతిపురమందే వసించుచు, నింద్రియార్థపరిశూన్యంబగు నొక్క క్షణమేని సహింపఁజాలక, తనకు మిగుల మూఢత గలిగినట్లు తెలిసికొనలేకపోయెను. అట్టియవస్థలో నున్న యాతనిఁ గనుఁగొని వరరుచి నిర్విణ్ణుఁడయి "ఆహా! భవితవ్యత యెంత దుర్నివార మైనది. సర్వశాస్త్రపారీణుఁడు, ప్రతిభావంతుఁడు, శమదమాదిగుణసంపన్నుఁడు నగు నింద్రదత్తుఁ డెక్కడ? భోగాసక్తుఁడు విగతవివేకుఁడు నయి యేనుఁగువలె నుదించిన యీ యోగనందుఁ డెక్కడ? నమమంత్రిపుసిరి యెవ్వని మోహపెట్టదు? అనుదానికి మొదటి యుదాహరణ మయిన యీనరపతి యడ్డులేక సంచరించుచున్నాఁడు. రాజకార్యచింతాక్రాంతుఁడ నగు నాకు స్వధర్మము నశించుచున్నది. కావునఁ బాడు

మూలనున్న శకటాలుని రప్పించి రాజకార్యావేక్షణమున సహాయుఁడుగాఁ జేసికొందును." అని నిశ్చయించి రాజుతో విన్న వించి మహామతి యగు నాశకటాలుని మంత్రిపదమున నియోగించెను. అతఁడును 'వరరుచి యుండఁగా యోగనందుని జయింప వీలు లే'దని తెలిసికొని నందు వెదకుచు వైరస్వృత్తి నాశ్రయించి రాజ్యతంత్రముల నెప్పటియట్లు నిర్వహించుచుండెను.

ఒకప్పుడు రాజు వరరుచితో భాగీరథీతీరోపవనమ్మున సంచరించుచు దైవవశమున గంగామధ్యమునందు గ్లిష్యత్పంచాంగుళి యగుహస్తమును గనుఁగొని 'యిదియేమి' యని యడుగు నంతలో మంత్రి తనవ్రేళ్లను రెండిటి నాదిక్కుగానే చూపెను. వెంటనే హస్తమదృశ్య మగుటయు నరపతి మిగుల విస్మితుఁడై మరల నడుగుటయు వరరుచి „అయిదుగురు గలసి యీజగమ్మున నేది సాధింపలేరు ?" అని చెప్పుహస్తమునకు „ఏకచిత్తులగు నిద్దఱకే యేది యసాధ్య మగును?" అని రెండు వ్రేళ్ళు చూపితిని. అని గూఢవిజ్ఞానమును జెప్పెను. నిరుపమాన మగు నతని బుద్ధివైశద్యమును జూచి శకటాలుఁడు విషాద మొందెను.

మఱియొకప్పుడు రాత్రులయందుఁ బట్టణముఁ బరికించుటకు నియోగింపఁబడిన రక్షకభటాధ్యక్షుఁడు రేయిరేయికి నొక్కొక్కఁడు నశించుచుండెను. అది విని నందుఁడు వరరుచినే యాపనియందు నియోగించెను. వరరుచియు నర్ధరాత్రమునఁ బురవీథుల సంచరించుచు నెదురుగ వచ్చుచున్న యొకరాక్షి

సుని గనుఁగొని 'నీకేమి యిష్టము?' అని యడిగెను. వాఁడు 'నీపట్టణమునందు రూపవతి యగు స్త్రీ యెవ్వతెయో చెప్పు' మని ప్రశ్నించెను. అందులకు నవ్వి వరరుచి 'మూర్ఖా! ఎవతె యెవ్వని కభిమతయో వానికాపె రూపవతి యగును.' అని నుడివెను. రాక్షసుఁడు సంతసించి జయింపఁబడితిని ఇదిమొదలు ప్రియమిత్రుఁడ వగు నీవు తలఁచినప్పుడెల్ల సన్నిధి సేయుచుందు నని పలికి యంతర్హితుఁ డయ్యెను. ఇట్లు జాగరూకుఁడగు వరరుచి రాజ్యకార్యము లవేక్షించుచుండ నింటఁ గూర్చుండి యభిషంగజడుఁ డైన భూపతి యున్ముఖుఁ డగు నొకబ్రాహ్మణుని గవాక్షాగ్రమునుండి నిరీక్షించుచున్న పట్టమహిషింగాంచి వివేకపరిపంథిని యగు నీర్ష్యచేఁ గలుషితుఁడై, కోపించి యాబ్రాహ్మణుని వధింప నాదేశించెను. రాజాజ్ఞచే విప్రుఁడు వధ్యస్థానమునకుఁ గొనిపోఁబడుచుండ నంగడిపడినదియుఁ బ్రాణము లేనిదయ్యు నొకచేప బిగ్గరగా నవ్వెను.

అది యెఱింగి పట్టపురాజు "బ్రాహ్మణుని జంప వల" దని వారించి "చేప నవ్వుటకుఁ గారణము నిరూపించి చెప్పు" మని వరరుచిని వేఁడుకొనెను. అంతఁ జింతితోపస్థితయగు సరస్వతి కాత్యాయనునితోఁ "వత్సా! యీ లేఁతమామిడిచెట్టు క్రింద రాత్రి యెవ్వరికిఁ గనఁబడకుండఁ గూర్చుండుము. చేప నవ్వుటకుఁ గారణము వినఁగలవు." అని చెప్పెను. అట్లే యటగల సచివుఁడు బాలకులగు పుత్రులతో నచట నివసించుటకు

వచ్చిన యొకఘోరరాక్షసిని జూచెను. 'తినుట కేమైనఁ బెట్టు' మని యడుగుచున్న కొడుకులశిరస్సు మూర్కొని యానిశాచరి 'ప్రాతఃకాలమునందు మీకు విప్రమాంసముఁ బెట్టెదను. ఇప్పుడు వాఁడు చంపఁబడలేదు' అని యూఱడించుచు 'నతఁ డిపు డేలఁ జంపఁబడలే' దని వారలచేఁ నడుగఁబడి 'వాఁడు వధ్యభూమికిఁ గొనిపోఁబడుచుండఁ జచ్చినచేఁపయొకటి నవ్వె' నని చెప్పి 'యది యట్లు నవ్వుటకు గతం బే' మని మరల వారిచేఁ బ్రశ్నింపఁబడి 'పుత్త్రులారా ! అంతఃపురమందున్న రాజస్త్రీ లందఱును భ్రష్టచారిత్రలు. అంతటను స్త్రీవేషధారు లగు పురుషులు గూఢముగా సంచరించుచున్నారు. ఇది యెఱుంగక నిరపరాధుఁడగు బ్రాహ్మణుఁ డీయభిషంగజడుఁ డగు జాల్మునిచేఁ జంపఁబడుచున్నాఁడని చేఁప నవ్వె' నని చెప్పెను. అది విని వరరుచి ప్రాతఃకాలమునందు యోగనందుని కెఱింగించెను. అతఁడును స్త్రీవేషధారులగు నాపురుషులను వెదకి చంపించెను.

భూపతి యిట్లు నిరంకుశుఁడై యుండ, వరరుచియు నట్టివాని సేవను గర్హించుచుండ, నొకనాఁడు సమర్థుఁడగు చిత్రకారుఁ డొకఁడు సభామంటపమునకు వచ్చి మహాదేవీ యోగనందుల ప్రతికృతిని వ్రాసి నివేదించి పరితుష్టాంతరంగుఁడగు నాభూపతివలన బహుధనమును బారితోషికముగఁ బడసెను. ఒకప్పుడు రాజదర్శనము సేయఁ బ్రాసాదాభ్యంతరమునకుఁ జనిన వరరుచి యొకచో నాచిత్త్రరువుఁ గనుఁగొని సంపూర్ణలక్ష

ణములు గలదేవికి లక్షణాంతరము నూహించి కుంచెతో నాపె పిఱుఁదుపై నొక బొట్టు పెట్టెను. మఱునాఁడు యోగనందుఁ డాతిలకమును గనుఁగొని "యిది కాత్యాయనునిచే వ్రాయఁబడిన" దని తెలిసికొని ముగ్ధుఁడై "నిక్కముగ నీతఁడు దుష్టచారిత్రుఁడు. నాయంతఃపురమునందు ద్రోహము సేయుచున్నాఁడు. కావుననే స్త్రీవేషధారులగు పురుషు లితనిచే నెఱుంగఁబడిరి." అని నిశ్చయించి, కోపముచే మండుచు, దుర్వృత్తుఁడగు నీవరరుచిని వధింపుమని శకటాలున కానతిచ్చెను. బుద్ధిమంతుఁడగు శకటాలుఁడు 'ఈతఁడు దివ్యమతిప్రభావుఁడు. ఆపదనుండి నన్నుద్ధరించినవాఁడు. ఇతనిఁ జంపుటకు సురాసురులకును శక్యముకాదు. మనుష్యుల మాటఁ జెప్పనేల!" అని చింతించుచుఁ, గాత్యాయనుఁ దన సదనమునందు నిగూఢముగా నుండఁ బంచి „మహారాజా! మీయాజ్ఞ నెఱవేర్పఁ బడినది." అని యోగనందుని సంతసపెట్టెను.

అంతఁ బెక్కునాళ్ళు గడచనుటయు యోగనందునకు మహాదేవియందుఁ బుట్టిన హిరణ్యగుప్తుఁడను పదునెనిమిది యేండ్ల ప్రాయముగల కుమారుఁడు తండ్రిచే నివారింపఁ బడుచుండియుఁ, దల్లిచే ననుమోదింపఁ బడకయు, మృగయాసక్తచిత్తుఁడై కొంద ఱాప్తపురుషులు పరివేష్టింప నశ్వము నధిష్ఠించి మహారణ్యముఁ బ్రవేశించెను. అం దేకాకియై యొక యడవి పందిని వెనుకొని పరువెత్తుచుఁ జాలదూరము వోయెను. ఇంత

లోఁ బవలు గడచెను. గాఢాంధకారమునందు ఘోరముగ ధ్వనిసేయు ఘాతుక మృగముల గర్జనము లాలించుటచేతనే భయభ్రాంతుఁడైన రాజపుత్రుఁ డొక పెద్ద చెట్టుపై కెక్కెను. తరువాత నొకగడియకుఁ దఱిమికొనివచ్చు సింగమునుండి తన్ను రక్షించుకొను నెలుఁగుబంటి యొకటి యావృక్షమునే యెక్కెను. సమీపమునకు వచ్చు దానిని గనుంగొని భయమ్మున వడఁకుచున్న హిరణ్యగుప్తుని దన తొడపైఁ గూరుచుండఁ బెట్టుకొని యా భల్లూకము "మిత్రమా! భయపడకు" మని మనుష్యవాక్యమున బుజ్జగించెను. తరువాత నా యెలుఁగు సింహముచేఁ బ్రార్థింపఁ బడియు విశ్వాసమునఁ దన తొడపై నిదురించుచున్న రాజపుత్రుని గ్రిందఁబడద్రోయ నిచ్చగింపదయ్యెను. మఱికొంతసేపటికి మేల్కాంచి రాజనందనునంక ముపధానముగా నదియు నిదురించెను. కేసరిచేఁ బ్రలోభితుఁడై హిరణ్యగుప్తుఁడు నిష్కరుణముగా నాయెలుఁగుగొడ్డును భూమిపైఁ బడఁద్రోసెను. దైవవశమున మేల్కొనిన యాభల్లూకము త్రోయఁబడియుఁ బట్టు వదలక కోపించి 'ఓరీ! మిత్రద్రోహీ! ఈనీదుష్టచేష్టితము వెల్లడియగునంతకు నున్మత్తుఁడవై యుండు' మని శపించెను.

ప్రాతఃకాలమునం దున్మత్తుఁడై పురమున కరుదెంచిన కుమారుని గనుఁగొని విషణ్ణహృదయుఁడైనభూపతి సుతునకు స్వస్థత గలుగునుపాయం బరయఁజాలక 'వరరుచి యిప్పుడు

బ్రదికియుండు నేని యున్మాదహేతువు తెలియనగుఁగదా ! నే నాతని జంపించి యెంతకొఱఁతఁ దెచ్చుకొంటిని.' అని తన్ను నిందించుకొనెను. చెంతనున్న శకటాలుఁడు 'మేలు ! వరరుచిని వెల్లడించుటకుఁ దగినసమయము వచ్చిన' దని చింతించి యా రాజు నభయము వేఁడికొని యాతని యానతి వెంబడి నేకసంధాగ్రాహిని బయలుపఱిచెను తోడ్తోన యోగనందునిచేఁ గుమారోన్మాదకారణ మడుగఁబడి కాత్యాయనుఁడు హిరణ్యగుప్తుని జూచి 'యీతఁడు మిత్రద్రోహముఁజేసెను. దాని కిది ప్రతిఫల' మని సరస్వతీప్రసాదమునఁ జెప్పెను. తత్క్షణము హిరణ్యగుప్తుఁడు స్వస్థుఁడయి జనశూన్య మగు నరణ్యమున జరిగినవృత్తాంతమును సాకల్యముగ నభివర్ణించెను. రాజు విస్మితుఁడై 'ఓయి ! నీ కిది యెల్ల తెలిసినది' అని యడుగ వరరుచి 'దేవా ! ప్రజ్ఞావంతులు లక్షణములఁ, బ్రతిభ, ననుమానమున నొరులు సెప్పకయు సర్వము నెఱుంగఁ గలరు. మున్ను నేనిట్లే తిలకము నెఱింగితి' నని పలికెను లజ్జానుతాపములు గదిరి తూష్ణీంభావము నొందిన యోగనందునిచే సత్కరింపఁబడక, తనచారిత్రశుద్ధి ప్రకటితమయినందులకే తన్నుఁ గృతకృత్యునిగాఁ దలంచుచు, నుపకోశాభర్త విరక్తుఁడై 'యనిత్యముకంటె ననిత్యమగు రాజానుగ్రహ మింకఁ జాలు' నని తలంచి తనయింటి కరిగెను.

వచ్చినయల్లుని గని సముద్భ్రాంతచేతనుఁడైన యుపవర్షుఁడు 'విద్వాంసుఁడా ! నీకు విధింపఁబడిన వధదండనమును విని

పతివ్రత యగునాకూఁతురు శోకదగ్ధయు నవిరళాశ్రుధారాపరి ప్లుతలోచనయున్నై నాచే నివారింపఁబడుచుండియు నగ్నిప్రవేశ మొనరించెను. జరాభారజర్జరితావయవనైయ 'హా! కాత్యాయన ! హా ! సకృచ్ఛ్రుతధర ! యని విలపించు నీజనయిత్రి హృదయము తనంతనే పగిలిపోయె' నని బిగ్గరగ నేడ్చెను. కాత్యాయనుఁ డది విని నూతనమగు దుఃఖవేగమున నోడ లెఱుంగక మొదలు నఱకఁబడిన చెట్టువలె భూమిపైఁబడి పెద్ద తడవు విలపించెను. ప్రియబంధువినాశమునఁ గలిగిన శోకాగ్ని యెవ్వనిఁ బరితాపపెట్టదు ?

అంత వరరుచియవస్థను విని వర్షోపాధ్యాయుఁడు శీఘ్రముగ వచ్చి 'వత్సా ! యేమి యిట్లు ప్రాకృతజనునట్లు ధర్మసూక్ష్మ మెఱుంగనివానిభంగి, నవిద్వాంసునివడువున, ననధిగత లోకవృత్తాంతునిపోల్కి దుఃఖాక్రాంత మగు హృదయమును మఱలింపకుంటివి ? నీవు పుట్టిననాఁటఁగోలె శోకము నెఱుంగని వాఁడ వగుట నిజమే. ఇదియైనను నీ వైరాగ్యమును దృఢపఱుచుటకు నీవతిభక్తి నారాధించు దైవముచేఁ గల్పింపఁబడినది. కావున ధైర్యము నవలంబింపుము. మనముఁ గుదురుపఱుచుకొనుము. లోకతత్త్వమును విచారింపుము ఈ జగమునందు సంసార మున్నంతవఱకు నొక యనిత్యతయే నిత్యమైనది. కావున నీశ్వరమాయ నెఱింగియు మోహపడెదవేమి? " అని యిట్లుపెక్కు తెఱఁగుల బోధించెను. ఇట్లు వర్షోపాధ్యాయునిచేఁ బ్రబోధ

తుఁడై వాక్యకారుఁడు విషాదముఁ దొలఁగఁద్రోసి విరక్తహృదయుఁడుఁ బరిత్యక్తసర్వబంధనుండునై శాంతి యొక్కటియే తనకు సహాయముగఁ దపోవనము నాశ్రయించెను.

అంతఁ గొంతకాలము గడచనుటయుఁ బుణ్యారణ్యవాసముఁ జేయుచున్న వరరుచి దైవవశమున మగధదేశమునుండి యచ్చటికి వచ్చినయొక బ్రాహ్మణుని జూచి యోగనందుని వృత్తాంతమునడిగెను. అతఁడును గాత్యాయనుని గుఱుతుపట్టి నమస్కరించి 'మహాశయా! నీవు తపోవనమున కేగినతోడన యవకాశముఁ గొని వైరము నెంచి శకటాలుఁడు యోగనందుని వధించు నుపాయము నరయుచు భూమిని ద్రవ్వుచున్న చాణక్యుఁడను నొక బ్రాహ్మణుని గనుఁగొనెను. "ఎందుల కిట్లు త్రవ్వెద? వని మంత్రిచే నడుగఁబడి యావిప్రుఁడు "నా పాదము నీదర్భ తెగఁ గోసినది. కావున దీనిని గూఁకటి వేళ్ళతోఁ గూడఁ బెఱికి వేయక పోవ" నని పలికెను. క్రూరనిశ్చయుం డగు నితఁడు సహాయుఁ డగునేని నామనోరథము సిద్ధించునని తలంచి శకటాలుఁడాతని సన్మానించి తన గృహమునంద యుండఁ బంచి నందమహారాజు ప్రాసాదమున లక్షసువర్ణములు దక్షిణగాఁ గల త్రయోదశీశ్రాద్ధమ్మున నిమంత్రితు లగు బ్రాహ్మణుల యగ్రభాగమున నాతని నియోగించెను. రాజున కిష్టుఁ డగు సుబంధువను బ్రాహ్మణుఁ డా స్థానమునే యభిలషించెను. నందునిచేఁ బూర్వనియుక్తుఁ డయ్యుఁ జాణక్యుఁడు బలాత్కారముగా

నగ్రాసనమునుండి తఱుమఁబడెను. అంతఁ గోపమ్మున మండుచుఁ చాణక్యుఁడు తల విరియఁ బోసికొని "ఏడుదినములలో దుర్వినీతుఁడు నైశ్వర్యమత్తుఁడు నగు నీ రాజును గడతేర్చి యీ తల ముడిచికొందు" నని ప్రతిజ్ఞఁ జేసెను. ఆచాణక్యుని గూఢముగఁ దన గృహమునం దుంచి యాతఁడు కోరిన యుపకరణములనెల్ల శకటాలుఁ డొసంగెను. అతికోపనుఁ డైన యా విప్రుఁడును నత్యుగ్రము లైన యథర్వమంత్రములఁ బఠించి యొక కృత్యను సాధించెను. ఆ కృత్యచే గ్రసింపఁబడిన యోగనందుఁడు తీవ్రమగు దాహజ్వరమునఁ బరితప్తుఁ డయి యేడవనాఁటనే పరలోకమున కరిగెను. శకటాలుఁడును దోడనే హిరణ్యగుప్తుని జంపి పూర్వనందసుతుఁడగు చంద్రగుప్తునకుఁ బట్టాభిషేక మొనరించి చాణక్యుని మంత్రిపదంబున నియోగించి కృతప్రతిక్రియుఁ డై పుత్రశోకమ్మునఁ దూలుచు మహారణ్యమున కేగె" నని చెప్పెను.

ఇట్లతిశోచనీయ మగు యోగనందుని వృత్తాంతము విని వరరుచి మిగుల ఖిన్నుఁ డయి, సంసారము నసారముగ నెఱింగి, వింధ్యవాసిని నుపాసించి యామె యాజ్ఞచే వ్యాఘ్రవానరసంకీర్ణము గహనము నగు వింధ్యారణ్యమ్మునఁ బరిభ్రమించుచు నొకచో నున్నతమగు వటవృక్షమును జూచెను. ఆ చెట్టుక్రింద ననేకపిశాచములు పరివేష్టింప నున్న కాణభూతి యను భేతాళుం గాంచినతోడనే పూర్వజన్మస్మృతిగలిగి యా కాణభూతి "కుబేర శాపంబునఁ జేసి పిశాచత్వము నొందిన

సుప్రతీకుఁ డను గుహ్యకుఁ" డనియుఁ, "బుష్పదంతుఁ డను పేర నొప్పు తనకు మిత్ర" మనియుఁ దెలిసికొని మైత్రిఁ జూపి యతనికి విద్యాధరచరితముఁ జెప్పి 'మిత్రమా! శీఘ్రకాలము లోనే గుణాఢ్యుఁ డిక్కడకు వచ్చును. అతని కీయపూర్వమగు కథ నెఱింగింపుము. పిమ్మట నీకు శాపవిమోచన మగును.' అని బోధించి శరీరమోక్షమునకై పవిత్రతమ మగు బదరికా శ్రమమునకుఁ బయనించెను.

హిమాలయప్రాంతవనమ్ముల సంచరించుచుఁ గాత్యా యనుఁడు కందమూలఫలాదుల జీవయాత్ర నడపువాని శాకర సుఁడను సార్థకనామధేయముగల మునీశ్వరుఁ గాంచెను. అతిథి పూజ నొంది యతనిజ్ఞానమును బరీక్షించుతలఁపున దర్భక్షత మగు నతనికరతలమునుండి స్రవించు రక్తధారను శాకరసము గాఁ బరిణమింపఁజేసెను. మునియు నది చూచి నాతపము ఫలిం చిన దని గర్వించెను. కాత్యాయనుఁ డాయహంకారము జ్ఞాన మునకు శత్రువని యాతనికిం దెలిపి' నీవిజ్ఞానము నెఱుంగఁగోరి రక్తధారను శాకరసముగా నొనరించితిని. ఓమునీశ్వరా! నీచే నిప్పటికి నహంకారము విడువఁబడ లేదు. జ్ఞానమార్గమునం దహంకారము దురతిక్రమ మగు పరిఘము. జ్ఞానములేక యెన్ని వ్రతము లొనరించినను మోక్షములేదు. అనిత్యమగు స్వర్గము గూడ ముముక్షువులచిత్తమును లోభపెట్టఁజాలదు. కావున నహంకృతిని విడిచి విజ్ఞానమును సంపాదింప యత్నింపుము.

అని మోక్షరహస్యము నుపదేశించి యాతనిచేఁ బ్రణామపూర్వకముగఁ గొనియాడఁబడి బదరీకాశ్రమభూమి కరిగెను. అందు శరణ్యయగు పార్వతి నుపాసించి తత్ప్రసాదమున దివ్యగతి నొందెను.

---

* కుమారిలభట్టాచార్యుఁడు

ఉపనిషత్తులలోనె "దేహాత్మవాదము" పేరితో నవైదిక మతచిహ్నములు గలవు. ఆయవైదికమతప్రవర్తకులగు వారిని గాలాంతరమున "తీర్థంకరులు, లేక జినులు" అనియు, నామతమునకు (1) జైనమతమనియు నామములు కలిగెను. ఆతీర్థంకరు లిరువదినల్వురు కలరు. ఆయిరువదినల్వురులో నిరువదిమూఁడవ తీర్థంకరుఁడగు 'పార్శ్వనాథుని మనయాంధ్రదేశమునందు జైనమతస్థులగు 'మారువాళీలు' సేవించుచుందురు. ఇరువదినాల్గవ తీర్థంకరుఁడగు 'మహావీరుఁడు' బుద్ధునకు సమకాలికుఁ డనియు బేహారురాష్ట్రమున నాతఁడు తనమతప్రచారముఁ జేసె ననియుఁ జారిత్రికులు చెప్పుదురు

---

* ఈచరిత్ర శంకరవిజయాదిగ్రంథములఁ బరిశీలించి వ్రాయఁబడినది.

(1) జైనమతము నాల్గువిధములగు బౌద్ధమతభాగములలో నొకటి యని వేదాంతశాస్త్రజ్ఞు లనెదరు.

ఆజైనమతము జనసామాన్యమున కందుపాటగు ధర్మములుకలదిగా మహావీరునిచే మార్పఁబడినందున బేహారు, కళింగాదిదేశములలో నతి వ్యాప్తినొందెను. 'ఖారవేలుఁ'డను కళింగదేశపుమహారాజీజైనమతము నభివృద్ధి నొందించుటకై 'కళింగోత్కల'దేశములలో విశేష దానధర్మముల నొనర్చెను. (1)

అందువలనఁ గళింగోత్కలవిహారాదిదేశములలో వైదికమతము నామమాత్రావశిష్టమయ్యెను. ఏయెడఁ జూచినను జైనబౌద్ధమతములవిజృంభణమే కాన్పించుచుండెను.

ఇట్లుండినను వైదికమతాభిమానము, వైదికవిద్యాభ్యాసము దేశమున నచటనచటఁ బొడచూపుచునేయుండెను. ఆజైనమతాతిరేకకాలముననే ఆంధ్రోత్కలదేశములనడుమను మహానది యను నొకయేటియొడ్డున (2) 'జయమంగల'మను గ్రామమునందు 'తైత్తిరీయవేద' శాఖకుఁ జేరిన ''చంద్రగుణాయోగీశ్వర

---

1 ఖారవేలుఁడు పాటలీపుత్రాధిపతియు అశ్వమేధయాగ మొనర్చి వైదికమతాభివృద్ధి నొనర్చిన పుష్యమిత్రునిపైకిని ప్రతిష్ఠానపురాధీశుఁడు నాంధ్రప్రభువు నగు 'శాతకర్ణి' మహారాజుపైకిని దండయాత్ర లొనర్చుట జైనమతవ్యాప్తికే యని తోఁచును. ఈయంశములు హాతిగుంఫశాసనముల వలనఁ దెలియనగుచున్నవి. పైయంశములు క్రీ పూ 158వ సంవత్సర ప్రాంతమునవై యుండెను

2 జయమంగలగ్రామము గంజాము మండలమున 'బరంపురము అస్కా' పట్టణములకు నడుమఁగలదు మహానది యను నది చిన్నయేరై యు చిక్కల్ల కుఱుకదిగా నున్నది

భట్టు లను విప్రదంపతులకుఁ (1) 'కుమారిలుఁడు' అను బాలుఁ డుద్భవించెను. దుర్మతనిర్మూలనమునకై శివునాజ్ఞచేఁ కుమారస్వామి కుమారిలభట్టుగా జన్మించె నని శంకరవిజయమునఁ గలదు

'కుమారిలుఁడు' చిన్నతనమునుండియు మేధాశాలియై వేదవేదాంగములం గఱచి తోడివిద్యార్థులలో మిన్నగ మెలఁగెను. ఆతనికి వేదబాహ్యమగు జైనముపై నీర్ష్య మెండయ్యెను. కాని, యామతమును ఖండించుటకు జైనులు తమమతగ్రంథముల నితరులకుఁ జూపనివారగుటచేత నామతమును శాస్త్రయుక్తముగా ఖండింప వీలు కలుగలేదు. (2) అందువలనఁ గుమారిలుఁడు జైనబ్రహ్మచారివేషమును ధరించి జైనపండితులకడ నామతగ్రంథములను జదివి యందలిమర్మములను గ్రహించెను.

ఆతఁడు జైనగురువులకడ మారువేసముతో విద్య నేర్చుచుండ నొకఁ డెట్లో యాతనిరహస్యముఁ దెలిసికొని మేడపై

---

1 కుమారిలభట్టు క్రీ త ఏడవశతాబ్దములోని వాఁడని యాధునిక చారిత్రకులును, యుధిష్ఠిరశకము 2110 సం॥ము అనఁగా క్రీ పూ 991 సం॥రమున జన్మించె నని సనాతనధర్మచారిత్రికులును వ్రాయుచున్నారు.

2. జైను లితరులకుఁ దమగ్రంథములఁ జూపనందునఁ దదితరులు జైనులను నిర్గ్రంథు లనిరి. కాని, నేఁటికాలమున జైనమతగ్రంథములు వందలకొలఁది ముద్రితము లయినవి.

నిద్రించునాతనిని గ్రిందికిఁ ద్రోసివేయు నతని కొకకన్ను క్రిందఁ బడినప్పుడు పోయెనఁట !

జైనమతఖండనమునకును వేదప్రతిపాదితకర్మములే ముక్తి సాధనము లనుటకును 'జైమినిమహర్షి' కృతమగు పూర్వమీమాంసాశాస్త్రము నాధారపఱచికొని ప్రచార మారంభించెను

ఆకాలమున కుమారిలభట్టాచార్యుఁ డుండు దేశమును 'మేదినీ'పురాధీశుఁడగు 'సుధన్వ'మహారాజు పాలించుచుండెను. ఆరాజాస్థానమునకుఁ బలువురు జైనమతపండితులు చేరి యామహారాజును వైదికమతవిముఖునిగాను, జైనమతాభిమానినిగాను జేసిరి. రాజాదరణము లేనందున వైదికకర్మలు సంస్థానమున సన్నగిలెను. కాని, సుధన్వమహారాజుభార్య సనాతనవైదికమతాభిమానిని, విదుషీమణి, సత్స్వభావ. భర్త జైనమతావలంబి యగుట కెంతయు వగచి, భర్తతో మతవాదమునకుఁ గడంగునుగాని జైనమతపండితులు చెప్పు వైదికమతఖండనోపదేశములను వినినభర్త చెప్పుయుక్తులకుఁ బ్రత్యుత్తరములు చెప్పలేకుండును. కాని, వైదికధర్మమే యుక్తధర్మ మనునమ్మిక కలదగుటచే జైనమతమును ఖండించుపండితుఁ డెవ్వఁడైనఁ గలుగకపోవునా ? అని తలంచుచుండెను

ఇట్లుండ నొకనాఁడు కుమారిలుఁడు మేదినీపురమున కేఁగుటయు, మహారాణిమేడకు సమీపమున నడచుచుండుటయుఁ

దటస్థించెను. సదా వైదికమతోద్ధారణ మునే యోచించుమహారాణినోఁట నీక్రిందియర్థముగల పద్యభాగము వెలువడెనఁట !

1 ఏమి చేయుదాన; నెచటి కేఁగుదాన ?
వేదముల నెవఁ డుద్ధరింపఁగలఁడు ?

అన నది విని యట్లయినను రాజసభకుఁ బోయి జైన పండితుల నోడింపుసమయమునకు వేచియున్న కుమారిలుఁడు వెంటనే యిట్లు ప్రత్యుత్తరముగా నామె నుడివిన పద్యమును బూర్తి చేసెనఁట !

2 సుందరీ! చింత మానుము; నేను భూతల
మున భట్టాచార్యుఁడనై యుంటిని

ఈ ప్రత్యుత్తరముచే మహారాణి యాశ్చర్యానందభరితయై కుమారిలుని దనసౌధముపైకి రప్పించి యాతని వృత్తాంతముఁ దెలిసి, యీతఁడు తప్పక జైనుల నోడింపఁగలఁ డని తలఁచి, బహూకరించి కుమారిలునకు రాజసభాప్రవేశము గలుగు నవకాశముఁ గల్పించెను.

రాజదర్శనానంతరము కుమారిలభట్టుఁడు రాజసభకు వచ్చి పోవుచు నొకప్పుడు రాజసభలోనుండ సభాసమీపమున నొక రసాలవృక్షముపై నున్న కోయిల కుహూరుతము సేయ

---

1. కిం కరోమి, క్వగచ్ఛామి, కో వేదానుద్ధరిష్యతి
2. మానిషీద, వరారోహే ! భట్టాచార్యోస్మి భూతలే

నది నెపముగఁ గుమారిలభట్టాచార్యుఁ డీక్రిందియర్థముగల శ్లోకముఁ జదివెనఁట !

(1) ఓపికమా ! నీచములై మలినములై నిందితపు కఱుకుపలుకులుగల కాకకులముతో నీవు కలియకుంటివేని యపుడు శ్లాఘనీయ వగుదువు.

అన నాపద్యార్థము, నీచులై యయుక్తవాదులగు జైనులచే మహారాజావృతుఁడు కాకుండిన నాతఁడు కొనియాడఁదగినవాఁ డను నంశమును స్ఫురింపఁజేయ మహారాజు విన్ననగు మోమునుగలవాఁ డయ్యెను. రాజు నిట్లు పలుకుటచే సచివాదు లుద్విగ్నమానసు లైరి. జైనపండితులు క్రోధావేశపరవశు లైరి. సభాసదులు గుసగుసలతో గజిబిజి పడిరి.

అంత వయోవృద్ధుఁడు, విద్యావృద్ధుఁడు, సర్వసముఁడు నగు నొక్క-మహాపండితుఁడు సభలో నిలిచి సభలోని కలకలమును వారించి "ప్రభువర్యా ! సభాసదులారా ! జినమతము దుష్ట మనియు, వైదికమత మత్యుత్తమ మనియు నీభట్టాచార్యునితలంపు. జైనపండితులు తద్వ్యతిరేకులు. అదియే యిప్పటి కలవరమునకుఁ గారణము. కాన వీరిరువురమతధర్మములు శాస్త్రదృష్టాంతములుగల వాదప్రతివాదములచే నిర్ణయించుకొం

---

(1) శ్లో॥ మలినైశ్చేన్న సంగస్తే నీచైః కాకకులైః పిక !
అతిదూషకనిర్హ్రాదైః శ్లాఘనీయ స్తథా భవేః॥

దురుగాక !" అని పలుక నందులకు మహారా జంగీకరించి యొక్కనాఁడు సభ నేర్పఱచెను.

ఈవృత్తాంతము నలుగడల వ్యాపింప నుభయమతాభిమాను లగుపండితులు పలుదిక్కులనుండియు మేదినీపురమునకు రాఁదొడంగిరి.

నియమితదిన మేతేర రాజపురుషులు పండితు లగుసభ్యులకును, జూపఱులకును దగినయేర్పాటుల నొనరించిరి. పండిత మండలాగ్రగణ్యులు నిర్ణీతస్థానముల నలంకరించిరి. ఖండన మండనములం జేయఁదలఁచిన భట్టాచార్యాదు లిష్టదేవములఁ గొలిచి సభలోఁ బ్రవేశించిరి. మహారా జసర్ఘ్యమణిస్థగితసింహాసనమున నారూఢుఁ డయ్యెను. విదుషీమణియగు మహారాజ్ఞియు వాదోపవాదము లు విన సభలో నుచితస్థలమునఁ గూర్చుండెను.

పిమ్మట జైనవైదికమతవేత్త లగు మహాపండితులను మధ్యవర్తులనుగా నెన్నుకొని కుమారిలుఁడును, జైనపండితులలో శ్రేష్ఠుఁ డగు నాతఁడును వాదమునకుఁ గడంగిరి.

"వేదోదితకర్మములే యాచరణీయములు, తద్వ్యతిరేకములు త్యాజ్యములు" అని కుమారిలభట్టాచార్యుఁ డుపపాదించెను. "వేదములు పౌరుషేయములు. అందుఁ జెప్పఁబడు యజ్ఞాదికర్మములు హింసాత్మకములుగాన వేదకర్మము లనాచరణీయములు. అహింసాత్మకములగు జైనధర్మములనే యాచరింపవలయు" నని జైనపండితుఁడు ఖండించెను.

అందుపై (1) "విధివాదము, అణువాదము, వ్యక్తివాదము, శక్తివాదము, క్రోడవాదము, స్ఫోటవాదము, ప్రక్రియావాదము, ఆస్తికవాదము" మొదలగు వివిధశాస్త్రసంబంధములగువాదములు, ఖండనమండనములతోఁ జెలరేఁగెను

వారివాదములలో "వేదములు, షడ్దర్శనములు, షడంగములు, సౌగతము, చార్వాకము" మొదలగు వివిధశాస్త్రములు చక్రాకృతిని గిఱ్ఱునఁ దిరుగుచుండెను మదిసిపురమహారాజుసభ వేదశాస్త్రఘోషములచే సముద్రమురీతి నుప్పొంగుచుండెను. సభ లేనప్పుడును, సభయుంకుములపండితులనివాసములలోను పెక్కు లుపసభలు జరుపుచుఁ బండితులు తమ తమపక్షపునాయకుల కాలోచనములఁ జెప్పుచుండిరి. ఆసభాముఖమున నందఱపండితులలోను కుమారిలుని యుక్తిప్రత్యుక్తులు సర్వశాస్త్రపండితులకు ముఖపిధానముం గల్పించెను. షణ్ముఖునివలె నతనిముఖమునుండి వాగ్ఝరి నలుదిక్కుల విస్తరిల్లెను. అందులకేకాఁబోలుఁ గుమారుని కుమారస్వామియొక్క యపరావతార మనిరి! ఆతనివాగ్బాణముల కెదుర నేవిపక్షపండితులును నిలువలేరైరి. ఆతని శాస్త్రహుంకృతులకు విమతస్థులు సమ్మోహితులై "జితాస్మః" అనిరి.

మధ్యవర్తులగు పండితులు కుమారిలభట్టాచార్యునికే జయపత్ర మొసఁగిరి. సుధన్వమహారాజును జైనమతమును ద్యజిం

---

1. పైవాదములు హైందవుల శాస్త్రచర్చలలోఁ గలుగును

చి వైదికమతావలంబియై కుమారిలుని గురువుగా గ్రహించెను. నిరావలంబులైన జైనమతగురువులుఁ దన్మతపండితులు నాదేశ మును వదలి దూరప్రదేశముల కేఁగిరి. అంతకుమున్ను జైనమత ము నవలంబించిన జనులు జినమతమును వదలి వైదికమతము నవలంబించిరి.

కొందఱు చారిత్రికులు సుధన్వమహారాజు కుమారిల భట్టాచార్యుని యుపదేశముచే జైను లాదేశమునుండి తరిమి వేయఁబడి రని చెప్పుదురు.

ఇట్లు కుమారిలభట్టాచార్యుఁడు జైనమతఖండన మొనర్చి తాఁ జేసినప్రతిజ్ఞను నిర్వహించినవాఁ డగుటవలన మహారాణిచే విశేషసత్కారముల నొందెను

పిమ్మట నాపండితుఁడు జైమినిప్రోక్త పూర్వ మీమాం సాసూత్రములకు "తంత్రవార్త్తికభాష్యము, శ్లోకవార్త్తికము" మొదలగు మహాగ్రంథములను జేసెను. ఆతనికి శిష్యప్రశిష్యు లగు "ప్రభాకరభట్టు, పార్థసారథిమిశ్రుఁడు" మొదలగువా రెన్నియో యుద్గ్రంథములను, కుమారిలభట్టాచార్యునిమత మును సమర్థింపుచు రచించి బ్రాహ్మణమతమును, వైదికవిద్యను నలుదిక్కుల వ్యాపింపఁజేసిరి.

కుమారిలభట్టాచార్యుని యత్యధికపాండిత్యమును, వైది కమతప్రచారమును, జైనమతనిర్మూలనమును జూచి " జినవిజ

యము’’ అనుగ్రంధ మొనర్చినయాతఁడు తనగ్రంధమున నిట్లు వ్రాసెను.

(1) “ఆంధ్రోత్కల దేశములసంధియందు మహానదీతీరమునం దుండిన పవిత్రమైన ‘జయమంగల’ గ్రామమున “చంద్రగుణా యజ్ఞేశ్వరులు’’ అను యుత్తమదంపతులకు మహావాదియు, విపక్షభయంకరుఁడును, వేదాభిమానియు, జినమతాంతకుఁడును, గురుద్వేషియు, నాంధ్రుఁడును, ‘తైత్తిరీయ’ వేదశాఖీయుఁడు నగు కుమారిలభట్టాచార్యుఁడు పుట్టెను.’’

ఈమహానుభావుఁ డొకప్పుడు జైనమతబోధలవలన వేదము పౌరుషేయముగాఁ దలఁచెనఁట! జైనమతమును మారువేషముతో నేగురువులకడ నేర్చెనో యాగురువులనే రాజసభలో నోడించి దేశభ్రష్టు లగునట్లు చేసి గురుద్రోహి యయ్యెనఁట!

ఆ రెండు మహాపాపములకుఁ బ్రాయశ్చిత్తముగాఁ గేవల కర్మబ్రహ్మవాది యగు నీ మహానుభావుఁ డంత్యకాలమునఁ “బ్రయాగమహాక్షేత్రము’’నందు ‘తుషాగ్ని’లోఁ బడి యసువులను విడిచెనఁట!

---

1. ఆంధ్రోత్కలానాం సంయోగే పవిత్రే జయమంగలే. గ్రామే తస్మిన్మహానద్యాం భట్టాచార్యః కుమారకః॥ ఆంధ్రజాతి స్త్రిత్రిరీకో మాతా చంద్రగుణాసతీ. యజ్ఞేశ్వరః పితాయస్య ...... మహావాదిర్మహాఘోరః శ్రుతీనాంచాభిమానవాన్ జినానామంతకస్సాక్షాత్! గురుద్వేష్టాతి పాపవాన్.

ఈతఁడు తుషాగ్నిలోఁ బ్రవేశించునాఁటికే శ్రీశంకర భగవత్పాదాచార్యులవా రాస్థలమునకుఁ జేరి కుమారిలభట్టాచార్యుని దుషాగ్నినుండి వెలువరించుట కెంతేని యత్నించెను గాని, కుమారిలుఁడు మనస్సాక్షికి వ్యతిరేక మొనర్ప నిష్టపడక కేవలబ్రహ్మవాదియగు శంకరునిసన్నిధినే దివంగతుఁ డయ్యె నని శంకరవిజయమునఁ గలదు.

ఆంధ్రజాతియం దుద్భవించిన 'యాపస్తంబమహర్షి'కిఁ బిమ్మట నతని కీడైనయాంధ్రుఁడు కుమారిలభట్టాచార్యుఁడే. ఆపస్తంబుఁ డాంధ్రపిత. కుమారిలభట్టాచార్యు డాంధ్రుల కగ్ర సోదరుఁడు.

*తెలుఁగునాఁటి తురుష్క యోగి

తెలుఁగునాఁటిని బరిపాలించిన మహమ్మదీయ ప్రభువులలో "కులీ కుతుబ్ శాహ" పుత్రుఁడగు "ఇబ్రహీం కుతుబ్ శాహ" యగ్రగణ్యుఁడు ఈతనినే "మల్కిభరాం" అని యాంధ్రకవులు నుడివి యున్నారు. ఈధర్మప్రభువు హిందూమహమ్మదీయమతములను రెండింటిని సమానముగ నాదరించెను. చెఱువులు, ఆనకట్టలు మొదలగు వ్యవసాయోపకార కార్యము లొనరించి దేశమును సుభిక్షముగఁ జేసెను. మతసంస్థలను బోషించెను అనేకసత్రములను బాఠశాలలను బెట్టించెను. అన్నిఁటికంటె నాంధ్రులు శాశ్వతముగఁ బొగడఁదగిన దీతని యాంధ్రభాషాపోషణము ఈతనికాలముననె మహమ్మదీయులు నాంధ్రకవిత్వమును బోషింతు రనుప్రథ కలిగెను. అందులకు నిదర్శనము "అద్దంకి గంగాధరమహాకవిచే" నీతఁడు కృతి నందిన తపతీసంవరణ మహాకావ్యమే.

మఱియు నితని సైన్యాధీశుఁడగు "అమీన్‌ఖాను" అను మహమ్మదీయప్రముఖుఁ డాంధ్రవాఙ్మయమున నాదియగు నచ్చతెలుఁగు కబ్బమును గృతి నొందెను. అది పొన్నిగంటి తెలగనార్యకృత మగు యయాతిచరిత్ర. "యథాగాజాత

---

* ఇది క్రీ. శ. 1550 – 1580 వఱకు గోలకొండను రాజధానిగాఁ జేసికొని త్రిలింగదేశమును బాలించిన "ఇబ్రాహీం కుతుబ్ శాహి" కాలమున జరిగి యుండెనని మాతండ్రిగారివలన వినియున్నాను

థాభృత్యా” అను నానుడి యిట సార్థకమయ్యెఁగదా! మల్కి-భరాం తన దండయాత్రలయందును బెక్కం్రడు కవులను గూడ వినోదముగాఁ దీసికొని పోవుచుండువాఁ డఁట!

ఇట్టి విశాలహృదయుఁడును దేశభాషాపోషకుఁడును సర్వమతసహిష్ణువు నగు మల్కి-భరాం కాలమున నీక్రిందికథ జరిగె నఁట!

ఆతనికాలమున గోలకొండలో సర్వసంగపరిత్యాగియు, సర్వశాస్త్రజ్ఞుఁడును, మహాభక్తుఁడు నగు ప రు (మహమ్మదీయ సన్యాసి) యుండెను. ఆతఁడు సభక్తిన్యగ్మెఘుఁడై గానము చేయునపుడు వాయించుకొనుటకు “కందిరి” యను వాద్యవిశేషము, భిక్షాన్నమును స్వీకరించుట కొకకొబ్బరిచిప్పయు, ధరించిన కౌపీనవస్త్రము కాక మఱియొక యుపకౌపీనము మాత్రమె వానిధనములు శాస్త్రీయముగ నేమసీదుననో సకాలమున నమాజులు చేయుచు క్షుత్పీడితుఁడైనపుడు మాధుకరాన్నముచే క్షుద్బాధ నడఁచికొనుచు నేమఠమునదో శీతవాతాతపబాధలఁ దీర్చుకొనుచుఁ గాలక్షేపముఁ జేయుచుండెను. ఆతఁడు గోలకొండయందే జన్మించి దీక్షనొందిన యాంధ్రుఁడగుటచేఁ దెనుఁగునాఁడుననే తిఱుచు సంచరించువాఁడు. అట్టియూతని కొకసమయమున, “శాస్త్రము లసత్యములు కావు; పరమేశ్వరుని నమ్మినవాని కెట్టి దుష్కరకార్యము లైనను సుకరము లగును” అనుసంశము లోకమునకుఁ జూపింపవలయు నను కుతూహలము కలిగెను.

అందులకై యీ్రకిందిరీతిని దలంచెను. "ఈదేశ మేలు పాచ్ఛా (మహమ్మదీయప్రభువు) కూంతును నేను బెండ్లియాడు దు ననిన నెవరును నమ్మరు. అట్లు చేయుదు నంటినేని నాకు బహుబాధలును గలుగవచ్చును అది లోకమునకు సద్బోధకి మగు గాక!" అని తలంచి, మఱునాంటియుదయమునం గాల్యకరణీయములు నిర్వర్తించి కందిరిని వాయించుకొనుచుం బట్టణమున సంచరింపుచు, "పాదుసా గారి కుమార్తెను నేను బెండ్లియాడుదు నోహో!" యని కేకలు వేయనారంభించెను. "అది యేమి" యని పౌరు లడుగంగా "నేని గోలకొండ నబాబుగారి కుమారితను బెండ్లియాడెద" నని చెప్పనారంభించెను. అది విన్న వారందఱు నవ్వసాగిరి కొందఱు హేళనము చేసిరి. మఱికొందఱు మందలించిరి. పకీరు పిచ్చివాండని కొంద ఱనిరి. ఆపకీరాపట్టణముననె కాదు, ఆరాజ్యములోని యన్నిపట్టణముల లోను గ్రామములలోను మూలమూలల నున్న పల్లెలలోను గూడనట్లు చాటించెను దానికి నేరాన్వేషకులవలన రాజపురుషులు తెలిసికొని కినిసి యమర్యాదాకరముగ నతండు వర్తించుచున్నాండు, పిచ్చివాండు అని తలచి పిచ్చివాండ్రవైద్యశాలలోం జికిత్సం జేయింప నాతని బలాత్కారముగాం బ్రవేశపెట్టిరి. నీరోగియని వైద్యులు పరీక్షించి వదలిరి పిమ్మట రాజద్రోహి యని రాజపురుషులు కారాగారమున నునిచి బాధించిరి. చెఱసాల యందును నాతండు పాచ్ఛాకొమరితను బెండ్లియాడుదు నను

మాటనువదలలేదు. భక్తసంకీర్తనములను మానలేదు. వేళతప్పకుండగ నమాజులు చేయుచుండెను. ఖురానును జదువుచుండెను ఇట్లుండ నొకప్పుడు పాచ్ఛా కారాగారమును బరీక్షింప వచ్చెను. అపుడు కారాగారరక్షకులు పరుండో నీవు ప్రభువు వచ్చిన సమయమున మిన్నకుండుమనెని నిన్ను రేపె చెఱనుండి విడిచెదమని యంతఁ గొలిపిరి. ఏమియు ననక మిన్నకుండెను. శృంఖలాబద్ధుఁడగుపకీరు నబాబుకంటఁ బడఁగనే, "ఓపాచ్ఛాగారూ! మీకుమారిని నేఁ బెండ్లియాడెద" ననెను. "అదేమి" యని నివ్వెఱపడి పాచ్ఛా చెఱసాలోద్యోగులం బ్రశ్నింప, వా "రితఁడు రాజద్రోహి" యని చెప్పఁ, "గ్రూరముగా నిర్బంధింపుఁ"డని మహామ్మదీయప్రభువు కఠినముగఁ జెప్పి వెడలిపోయెను.

భక్తునకు నిర్బంధము లెక్కుడయ్యెను. ఆతని పట్టుదలయు నెక్కువయ్యెను. రాత్రులాతని సంకీర్తనములచేఁ గారాగారము మారుమ్రోయుచుండెను కారాగారస్థుల మనఁబులు భక్తుచే ద్రవీభూతంబు లగుచుండెను. దుర్మార్గులు, సన్మార్గులును,భగవద్భక్తులు, నగుచుండిరి. ఆతనిసద్బోధనలను వినవిన, కారాగారవాసులు చేయునేరముల్లు తగ్గుచుండెను. చెఱనుండి విడుదలఁ గన్నవారు, కార నుండిసంపాదించిన సద్బోధామృతరసమును దేశమున వెదచల్లుటచే దేశములోఁగూడ నేరములు తగ్గెను. అందువల్ల కారాగారమునకు వచ్చువారు తగ్గిరి. దండనాధికారులకును గారాగారపాలకులకుఁ బని తగ్గెను. ఈయంశము క్రమముగా

పాచ్ఛాకుఁ దెలిసి భక్తుఁడగు పకీరును సమ్ముఖమునకు రప్పించి గౌరవించి, "నీకేమి కావలయు" ననెను. అన పకీరు, నీకూఁతును నా కిచ్చి పెండ్లిచేయవలయు" ననెను. పాచ్ఛా కిపుడు కోపము పోయి నవ్వు వచ్చెను. అపుడు వారిద్దఱు సంభాషించిరి:—

పాచ్ఛా:—(నవ్వుచు) నాకొమరితను బెండ్లియాడుటకుఁ దగి[illegible]యోల్లిని (పెండ్లికొడుకు కన్యాపిత కిచ్చుశుల్కము) నాక యీయఁగలవా?

పకీరు.—ఈయఁగలను. ఏమి కావలయును? ఎంత కావలయును?

పాచ్ఛా:—పెద్ద నిమ్మకాయలవంటి నూఱు మంచిముత్యములు కావలెను. (దుర్లభమగు నిట్టివానిఁ దేలేఁడని పాచ్ఛా తలంపు.)

పకీరు:—ఈయఁగలను.

పాచ్ఛా:—ఎంతకాలమునకుఁ దేఁగలవు?

పకీరు:—కాలపుమితిని జెప్పలేను గాని తెచ్చుటమాత్రము నిశ్చయము. నేను తెచ్చునపుడు మార్గమునందు మీరాజపురుషు లేయాటంకమును జేయరాదు.

అన నల్లె యని పకీరును పాచ్ఛా వదలెను.

పకీ రెక్కడ; నూఱు మంచిముత్యములు— అందును నిమ్మపండ్లంతయుఁబవు కలవి తెచ్చుట యెక్కడ? కాని పకీరు రత్నశాస్త్రముఁ జదివి దక్షిణసముద్రాన ముత్యము లుండు

నని తెలిసికొని, పిమ్మట నారతాఁ కరవేలను జేరెను. అట నిసుకతో గట్టు వేసి తనకు శక్యమగునంత చెఱువు నేర్పఱచెను. తన యుపకోపినములు నడుమునకుఁ జుట్టి కందిరి నొకదోఁ బదిలపఱచి, కొబ్బరిచిప్పతో సముద్రపునీటిని దాను నిర్మించిన తటాకములోనికిఁ దోఁడ నారంభించగా, యాత్రికు లతని లీలింతను జూచి, "ఇదే" మనిరి. "సముద్రపునీరిని దోడి... ము దరిములోని మంచిముత్యములం గొనుటకని పకీరు చెప్పెను. జనులు నవ్విరి. వెఱ్ఱివాఁడనిరి. వెఱ్ఱి వేయువిధా లనిరి. అతని యాయాసముం జూచి పకీరు వ్యర్థముగా నాయాస మొందుచు న్నాఁడని కొందఱు విచారించిరి. ముత్యములు దొరకకపోయినను, చెఱువులోని నీరింకిన పిమ్మట నుప్పయిన లభించు నని మఱి కొంద ఱనిరి. రాత్రింబవళ్ళటులు కష్టపడి పకీరు పని చేయుచుండఁగ వెక్కిరింతకు వేడుకకు మఱికొందఱుకూడ నతనిం గూడి చిప్పలతోఁ గుండలతో నీటిని దెచ్చి తటాకములోఁ బోయసాగిరి. కొన్ని దినాలకుఁ దటాకము నీరితో నిండెను. కాని సముద్రము లో నొక్కచుక్కయైనఁ దగ్గినటులు లేదు. పైపెచ్చు నీరు చెఱువులో హెచ్చయి చెఱువు గట్టు తెగి నీరంతయు సముద్రమునకే చేరెను. అందఱును గొల్లున నవ్విరి. సన్యాసి మాత్రము నిరాశ నొందలేదు. మరల మునుపటికంటెఁ బెద్దగట్టును కొన్ని దినములలో వేసి మరల నీటిని దోఁడ నారంభించెను. అతని ప్రయత్నమున కాటంకములఁ గలుగఁజేయుచు జనులు పిచ్చివాఁడ

వనిరి. మీారే పిచ్చివా రని తనపనిని మానక పకీరు నీటిని దో డుచుండెను. ఎంతకష్టపడుచుండినను నియమితకాలములలో భ గవద్భజనమును మానకుండెను మాధుకరాన్నమున క్షున్నివా రణము చేయుచుండెను ఇట్లు కొంతకాలము గడవఁగా సము ద్రుఁ డితని పట్టుదలను, 'అల్లా'యందుఁగల నమ్మకముతోఁ గూ డినభక్తిని జూచి చూచి యాశ్చర్యపడి నల్లనిదేహముగలవృద్ధ బ్రాహ్మణవేషమునఁ బ రునకుఁ బొడసూపి యాతని బలుకరించి యిట్లు ప్రశ్నించెను.

సముద్రుఁడు.—బాబా! నీ వెందులకు సముద్రపునీటిని దోఁడుచుంటివి?

పకీరు.— సముద్రములోని పెద ముత్యములం గొనుటకు.

సముద్రుఁడు —సముద్రములోని నీటిని దోఁడఁగలవా?

పకీరు.— తోఁడఁగలను.

సముద్రుఁడు:— ఎంతకాలమునకు?

పకీరు.—ఎంతకాలమునకో చెప్పలేను.

సముద్రుఁడు —నీకాముత్యము లెందులకు?

పకీరు:—పాదుషాకూఁతుం బెండ్లియాడుటకు.

సముద్రుఁడు:—సర్వసంగపరిత్యాగి వగు నీ కింతను బెండ్లి కావలయునా?

పకీరు:—(నవ్వుచు) నాకుఁ బెండ్లి యవసరము లేదు. కాని భగవంతుని నమ్మి, మంచికార్యముకై పట్టుదల గలిగి, పరాపకారముం దలపెట్టక పరోపకారమునకై మెలఁగిన స్వల్పజనుఁడైన నత్యంతఘనకార్యముం జేయఁగలఁ డను శాస్త్రనిదర్శనమును లోకమునకుఁ జూపుటకే యిట్టిప్రయత్నముం జేయుచుంటిని.

అంత సముద్రుఁ డాతని యుద్యమమునకు మెచ్చి, "నేనే సముద్రుఁడను నీయుద్యమమునకు మెచ్చితిని. నీకుఁ గావలసిన ముత్యాలకంటె నధికమగు ముత్యములనే యిచ్చెద" నని యొకకెరటమువలన పకీరు కోరినవానికంటె దశగుణములుగా ముత్యములను బరుకాళ్లకడ కెరటముతోఁ బడునట్లు చేసెను.

మఱునాఁ డావార్త గ్రామములోఁ దెలిసెను. ప్రజలాశ్చర్యము నొందిరి. పకీరు మహానుభావుఁడని యాతనికి బ్రహ్మరథము పట్టిరి. బండి చేసి యాతనిముత్యములను బస్తాలతోఁ గట్టి పదిలపఱచి రాజధానీపురమునకుఁ బంపిరి. కంచిరి వాయించుకొనుచుఁ దన్మయుఁడై పకీరు భగవత్సంకీర్తనములఁ బాడుకొనుచుఁ గొలఁదిదినములకె గోలకొండకుఁ జేరి, వెంటనే, ఆటంకములేని యనుజ్ఞఁ దొలుతనే పొందుటఁ బాదుషామందిరమును బ్రవేశించి, పాదుషాకు బస్తాలతో నుండిన నిమ్మకాయల యొఱవును మించిన యాణి ముత్తెములను నెదుటఁ దిమ్మరించెను. వానిఁ జూచి, పరిభువాశ్చర్యానందములతో నోటఁ బలుకు తెలియక కొంతవడి రిచ్చపడి "యెట్టిముత్తెములం దెచ్చితి"

వనఁ, ఫకీరు, "నీకది యవసరము లేదు; రేపే నీకూఁతును నాకుఁ బెండ్లి సేతువా లేదా?" యని నిర్బంధింపఁగాఁ బాదుషా మాటఁ దప్పిన, మహాత్ముఁ డగుపిభక్తున కపకారము చేసిన దోషముచేఁ దనసామ్రాజ్యమునకుఁ దనకు నేమిముప్పు కలుగునో యని భయభక్తులతో మఱునాఁడే పెండ్లిచేయుదు నని, యల్లె వివాహమునకుఁ దగుప్రయత్నములఁ జేయించి, తగువారి కాహ్వానములఁ బంపెను. దిశదిశల కీవార్త తెలిసి పాదుషా పకీరుతో సంబంధము చేయుట యత్యాశ్చర్యకర మనిరి. ఇది కల్ల యనిరి. పాదుషాకు మతి పోయిన దనిరి. మఱికొందఱు పకీరు మహిమచేఁ బాదుషాను మించినవాఁడె యనిరి.

ఎట్లయిన నేమి? లగ్నం బెల్లి, వివాహముం గదిసె. పకీరు తనమహిమచే నెట్టియలంకారమును ధరించునో చూతుము గాక! యని మహాజనులు కల్యాణమంటపముచుట్టు మూఁగిరి. పకీరు పాదుషాను కల్యాణమంటపముకడకుఁ దాఁ దెచ్చిన మోలియగు ముత్యములం జేర్పు మని కోరెను. చూపఱులకుఁ గన్నులు మిఱుమిట్లు కొలుపులాగున ముత్యము లాకల్యాణమంటపమునఁ బోగు పోయఁబడెను. మీ రలంకరించుకొని రావలయు నని పాదుషా పకీరును గోరెను. పకీరు తన కేర్పఱుపఁబడిన గదిం జేరి కల్యాణమూర్తి యగు భగవంతుని బ్రార్థించి ప్రార్థించి, పక రెంతగ నలంకరించుకొనునో చూడ వేడుకపడుచుండిన కల్యాణమంటపములోనివారి కాశ్చర్యము గలుగునట్లు

గోచిని ధరించి, మఱియొక కౌపీనమును పైని వేసికొని, కందిరిని, కొబ్బరిచిప్పను చేఁబట్టి, పెండ్లియఱుఁగు పైకి వేంచేసెను పాదుషా తనయల్లు డిట్టివాఁడే యని మొగమును చిన్నచేసికొనెను. అపుడు పకీరు ప్రజలను ప్రభువును నుద్దేశించి యిట్లుపన్యసించెను:—

"మిత్రులారా! నాకుఁ బెండ్లితో నిమిత్తము లేదు. ఎంతటియల్పుఁడుగా నుండినను భగవంతుని నమ్మి సేవించుచు, నహింసా సత్యముల నవలంబించి పరోపకారబుద్ధిఁ గలిగి పట్టుదలతోఁ బనిజేసిన నెంతమహత్తరకార్యమునైన సాధింపవచ్చు నను శాస్త్రములలోనివాక్యములను సోదాహరణముగాఁ జూపుటకే నే నీపనిని జేసితిని. పాదుషాకూఁతు రగునుత్తమవనితను దగినసమర్థుఁడగువాని కిచ్చి పెండ్లి సేయవేఁడెదను. నేఁ దెచ్చిన ముత్యముల నమ్మి యాద్రవ్యమును "బధిర పంగ్వంధ భిక్షుక జటి పరివ్రాజ కాద్యనాథులకును, సత్యజ్ఞానోపదేశములకును బాహ్యా యుపయోగింపఁగోరెదను" అని భగవన్నామసంకీర్తనముఁ జేసికొనుచు నెటకో పకీరు వెడలిపోయెను. పాదుషా పకీరుయొక్క యుపదేశముల ననుసరించి సదనుష్ఠానతత్పరుఁడై పకీరుచెప్పినట్లుచేసి వన్నెకెక్కెను. ఇట్టి పకీరులే సర్వజనవంద్యులు, మహాయోగులు నగుదురుగదా!

ఆంధ్ర గాయకుఁడు

(త్యాగరాజయోగి)

ఆంధ్రులు వైదికకాలమునుండి నేఁటివఱకును గానకళా ప్రవీణులు, తత్కళాప్రియులునై యున్నారు ఆసంగీతమును దమ మతకర్మములయందుఁ వినియోగించుటయే యిందులకు నిదర్శనము అందుఁ బెక్కండ్రు మహామహులు దేశాభిమానము జొప్పించు గీతికలచేఁ దమప్రౌఢిమను వెల్లడించియున్నారు * ఇందులకు మనయాంధ్రజాతి లోని బ్రహ్మక్షత్రియవైశ్య శూద్రసంఘములలో నూటికెనుబదిమందికి శుభాశుభకర్మముల విధులను నిర్ణయించి యాంధ్రజాతి మహర్షి యనిపించుకొనిన ఆపస్తంబముని యొక్క వాక్యములే నిదర్శనములు. (ఆపస్తంబుఁడు సాల్వదేశమును యమునానదిని యౌగంధరి మహారాజును దలపెట్టిన కారణము వేఱొకస్థలమునఁ జర్చింపఁబడెను.)

* ఆపస్తంబమహర్షి "సీమంతోన్నయనకర్మము" నందు క్రింది విధి ననుసరించి సంగీతక "ఋక్కు" నిద్దఱు వైణికులు గానము చేయవలెనని చెప్పియున్నాఁడు ఆఋక్కు లివి

సూత్ర॥ "ఉత్తరాభ్యాం చ గాయత మితి వీణా గాథినౌ సంశాస్త్యుత్తరయోః పూర్వాసాల్వానాం బ్రాహ్మణా నామితరానదీనిర్దేశశ్చ యస్యాం వసంతి"॥

మఱియు నాంధ్రులు తమసంగీతసామగ్రియందుఁగల ప్రీతిని గానసమయములఁ జూపఁబడు వివిధ రసభావములను చిత్రకళలోఁగూడ నిమిడ్చి చూపియున్నారు.*

తా॥ ఉత్తరఋక్కులచేతను గానము చేయుఁడు అని ఋశ్యాక్కు వీణావాదకుల నిద్దఱి నాజ్ఞాపింపఁగాఁ బూర్వమునందుండిన ఋక్కును సాల్వదేశీయులును, తక్కిన ఋక్కును బ్రాహ్మణులును గానము చేయవలెను. ఏనదీతీరమునందు వారు నివసింతురో ఆనది నామ మామంత్రమునం గూర్చి పాడవలెను.

[మంత్ర॥ యౌగంధరి రేవ నో రాజేతి సాల్వీ రవాదిషుః
వివృత్తచక్రా ఆసీనా స్తీరేణ యమునే తవ॥ ౧॥
సోమ ఏవ నో రాజే త్యాహు ర్బ్రాహ్మణీః ప్రజాః
వివృత్తచక్రా ఆసీనా స్తీరేణాసౌ తవ॥ ౨॥

తా॥ ఓయమునానదీ! సాల్వదేశీయులు నీతీరమునం దాసీను లగుచు, చక్రాకారముగఁ దిరుగుచు 'యౌగంధరియే మారాజని గానము చేయుచున్నారు.

సోముఁడే మారాజని నీతీరముననే బ్రాహ్మణప్రజలు తిరుగుచుండిన వారై కూర్చుండినవారై గానముఁ జేయుచున్నారు

* ఆంధ్రుల శిల్పకళాచమత్కృతి 'ఎల్లోరా, అజంతా, గుహలలోను, 'అమరావతి, నాగార్జునకొండ' మొదలగుచోటులఁగల స్థూపములలోను వెల్లడియగుచున్నది పైస్థలములలోఁ దామత్యంతము ప్రేమించు వివిధములగు 'వీణావేణు మృదంగాదులచిత్రములయొక్కయు గాయకులయొక్క భావరూపములు నత్యద్భుతముగఁ జిత్రింపఁబడుటయె యిందులకుఁ ములు.

ఆంధ్రుల సంగీతప్రౌఢిమ ప్రాచీనకాలమున యమునానదీ ప్రాంతదేశాదులనుండి తుదకు కావేరీనదీపరిసరమువఱకుఁ బ్రాకిన ట్లాపస్తంబమహర్షియొక్కయు నిపుడు వ్రాయఁబడు త్యాగరాజయోగియొక్కయుఁ జరిత్రములే నిదర్శనములు.

త్యాగరాజు క్రైస్తవశకము పదునెనిమిది పందొమ్మిది. యొక్క (క్రీ. శ. 1789—1847 సం॥రముల) నడిమికాలమున జన్మించెనఁట*అతఁడు పవిత్రమైన కావేరీనదీతీరమునందలి 'తిరువాలూరు' గ్రామమున, కాకర్లవంశమున, 'శాంతాదేవి, రామబ్రహ్మ' ములను పుణ్యదంపతుల కుద్భవించియున్నాఁడు. వారిది 'ములికినాటిశాఖ.' ఈతనియగ్రజుఁడు పంచనదబ్రహ్మము. త్యాగరాజుయొక్క చిన్నతనముననే యాతనితండ్రి తన పుత్రులకు విద్యను గఱపించు నిమిత్తము సంగీతసాహిత్యవిద్యలకుఁ బుట్టినిల్లగు 'తిరువైయూరు' గ్రామమునందు 'యాయావరపు' వృత్తితోఁ గుటుంబపోషణ మొనర్చుకొనుచు నివసించెను.

త్యాగరాజును రామబ్రహ్మము తొలుత సాహిత్యవిద్యాభ్యాసముకొఱకు కావ్యనాటకాలంకారములఁ జదువ నాపురిని గల సంస్కృతపాఠశాలలోఁ బ్రవేశమును గలిగించెను. కాని యాతనికిఁ గల సంగీతవిద్యాసక్తి యందులకు విఘ్నము

---

* మైసూరు మహారాజావారియొక్క జగన్మోహనబంగళాలోను, బిడారం కృష్ణప్పగారియొక్క రామమందిరమందును గల త్యాగరాజు పటములక్రింద నీయంశము వ్రాయఁబడెను.

నాపాదించెను. త్యాగరాజు తాను బోవు సంస్కృతపాఠశాలకు సమీపమందుండిన సంగీతపాఠశాలలోఁ జెప్పు గీతరాగాదులపై దృష్టినుంచి వానినే "ఏకలవ్యు"ని విధమున నభ్యసించుచుండెను.

ఈయంశమును దండ్రి కనిపెట్టి యీబాలునిసంగీతప్రియత్వమును మాన్ప నెంతయు నిర్బంధించుచుండ నాతనితల్లియగు శాంతాదేవి తండ్రిని నివారించుచుండెడిది. కారణ మేమన, నాతని జనని సంగీతవిద్యాప్రియ యగుటచే "పురందరదాసు"యొక్క కృతుల నామె బాగుగాగానము చేయుచుఁ జన్నబిడ్డఁడగు త్యాగరాజునకు నేర్పుటయే. అందువలన దంపతులకు వివాదమును గలిగెడిది. తనకు మారుఁడు సాహిత్యవిద్యావంతుఁడు కావలె నని తండ్రియు, సంగీతవిద్యావంతుఁడు కావలె నని తల్లియుఁ బట్టుపట్టుచుండెరి. కాని మనహిందువులలోఁ దండ్రియొక్క మాటయే తొలుత చెల్లుఁగదా! అందువలనఁ దండ్రియగు రామబ్రహ్మముమాట మొదట చెల్లినను త్యాగరాజుయొక్క ప్రవృత్తి యంతయును సంగీతవిద్యయందే యుండుటచే శాంతాదేవియొక్కమాటయే తుదకు నెగ్గెను. అందువలన త్యాగరాజును జనకుఁడు సంగీతపాఠశాలయందే పండితుఁడగు శొంఠి వేంకటరమణయ్య యను వైణికునకు శిష్యునిగా నొనర్చెను. అం దాతఁడు దినదినాభివృద్ధితో సంగీతకళ నభ్యసించుచుఁ దత్పూర్వము సంస్కృతపాఠశాలలోఁ జదివిన రామాయణము నందలి కథలతోఁ దనసంగీతకళను జేర్చుచు "గీతికలను" రచిం

చుచుండెను. కొన్నినాళ్ళ కాతఁడు సంగీతవిద్యలోఁ బ్రౌఢుఁడై పాఠశాలలను విడిచెను.

క్రమముగా నాతనిగానకళ యేకోత్తరాభివృద్ధి నొందుటయేగాక, రామకథాప్రియత్వముచే నంతయు రామమయముగ మార్పఁబొడంగెను. ఆతని కేమూలఁ జూచినను రాముఁడే కాన్పించెను. భక్తియం దీతనిఁ బోలువచ్చు నాంధ్రులు (1) భద్రాద్రిరామదాసు (2) సిద్ధయోగీశ్వరుఁడు* (కర్నూలు)

త్యాగరాజు వృత్తిగూడ నాదబ్రహ్మము నుపదేశించి యానందించుటయే. అందులకు వృథాగా కాలమును వ్యయపఱచక నియమితసమయములలోనే దానిని వెచ్చించుచుండెను. తొలుత నాతనిరీతి నెఱుంగక కొందఱు హేళన మొనర్చుచుఁ దుద కాతనిని గౌరవించి యాతఁడు చేయు సభక్తిప్రేమగానములోఁ బాల్గొనిరి

త్యాగరాజు స్వరూపమున స్థూలకాయుఁడు గాక పలుచని పొడవైనశరీరము కలవాఁడు. వృత్తియందుఁగూడ మనస్తృప్తిని గలిగించెడి భిక్షావృత్తి. అభిమానధనుఁడైనను, కుటుంబ

* ఈతఁడు పదునెనిమిదవశతాబ్దమున గర్నూలువందలి "నందికోటుకూరు" గ్రామమున నుండువాఁడు. ఈతఁడు "భాజత్ ఖాను" అను కర్నూలునవాబుయొక్క సరదారు పేరఁ గృతినిచ్చి మూఁడాశ్వాసముల ద్విపదలో "సిద్ధయోగీశ్వరవిలాసము" అను గ్రంథమును రచించెను. శివభజనముచే 'సర్వం శివమయం జగత్' అనిపించిన శివభక్తుఁడు.

పోషణమునకుఁ దగునటుల వారమున కొకసారియే యగు చుండెను. మొదట నీతనివృత్తిఁ బరీక్షింప నెందఱో యత్నించిరి, కాని యాతని సత్ప్రవర్తనమును జూడఁ జూడ నాతఁడు శుద్ధశ్రోత్రియుఁడై యుండినట్లు కాన్పింప నందఱు నుమిక్కిలి గౌరవించుచుండిరి.

మఱియు గాథలను బట్టి చూడఁగా బాల్యమందే వీరి కొకమహానుభావుఁడు రామతారకమంత్రము నుపదేశించినట్లును, మఱొకప్పుడు నారదమునీంద్రుఁడే యతివేషమున వీరికిఁ బ్రత్యక్షమై 'స్వరార్ణవ' మను సంగీతగ్రంథ మిచ్చినట్లును దెలియుచున్నది స్వరార్ణవమునుండియే యనేకసంగీతవిద్యావిషయములు త్యాగయ్యగారు తెలిసికొన్నారఁట. ఆగ్రంథరాజ మిప్పుడు మృగ్యము.

సంగీతవిద్య పూర్తియైనపిమ్మట వీరి తల్లిదండ్రులు స్వర్గస్థులైరి. వీరి కొకచిన్నయిల్లును, శ్రీరాముని బంగారుప్రతిమయు మాత్రమే వీరికి పైతృకధనములు. చిన్నతనమునుండియు నకారణముగ విరోధించుచుండిన వీరియన్నయగు పంచనదబ్రహ్మము త్యాగయ్యమీఁద లేనిపోనినేరములను మోపుచు వీరి మనసును జీకాకు పరచుచుండెను. ఒకనాఁ డీర్ష్యాళుఁడై త్యాగయ్య పరమపవిత్రముగా నెంచుకొని భక్తితోఁ బూజించుకొనుచున్న శ్రీరామప్రతిమను కావేర్యమునందో నదిలోఁ బాఱవైచెను. అప్పు డాభక్తునకుఁ గలిగిన దుఃఖ మింతింత

యని చెప్ప నలవికాదు. శ్రీరామప్రతిమ దొరకువఱకు నన్న
పానీయముల ముట్టనని ప్రతినబట్టి, యాతఁడా దుఃఖములో నుం
డియే యనేకకీర్తనము లను రచించిరి. తుదకు శ్రీరాముఁడు
స్వప్నమున సాక్షాత్కరించి తామున్న చోటును దెలిపి యదృ
శ్యుఁడయ్యెనఁట. వెంటనే యాస్థలమునకుఁ బోయి విగ్రహ
మును దీసికొని యూరేగుచు నుప్పొంగిన యుత్సాహముతో
త్యాగరాజయోగి "కనుగొంటినే శ్రీరాముని నేఁడు" మొదలగు
కృతులఁ బాడుచు నింటికి వచ్చెనఁట. వీరి భక్తివంటి నిశ్చల
భక్తి యెందఱకు లభించును ?

త్యాగయ్యగారు తమ యద్భుత గానామృతరసము నూరి వారల కిచ్చి, వారివలనఁ బ్రతిఫలమును బడయుచుండిరేగాని కేవలము పొట్టపోసికొనెడి భిక్షుకవృత్తి వలన జీవింపలేదు. వారమున కొక్కమారు, చేతఁ దంబురా ధరించి తాము రచించినకీర్తనములను భక్త్యావేశమునఁ గంఠమెత్తి వీధులయందుఁ బాడుచుఁ బోవుచుండఁ బౌరులు పులకాంకితులై యాభక్తునకుఁ దమ శక్త్యనుసారము భిక్షాద్రవ్యము నొసఁగుచుండిరి

నిర్ధనుఁడై యుండియు మహారాజాశ్రయమును సైతము,దృణప్రాయముగఁ నీతఁడు చూచెను. ఒకప్పుడు తిరువాంకూరు మహారాజుగారు వీని ప్రసిద్ధిని విని తమయాస్థానమునకుఁ గొనిరా నొకసంగీతవిద్వాంసుని వీనికడకు బంపెను కాని త్యాగరాజయాహ్వానముఁ దిరస్కరింప, తిరువాన్కూరు విద్వాంసుఁడు

ఇంతలో దొంగలు దగ్గఱకు రాఁగా నామాటను త్యా గయ్యగారు వారిముందు విసరివైచి "ఇదిగో! వేయి రూప్య ములు. తీసికొనుఁడు" అని యానతిచ్చిరి. అప్పుడు దొంగల నాయకుఁడు వణకుచు నిట్లనెను.

దొం:—అయ్యా! ఆధన మంతయుఁ దమదే. అదియును గాక మేమందఱమును మీ సేవకులమే! మమ్మేలుల ననుగ్రహింపుఁడు.

త్యా:—అట్లైనచో మామీఁద ఱాళ్లేల విసరితిరి?

దొం:—స్వామీ! మేము దొంగలమే. మేము చిన్ననాఁటి నుండియు నీదుర్వృత్తినే యవలంబించి జీవించుచుంటిమి. మీ యొద్దనున్న ద్రవ్యము నపహరించుటకే మీమీఁద ముందు ఱాళ్ళను రువ్వితిమి. అందు నేనొక పెద్దఱాతిని దీసి మీమీఁద విసరితిని కాని, యది తిరిగి వచ్చి నాతలకే తగిలి తలను గాయ పఱచెను. దానికి నే నత్యాశ్చర్యముఁ నేమికారణమో యని చూడ నిద్దఱుయోధులు ధనుర్ధరులై మామీఁద బాణప్రయో గము గావింపుచుండిరి. వారెవరో తెలిసికొనగా, మీశిష్యుల మనియు రామలక్ష్మణుల మనియుఁ జెప్పి వా రదృశ్యులైరి. అట్టి వీరాధివీరులగు దైవతములకే మీరు గురువులని విని సిగ్గు పడితిమి. మహానుభావా! ఇంతటినుండి మేము చోరవృత్తిని విసర్జించుచున్నాము. క్షమింపుఁ డనిరి.

త్యా:—నిజముగా నీవు ధన్యుఁడవు. నాకుఁగూడ లభ్యము కాని శ్రీరామలక్ష్మణుల దర్శనభాగ్యము నీకు లభించినదనెను.

నాఁటినుండియు నాతస్కరు లానంద పరవశులై త్యాగ రాజుగారికి శిష్యులై భక్తులై సేవకులైరి.

ఆదినములలోనే త్యాగరాజుగారు కొన్ని క్షేత్రములను దర్శించు కుతూహలముచేఁ బ్రయాణము సాగించుచుండిరి. ఒక్కెడ నుదయముననే రోదనధ్వని త్యాగయ్యగారికి వినఁబడఁగా వెంటనే పల్లకి నిలిపి యాదుఃఖమునకుఁ గారణ మారసి రమ్మని యచ్చోటునకు దొంగలనాయకుని బంపిరి.

అతఁ డారసి వచ్చి, యొకబ్రాహ్మణుఁ డకాలమరణము నొందుటచే నాతనిభార్య రోదనము చేయుచున్నదని తెలిపెను. త్యాగయ్యగారు వెంటనే యాప్రదేశమున కేఁగి "శ్రీరామ పాదమా— నీకృపజాలునే—జారయహల్యను బ్రోచితివి— ఆరీతి ధన్యునేయవే" అనిపాడుచుఁ దమయమృతహస్తమున నామృత శరీర మంతయుఁ దడవ నావిప్రుఁడు లేచి కూర్చుండెనఁట! లోకమున నిట్టికథలనేకములు ప్రచారమునం దున్నవి. భక్తుల జీవితము లిట్టిమానవాతీతమగుశక్తులతో నిండియుండునుగదా!

త్యాగయ్యగా రనేకభక్తి, జ్ఞానప్రబోధకములును, సమయానుకూలములును నగుకీర్తనలను రచించుటయేగాక "భక్త విజయ" (ప్రహ్లాదచరిత్ర)మను యక్షగానమును, 'నౌకాచరిత్ర మను (శ్రీకృష్ణపరమాత్మ గోపికాంగనలతోఁ గూడి యమునా

నదిలో విహరించుట) శృంగారప్రబంధమును రచించి యాంధ్ర కవితాప్రపంచమునం బ్రదీపించుస్థానమునుగూడ నాక్రమించినారు. తేనె లొలుకు చిన్న చిన్న భావగాంభీర్యయుక్తములగు తెలుగు నుడులతో నన్వయకాఠిన్య మిసుమంతైన లేకుండు కీర్తనలను రచించుటయందు వీరికి వీరె సాటి. వీరికవితామాధుర్యమునకు ముగ్ధులై దక్షిణభారతమునందలి గాయకగాయనీమణు లెల్లరును వీరికీర్తనలం బాడుచుందురు.

త్యాగరాజయోగికి తుదిదశలో భార్యావియోగము కలిగినది. అప్పుడు మోక్షార్థియై సన్యాసాశ్రమమును స్వీకరించి ముక్తుం డయ్యెను. త్యాగరాజుజీవిత మంతయు నఱిగితఱిగి నశించిపోవువఱకును దిగంతములు మారుమ్రోగునట్లు తొంబది యాఱుకోట్ల శ్రీరామనామస్మరణ మొనర్చి తమభౌతికశరీరమును వీడి భగవత్సాన్నిధ్యమునకుం జేరుకొనెనంట*

సంగీతకళాకోవిదుండు, సరసకవితాసామ్రాజ్యపట్టభద్రుండు మహాభక్తుండు నైన యీ యాంధ్రసత్తముండు సమాధిం బొందిన ప్రదేశమున దివ్యమగు మందిరమును గట్టించి ప్రతివత్సరము వారి యారాధన మతివైభవముగా జరుగుట కేర్పాటొనర్చిన విద్యాసుందరి బెంగళూరి నాగరత్నమ్మయొక్క యౌదార్య మత్యంతము పొగడందగియున్నది. నేటికిని యోగి సమాధి కావింపంబడినప్రదేశవిభవ మేకోత్తరముగ వృద్ధిం బొం

*పరాభవ సం॥ర పుష్య బహుళపంచమినాడు యోగి సిద్ధి నొందెనట!

దుచు నారాధనాకాలమున దక్షిణదేశప్రముఖులగు గాయ కోత్తముల నాకర్షించుచున్నది.

మహాభక్తుఁ డగుటవలననే యీతఁడు త్యాగరాజయోగి యనఁబడెను.

---

*ప్రాచీనాంధ్రవర్తకుఁడు

ఆంధ్రావని 'వసుంధర, రత్నగర్భ' యను సార్థకనామ ములు కలదగుటచే సువర్ణాదిలోహములకును, వజ్రనీలపుష్య రాగాది బహువిధరత్నసమూహములకును, గోదావర్యాదిజీవ స్రవంతులు కలదగుటచే సమస్తఫల ధాన్యాదులకును, సువిశా లారణ్య యగుటచే వివిధవన్యపదార్థములకును, శిల్పకళానిపు ణులు కల దగుటచేఁ జిత్రవస్తువులకును, వేదవేదాంగాది సమస్త విద్యావేత్తలు కల దగుటచే సదుపదేశములకును, నతిప్రాచీన కాలమునుండియుఁ బ్రసిద్ధి నొందియున్నది. అందువలననే ప్రాచీన కాలమున నీదేశమునకు విదేశపువర్తకులు స్థలజలమార్గములచే వచ్చి రత్నకుప్యా కుప్యాదులచేతను చీనిచీనాంబరాదిచిత్రవస్తు

* ఈకథ 'పాలవేకరి కదిరీపతి' కవికృత శుకసప్తతి యనుగ్రంథము లోని మొదటికథ నాధారపఱచుకొని వ్రాయఁబడెను.

వులచేతను, బదార్థవినిమయములఁ జేసికొనుచు వర్తక మొనర్చు చుండిరి. విద్యాభిలాషు లీదేశమునకు వచ్చి గురుశుశ్రూషాది కముచే విద్యాసంపాదన మొనర్చుకొనుచుండిరి. సద్విద్యోపదేశ మునకై మఱికొన్ని విద్యాపరిషత్తులవారు, ప్రభువులు, నీయాం ధ్రావనిలోని 'దిజ్నాగాచార్య, కుమారిలభట్టాచార్యాది' మహా పండితులను దమదేశములకు రప్పించి సన్మానించి వారినుండి విద్యాజ్ఞానలాభముల నొందుచుండిరి. అట్లీయాంధ్రావనీ పుత్రు లును, భరతఖండస్థాన్యప్రదేశములకును, 'యవన, పారశీక, చీనా, యవద్వీపా'దులకును నేఁగి బహువిధరత్నలోహచిత్ర విచిత్రవస్తుతతిని, కాశీ, నవద్వీపా'దులకుఁ బోయి తర్కవ్యాక రణాది బహువిధశాస్త్రములను శిల్పవిద్యలను సంపాదించి స్వస్థలములఁ బ్రవేశించి వానిలాభములను దేశమున కొసఁగు చుండిరి.

ఇట్లు బహుయుగములు జరుగ నైరోపాఖండమునందలి 'బుడతకీచు' లనఁబడు పోర్చుగలుదేశీయులును, 'ఒలాందు' లనఁబడు హాలండు దేశీయులును, 'ఇంగిలీసు' లనఁబడు నాంగ్లే యులును నీయాంధ్రావనికి సముద్రమార్గమున వర్తకమునకై రాఁజొచ్చిరి. అందు ముందు 'బుడతకీచులు' స్వదేశమునుండి 'లోహమయ రోమమయ మృణ్మయ'ములతోఁగూడిన వస్తు వులనేగాక, 'మడగాస్కరు, జాంజిబరు, సుమెత్రా'ద్వీపాదుల నుండి లవంగాదిభోగ్యవస్తువులను దెచ్చి నీయాంధ్రభూమిలోఁ

బరిశుభ్రవస్త్రాదికముచే వినిమయములఁ జేసికొనుచు స్వదేశమునకు నావి గొనిపోయి యచట విక్రయించి విశేషలాభము నొందుచుండిరి పిమ్మట 'హాలాండు'దేశీయులు నీపద్ధతినే యవలంబించి యాంధ్రుల నున్నతులకుఁ బాత్రు లగుచుండిరి. ఇంగిలీసు దేశీయులు తమప్రభ్వియగు 'ఎలిజబెత్తు' మహారాణిచే నీదేశమున వర్తకము చేయునాజ్ఞనొంది ప్రాక్సముద్రతీరమున నెచట వర్తకముఁ జేసిన లాభించునో యని పర్యటనములఁ జేయుచుఁ బరిశోధింపుచుండిరి.

నాఁటికాలమునఁ దాంధ్రదేశములో నుత్తరభాగము గోలకొండనవాబుల చేతను దక్షిణభాగము కర్ణాటకావనిపుల చేతను పాలింపఁబడుచుండెను. కర్ణాటకప్రభువులలోఁ గృష్ణదేవ రాయలకుఁ బిమ్మట విశేషవిద్యాపోషణాదికముచే విఖ్యాతిఁ గనిన 'వీరవేంకటపతిరాయలు' తాలికోట యుద్ధానంతరము ఆంధ్రుఁ డగు తిరుమలదేవరాయలు విజయనగరమునుండి యైదు వందల యేనుఁగులచే మోయించుకొని పెనుగొండకుఁ జేర్చిన సువర్ణ వజ్ర వైడూర్యాది మహానర్ఘధనమును తిరుమలదేవ రాయల యనంతరము కైవసముఁ జేసికొని 'అప్పయదీక్షిత, తాతాచార్య, అప్పలాచార్య, వేంకటాచార్య, తేనాలిరామకృష్ణ, తరిగొప్పులమల్లన, చెన్నమరాజు, మొదలగు సంస్కృతాంధ్రమహాకవుల నాదరించుచు నా మహాకవులచే 'కువలయానందా'ది శతాధిక సంస్కృతమహాగ్రంథములను 'పాండురంగ

విజయ, చంద్రభానుచరిత్ర, చారుచంద్రోదయాది, ప్రసిద్ధాంధ్ర ప్రబంధములను రచియింపఁజేసి సకలకలాపోషకుఁడై ప్రజాభివృద్ధికరకార్యము లొనర్చుచు నవక్రపరాక్రమముతోఁ జంద్రగిరిపట్టణమును రాజధానిగా దక్షిణాంధ్రరాజ్యము నేలుచుండెను. *

ఆతనిపాలనమునం దాచంద్రగిరియందు, కోటికిఁ బడగ లెత్తిన పెక్కండ్రు వర్తకు లుండిరి. అందు 'గౌరకోమటి'యగు 'వసుమంతుఁ' డనునాతఁడు సుప్రసిద్ధుఁడు. ఆతఁడు పెక్కుకోట్లకుఁ బడగ లెత్తియుండినందున నారాజ్యమునందలి ప్రసిద్ధ పట్టణములలోను, గ్రామములలోను నాతనియంగడులే యమర్చియుంచెను. సాధారణవర్తకులకుఁ బెట్టుబడులు పెట్టియు, న్యాయమగు వడ్డికి ధన మిచ్చియు, గుత్తగ ధాన్యాదులఁ గొనియు, గనులఁ ద్రవ్వించి లోహములఁ జేకూర్చి విక్రయించియు, రత్నవ్యవహారముఁ జేసియు, ద్వీపాంతరములనుండియు దేశాంతరములనుండియు వచ్చిన వర్తకు లీతఁడు సత్యసంధుఁ డని నమ్మియుంచినవస్తుతతిని న్యాయముగ విక్రయించి వారివలన విక్రయపుసుంకము (కమీషను) నొందియు, స్వదేశము నంటివ సముద్రపురేవులలోఁ దిరుగునట్టివియు ద్వీపాంతరముల కేఁగునట్టివియు

* తిరుమలదేవరాయలపుత్రుఁడగు శ్రీ వేంకటపతిరాయలు, క్రీ.శ. 1585 సం॥రము మొదలు క్రీ.శ. 1614 సం॥రమువఱకు రాజ్యముచేసెను

నగు వివిధములగు నావలచే వర్తక మొనర్చియు, విశేషలాభ మొందుచుండెను.

ఆతని కొలువుకూటమునం దెప్పుడును బేరములం దెలిసికొనుటకును, రత్నపరీక్షకులకుం దమవస్తువుల విక్రయింపనుంచుటకు, బహువిధవస్తువులం గొనుటకు, నితరవర్తకపు వ్యవహారములకు నానాదేశములనుండియు వచ్చువారు, బలుభాషలు మాటలాడువారు పలువేషములు గలవారు నగు వణిజులు, ద్విభాషుల (దుబాసిల)వలనం దమకార్యముల నెఱింగించుచుం, బ్రత్యుత్తరముల నొందుచుం, బోవుచుండిరి.

ఆకాలమునసె యాంధ్రభూమిం జొచ్చిన యింగ్లీసువారీతనికొలువుకూటమునకుం బదేపదే వచ్చి తమ యయోమాయు, రోమమయు, వస్తువు లీదేశమునం దెచట నెచటం బ్రియముగ విక్రయమగును? 'సువర్ణ, వజ్ర, శుభ్రవస్త్ర, తైల, భోజ్యాదు, లెచ్చట నగ్గువగ లభించును? ఎచ్చట వర్తకశాలలు నిర్మింప సౌకర్యము కలుగును? అనెడి యంశములం దెలిసికొన వచ్చి వసుమంతునకుం గానుక లిచ్చి యాతనిచే గౌరవింపం బడుచుండిరి.

వేయునేల? యాతని కొలువుకూటము యక్ష, కిన్నర, విద్యాధరాదులచే నొప్పు కుబేరుని కొలువుకూటముం బోలె ప్రకాశింపుచుండెను.

ఆవసుమంతునకు, 'శృంగారమంజరి' యను సంస్కృతనాటకమును రచించి వేంకటపతిరాయలకుఁ గృతి నిచ్చి యాతని మెప్పు వడసిన మహాకవియు, 'వేదవేదాంగ' వేత్తయు, సంగీత కళావేత్తయు, సంస్కృతమునందే గాక యాంధ్రభాషయందును సరళముగఁ గవిత్వముఁ జెప్పువాఁడును, సుత్తమచరిత్రుఁడును, సుభాషియు, దేశ దైవభక్తులు గలవాఁడును, వైష్ణవోత్తముఁడును నగు వేంకటాచార్యనామధేయుఁడు మంత్రియు గురువు నయ్యె.

వసుమంతుఁడు ప్రతిముఖ్యకార్యమును నీవేంకటాచార్యునితో నాలోచింపకుండఁ జేయఁడు. రాజాస్థానమున నెట్టి దుర్ఘటకార్యములు గలిగినను నీమంత్రివరు నంపిన వాని నతి సులభముగ నెరవేర్చును మఱియుఁ బలుభాషలు, పలుదేశాచారములు తెలిసినవాఁ డగుటచే వసుమంతునికడకుఁ గార్యార్థులుగ వచ్చు పరదేశీయులకుఁ దగుసదుపాయము లొనర్చి కార్యసాధనములఁ జేయించుచుండును. సద్గోష్ఠులలో గానకళానైపుణ్య మొప్ప భగవత్సంకీర్తనములఁ బాడి, సభాసదుల కానందముఁ గొల్పుచుండును. ఇట్లు వసుమంతుని మనస్సు నాకర్షించుటయే గాక, సతీమతల్లికయగు నాతనిభార్యకును సదుపదేశకుఁడై పరమార్థచింతను, బరోపకారనిరతిని గల్గించి పితృతుల్యుఁడుగఁ బ్రవర్తించుచుండెను.

ఇట్లుండ నొకప్పుడు వేంకటపతిరాయమహారాజు వసుమంతు నాహ్వానించి గౌరవించి యిట్లనియె.

శ్రేష్ఠ! మా తాత యగు శ్రీకృష్ణదేవరాయసార్వభౌముని కాలముననే పరఖండవాసులగు 'బుడతకీచులు' పశ్చిమతీరస్థమగు 'గోవా'పట్టణముఁ జేరి వాణిజ్యము నారంభించిరి. పిమ్మట నొలాందు కిరాటులీతూర్పుసముద్రతీరమునకు వచ్చి మావలసనే 'పళియకావేరి'సకోవరతీరమునం దావేరితో నొక నగరమును నిర్మించుకొని వర్తకాభివృద్ధిం జేసి లాభము నొందుచుండిరి ఇపు డింగిలీసులు పురాలు ముఠాలుగా వచ్చుచు నెచట వర్తకశాలలను వేసికొనిన లాభించునో యని పరీక్షించుచుండుట నీకుఁ దెలియునుగదా! గతమాసముననే 'కరాచి, బరోచి, సూరతు'రేవులలో 'డేనులు, జర్మానీయులు. నార్వే దేశీయులు' మొదలగు పశ్చిమఖండవాసులు తమనావలతో దిగి యార్యావర్తమున వర్తకసౌకర్యములకై పరిశీలించుచున్నట్లును, ఢిల్లీశ్వరునకుఁ గానుక లర్పించినట్లును వార్తావహుల వలనఁ దెలిసినది. కాన ఖండాంతరులవలె మనదేశీయులుగూడఁ బాశ్చాత్యదేశముల కేఁగి యచటి చిత్రవిచిత్రవస్తువులఁ గొని యిచట విక్రయించియు నిచటి కల్పితవస్తువుల నచట నమ్మియు నేల లాభము నొందరాదు? „వాణిజ్యే వసతి లక్ష్మీః” అను నానుడి నేల సార్థకపరుపరాదు? అని ప్రస్తావించెను.

అంత వసుమంతుఁడు „మహారాజవర్యా! తమరు సెలవిచ్చినది యథార్థము, పాశ్చాత్యదేశప్రభువులు తమదేశపు వణిజులకుఁ బరదేశముల కేఁగి వాణిజ్య మొనరింప ననుజ్ఞ

నిచ్చుటయేగాక, మన దేశప్రభువులకును వర్తకసౌకర్యములఁ జేయుంపుఁడని యుత్తరములను వ్రాసియు, కానుక లంపియుఁ, దమవర్తకుల కెంతయు ప్రోత్సాహముఁ గల్గించుచున్నారు గతవత్సరమునం దింగిలీసుదేశపురాణి 'ఎలిజబెత్తు' తమ కంపిన యుత్తరము జిత్తగించితిరిగదా! అట్లె ప్రభువువారును మన యాంధ్రవర్తకులకుఁ బ్రోత్సాహ మిడి యింతవఱకు మన దేశముతో సంబంధములేని పరదేశముల కంపినయెడల మన దేశీయు లత్యంతలాభము నొందఁగలరు 'సముద్రశుల్కము' చేతఁ బ్రభుత్వమునకును నదికాదాయము రాఁగలదు; ప్రభువు వారిచిత్తమునం దిట్టిసంకల్పము కలుగుట దేశసౌభాగ్యహేతు వని తలంచుచున్నాను తమతలఁపు లమోఘము లగుఁగాక!" యనెను.

అంతఁ బ్రభువు ప్రధానమంత్రియగు పెరిగొప్పుల దత్తనామాత్యునితోఁ గొంత మంత్రాలోచన మొనర్చి, వసుమంతునిం గని "వణిక్పుంగవా! నీయూహలు ప్రశస్తతరములు. నీవు చెప్పినట్లే యింతకుఁబూర్వము మనదేశముతో సంబంధము లేనట్టియు, ఒలాందులచేతను, బుడతకీచులచేతను సదా ప్రశంసింపఁబడుచుండునట్టి 'పరాసుదేశపుచక్రవర్తి' యగు నాల్గవ 'హెన్రీ'గారి కుత్తర మిచ్చుచున్నాను. ఆదేశవాసులచే నమూల్యములుగా నాదరముతోఁ జూడఁబడు "కొన్ని తైలములను, కాళహస్తి కాంస్యపాత్రములను, కంచి వస్త్రములను, తిరుపతి

రక్తచందనవస్తువులను, పరిమళద్రవ్యములను, చిత్రితవస్త్రములను పరాసుచక్రవర్తికిఁ గానుకలుగా నంపుచున్నాను. కాని యీదేశమున కేఁగి గౌరవప్రదముగఁ గార్యము లొనరించు వాఁడొకఁడు కావలెను. నాయూహలో నీకంటె నధికుఁడగు కార్యసాధకుని కాన్పింపఁడు; నీకుఁ దగుసౌకర్యముల నొసఁగించెదను. మార్గమధ్యమునందలి యాయాదేశప్రభువులకు నీకు సౌకర్యము లొనరింప నుత్తరము లొసఁగెదను. కాన నీవీకార్యభారము వహింపవలె నని బుజ్జగింపుమాటలతోఁ బ్రోత్సాహింప, నావసుమంతుఁడు సంతసించి తత్కాలావేశముచే నంగీకరించెను.

అంత నతఁడు పరాసుదేశమునుండియు మార్గమధ్యస్థదేశములనుండియుఁ జిత్రవిచిత్రవస్తువులఁ దెచ్చుటకును, మార్గవ్యయమునకును వసుమంతుఁ డారదేశపు జాతిపరివార సంఘంబు పోషణాదులకును, కోటిదీనారములు లొక్కసారి వసుమంతున కిచ్చి యాతనిముఖంబున శ్లాఘనము గలిగించెను. పరాసుదేశపు చక్రవర్తియగు నాల్గవహెన్రీగారికిని, మార్గమధ్యస్థదేశప్రభువులకును, వసుమంతు గౌరవింప సమస్తరములు* 'రాయసకాఁడును, వివిధభాషాకోవిదుఁడు నగు మల్లనకవిచే వ్రాయించి యిచ్చెను. పై సన్నాహాదులచే నుప్పొంగుచు రాజుకడ ననుజ్ఞ నొందెను. దత్తామాత్యుడును నాకాలమున నాలవహెన్రీచక్రవర్తికి

* తరిగొప్పుల మల్లనకవి వేంకటపతిరాయలకడ 'రాయసకాఁడు' (లేఖకుఁడు) నని చంద్రభానుచరిత్రలో నాకవియే వ్రాసికొనెను.

మంత్రియై పరాసుప్రభుత్వమె యూరోపాఖండమునం దగ్రగణ్యము గాను, కైవసమౌ నింతటఁగాను మందరావళ్లి చేయ యత్నిం చెడు 'పల్లి' యనునాతనికి, 'హాలెండు, పోర్చుగీసు, ఇంగిలీసు' దేశీయులకంటె మిగుల నాంధ్రదేశమున నెక్కుడు వర్తకసదు పాయములఁ జేయుచుమునుగా నిటుకు గండని యాహ్వానింపుచు వ్రాసిన యుత్తరమునుగూడ నందె.* హనుమంతుఁడు స్వగృహ మునకు వచ్చి యింట నడుగిడగానె, 'కారుమొయిలుఁగు రాచిలుక వలెను, కస్తురిపిండిబొమ్మని, పదారువన్నె బంగారముపోలికను, వెన్నెలలోని తేటమాణిక్యమని, కలువలచెలి ననుకరింపుచు నెకు రుగఁ గాన్పించెడి యనేకసామాన్య యను భార్యం గాంచి, ఈయొప్పులకుప్ప నెట్టి సిరిని నగదేశముల కేఁగఁగలను? అని ఘ్రాణోత్సాహము నించి, డెంద మిగిలింపుచు సిగ్గుమానర్పు నిడు చుండ నౌకరు నొక్కదాసి సన్నిధి కేతెంచి "బాబుగారూ! అమ్మ గారిక మాఁడవమాసము వచ్చెనసి కుమునఁ దమకుఁ బుత్త్రికగా పుట్టునసియు స్త్రీలు చెప్పుకొనుచున్నా" రన, హనుమంతుని భా ర్య నేలఁ గాలిబొటనవ్రేలను వ్రాయుచు సిగ్గుచేఁ దలవంచు కొనుసంతలో, నత్యావసరకార్యములకై నల్వురు లేఖకులు త్వరిత

---

* ఈయుత్తరము 'మల్లారావుజ్యోతిష్యుఁడు' రచించిన 'చంద్రభానుచరిత్ర' యందు దత్తాపాత్యుఁ గూర్చి వ్రాయుచు, నాతఁడు 'ద్వీపాంతరప్రభువు లను స్వదేశమున నాహ్వానింపు [illegible], [illegible] లిఖిత మైనది చూ. చంద్రభానుచరిత్ర 1-40

డుచు రాఁగా, దాపియు వసుమంతునిల్లాలును నంతర్గృహమున కేఁగిరి. వసుమంతుఁడు లేఖకులు తెల్పిన యత్యవసరకార్య మగ్నుఁ డగుటచే నవస్థాంతరగతుఁడై విచారమును బ్రయాణాంశమును నాఁటికి మరచెను.

మరునాఁటి వఱువాతనె మహారాజు ఖండాంతరప్రయాణ మెపుడు చేయుదు వనియు, నీ కేదేని ప్రయాణోచితవస్తుసంభార మవసర మైన దానిని రాజపురుషులు సమకూర్చెద రనియు వర్తమానము చేయఁగా వసుమంతునిచింతలు పునరుద్ఘాటితము లయ్యెను. రాజులకడఁ జెప్పినమాట లమోఘములు కావలెను. లేకున్నఁ గొన్ని యుపద్రవములు సంభవించుట లోకానుభవము గదా !

అపుడు సన్నిధినున్న గురువర్యుఁ డగు వేంకటాచార్యునితో వసుమంతుఁడు 'ఆచార్యవర్యా ! నే నొకచిక్కులోఁ దగుల్కొంటిని. దీనికిఁ గర్తవ్యము సెలవీయ వేఁడెదను. అదేదన, నిన్నటిదినమున మహారాజుతో సంభాషించునపుడు ఖండాంతరు లీదేశమునకు వచ్చి వర్తకముఁ జేయుచు విశేషలాభము నొందుచున్నారనియు, మనదేశీయులును, నన్యఖండముల కేఁగి వర్తకము నేల చేయరాదనియుఁ బ్రశంస కలుగ దానిని నే నామోదించితిని. అందులకు మహారాజు నన్నే ఖండాంతరస్థమగు పరాసు దేశమున కేఁగవలయు నని యెంతయో సన్మానించుటయేగాక, నామార్గవ్యయాదులకుఁ గోటిదీనారములను,

ప్రాంసుచక్రవర్తికిని మార్గమధ్యస్థదేశప్రభువులకును, నాకు సదు పాయములఁ జేయుఁడని లేఖలను, పరాసుప్రభువునకుఁ గానుక లనుగూడ నిచ్చియున్నాఁడు. తత్కాలగౌరవమోహితుఁడనై నే నాప్రయాణమునకు సమ్మతించితిని. కాని, గృహమునకు రాఁగా, నె ట్లీకళత్ర బంధు మిత్ర పరివారాదులను ధనధాన్యా దులను వీడి, పరదేశములకుఁ బోఁగల ననువిచారము కలుగు చున్నది. దీనికి మీ రేమియాలోచన చెప్పెదరు?'' అన నాచా ర్యవర్యుం డి ట్లనియె.

"శ్రేష్ఠివర్యా! వెనుకముం దాలోచించి, దేశకాలపాత్రము ల నూహించి, స్వశక్తిని జూచుకొనిన తేనికడ సంభాషింపఁవల యుఁ గాని, తద్వ్యతిరేకముగ మాటలాడి పిదప విచారించిన లాభమేమి? దైవయోగమున నీవేదియొ యేలికకడఁ జేయుదు నని చెప్పి పిమ్మట పశ్చాత్తాపమునొందుట యుక్తమా? రాజా జ్ఞకు వ్యతిరేకముగ సంచరించిన సిరిసంపదలకును, ప్రాణముల కును ముప్పురాదా? కాన సర్వవిధముల నీవు రాజుకడఁ బలికి నరీతిని ఖండాంతరముల కేఁగి కార్యమును నెఱవేర్చుటయె యు క్త" మనిధైర్యముఁ బురికొల్పెను.

అంత వసుమంతుఁడు తారాబలచంద్రబలయుక్తమును, శుభామృతా నంద యోగాది సహితము నగు ముహూర్తమును నిశ్చయించుకొని మహారాజుమొదలఁ గొని ప్రయాణోచితసం

భారములను, గుడారపుసామానును, బహుభాషలు నేర్చి, వర్తకనైపుణ్యము, మాటలందు నేర్పరితనము, గలిగి తనతో సమానులును ధైర్యశాలురునైన కొందఱు గొరకోమటులఁ గూడ రాసిద్ధపఱచి, 'ప్రళయకావేరి' రేవున మూఁడోడలను ప్రయాణమున కేర్పఱచి, సామానును వానిలోఁ జేర్పనంపి, బంధుమిత్రాదుల యనుజ్ఞను బెద్దల యాశీర్వాదములను నందెను. పిదప నంతిపురి కేఁగి, 'మనంబునఁ గల దుఃఖముచేఁ గలువలవంటి కన్నులనుండి వేడినీ రుప్పొంగుచు గండస్థలిపైఁ బ్రవహింపఁ, దనులత చెమర్చుచుఁ గంపమొంద, వేడి నిట్టూర్పుతో, మృదుమధురోక్తి తొట్రుపడఁ. దన పాదములపై వ్రాలిన సతీమతల్లికను, వసుమంతుఁడు కించిదూరముగాఁ దత్సదృశావస్థనె పొందుచు లేవనెత్తి యాదరించి, పురుషుఁ డగుటచే ధైర్యముఁ బురికొలిపి, నాఁటిరాత్రి 'శన్యుషఃకాలమున' శుభశకునములఁ గైకొనుచుఁ బయనమయ్యెను.

వసుమంతుని సాగనంపవచ్చిన బంధుమిత్రులతోఁ గూడిన వేంకటాచార్యుఁడు "శీఘ్రపునరావృత్తి యగుఁగాక!" యని యాశీర్వదించుచు గురూపదేశముగ నీక్రింది పద్యమును జంట యాకులుగలిగి మొనతోఁ గూడున్నట్లు గీయఁబడిన తాటాకుపై లిఖించి "శ్రేష్ఠీ! ఇందువ్రాసిన పద్యభావమును నీవు చేయు ముఖ్యకార్యములకు ముందొకసారి చదువుకొని ప్రవర్తింపుచుండు" మనెను.

* గీ. అతిరయంబున నొకకార్య ♦ మాచరించు
నతని యవివేక మఖిలాప ♦ దాస్పదంబు
తెలిసి సత్కార్యభాగవ♦ర్ధిష్ణుఁడైన
ప్రాజ్ఞుఁడు కృతపరిలబ్ధసం♦పదలఁ బొదలు.

ఆపద్యముగల తాళపత్రమును వసుమంతుఁడు వందనముతో నందుకొని తన మొలనున్న కత్తి యొరయం దిముడుటచే నందు దాని బదిలపఱచుకొని వెడలెను

వసుమంతు డిట్లిల్లు విడిచి ప్రళయకావేరి రేవునందు నావలపైఁ దోడివారితో నధిష్ఠించి, యోడలకు లంగరు లెత్తింప సరంగులు సముద్రముయొక్క లోఁతును దిక్కులను దెలియు దేశీయదిక్సూచీ♦యంత్రములచేనక్షాంశములఁ దెలిసికొనుచుండ నుత్తరాభిముఖముగాఁ బ్రయాణమును సాగించెను. మార్గమధ్యమునం దాయోడలు 'మాలిమికాండ్ర' నేర్పుచే సముద్రభంగ

* ఈపద్యము 'భారవి' మహాకవికృతి 'కిరాతార్జునీయకావ్యము' లోనిదాని కాంధ్రీకరణము. వనవాసఖిన్నుఁడై కౌరవులపై యుద్ధమునకు దూఁకనుంకించు భీముని ధర్మజుఁడు శాంతినొందింపఁ జెప్పినభాగము లోనిది

శ్లో॥ సహసా విదధీత నక్రియా । మవివేకః పరమాపదాం పదమ్।
వృణుతేహివిమృశ్యకారిణం । గుణలుబ్ధాస్స్వయమేవ సంపదః॥ 2-29

♦ దేశీయదిక్సూచీయంత్రనిర్మాణముఁ గూర్చి 'విశాఖపట్టణజిల్లా' వృత్తాంతసంగ్రహ మనుగ్రంథమున వ్రాయఁబడెను.

ములచే భంగమునొందక, కతిపయదినములకు 'వంగ'దేశము నందలి గంగాసాగరసంగమక్షేత్రముఁ జేరెను.

అట సముద్రతరణులనుండి వసుమంతుఁ డవతరించి నదీ తరులఁ దమవస్తువుల నెక్కించుకొని 'పాటలీపుత్రా'ది మహాపట్టణములఁ జూచుచుఁ, గొన్ని దినాలకుఁ 'గాశిం' జేరెను. అట 'మణికర్ణిక'లోఁ గుంకు లిడి విశ్వనాథుం దర్శించి, ప్రయాగక్షేత్రమున కేఁగి, నావికామార్గమును వదలి 'కంచేరల'లో దమసామాను నెక్కించుకొని, సార్థవాహులఁ గూడి కతిపయదినములకు ఢిల్లీపట్టణమునకుఁ బోయెను అట కొన్ని దినములుండి 'అక్బరుచక్రవర్తిని' దర్శించి తమప్రభు విచ్చిన యుత్తరమును సమర్పింప నాసార్వభౌముఁ డెంతయు గౌరవించి 'వసుమంతుని' 'ఆఫగనిస్థానము' దాఁటువఱకుఁ దగు రక్షకభటాది సౌకర్యముల నొనర్ప రాజపురుషుల కనుజ్ఞ నొసఁగుటయే గాక, పారసీకప్రభువునకును వసుమంతు నెఱిఁగింపుచు నుత్తరమిచ్చెను. అందువలన వసుమంతుఁ డుప్పొంగుచు నిర్భీతితోఁ బ్రయాణమును సాగించెను. మార్గమధ్యమునందుఁ బ్రాచీనకాలమునుండియుఁ బ్రసిద్ధికెక్కిన వీరులు, నాజానుబాహులు నగు, పాంచాలురు, ఆఫ్రడీలు, మొహమండ్లు' మొదలగు నాయుధజీవిక సంఘములను, కైబరుఁ కనుమలను గాంధార, మద్రదేశములను, జూచి యానందాశ్చర్య మగ్నుఁడగుచు వాయువశమున స్తంభాకృతిం దాల్చు నిసుకస్తంభములచే భీతావహముఁ గొలు

పు నెడారులలో నుష్ట్రముల నధిరోహించి వెళ్ళుచు,సుందరులు, భోగులు, కవులు, సూరులు, శూరులునై, యొకప్పుడు భారతీయార్యసంఘములలోనివా రయ్యుఁ, గాలాంతరమున వేఱుపడి, 'జందవేస్త' వేదోదితకర్మకలాపముల నాచరించుచుఁ బిమ్మట మహమ్మదుప్రవక్తప్రోద్బలముచే నిస్లాం మతావలంబులైన, పారశీకుల దేశముం బ్రవేశించి రాజధాని యగు 'టెహిరన్'పత్తనముఁ జేరెను.

అట 'షాయిన్‌షా' బిరుదము వహించిన సార్వభౌముని దర్శించి, 'అక్బరు' ప్రభువిచ్చినలేఖ నందియ్య, నాచక్రవర్తి సగౌరవముగా, 'బాగ్దాదు'నందలి ప్రభువునకు వసుమంతు ప్రయత్నముఁ దెలుపుచు నుత్తర మిచ్చెను. దానివలన నాంధ్రవర్తకుఁడు సంతోషముతో నొంటెలపై సామానుతో,, సహచరులతో, సార్థవాహులతోఁగూడి, బాగ్దాదుపురిఁ జేరి, యట రాజదర్శనమొనరించి,వక్రమార్గమైనను దర్శనీయమైనదగుటచే'ఇస్తంబూలు'న కేఁగుటకు బాగ్దాదుప్రభు ననుమతి నొందెను.అటనుండి ఖర్జూరమధుపానముచే, శరవేగ నదీ (టైగ్రీసు)స్నానముచే నానందింపుచు, భారతీయవాఙ్మయమున 'అసురులు' అనఁబడు 'అస్సీరియనులఁ' జూచుచుఁ గొన్ని దినములకుఁ జంద్రశిలా (మార్మొరా సముద్ర)వేలంజేరి దానిం దరులచేఁ దరించి, ఇస్తంబూలునకుఁ (కాన్‌స్టాంటినోపిల్) జేరెను.

అచ్చటఁగల వింతలఁ గొన్ని దినములు చూచి,మహమ్మదీయు

మతమునకు జగద్గురువును, తురుష్కసామ్రాజ్యచక్రవర్తి యు నగు 'ఖలీఫా'ను దర్శించి తత్ప్రభుసమ్మతితో, రత్నాకరము నందు నావలను సపరివారముగా నధిరోహించి 'డార్డి నెల్సు' జల సంధిలో నిరువైపులనుండు మహోన్నతపర్వతశృంగములం జూ చునప్పుడు రాజమహేంద్రపురినుండి భద్రాచలయాత్రకు గోదా వరీనదియందుఁ బడవలలో నేఁగునప్పుడు కాన్పించు, 'పాపి'కొం డలు జ్ఞప్తికి వచ్చుచుండఁ, గొన్నిదినములకు 'మధ్యధరా సముద్రము' నందలి ఫ్రాన్సుదేశపుతీరమునఁ బ్రధానవర్తకస్థాన మగు 'మార్సేల్సు'అను రేవునం దోడలు చేరె, నందు సపరివార ముగా దిగి, యచట సుంకము'లను గొను నధికారికిఁ దమప్రభు విచ్చినయుత్తరముఁ జూప, నాతఁడు వసుమంతునకుఁ దగు వస తిం జూపెను పిమ్మట నాతఁడు గుఱ్ఱపుబండ్లపై వసుమంతుని సపరివారముగా 'పారీసు' మహాపట్టణమున కంపెను.

ఆకాలమునం దా పరాసుదేశమును, నిర్వక్రపరాక్రమ ముతో 'నాలవహెన్రీ' చక్రవర్తి పాలించుచుండెను. మనవసు మంతుఁ డాచక్రవర్తిని దర్శించి 'వీరవేంకటపతిరాయప్రభు విచ్చిన యుత్తరమును, కానుకలను చక్రవర్తికిని, దత్తనామా త్యుఁ డిచ్చినయుత్తరమును 'సల్లీ'మంత్రికిని సమర్పింపఁగా, వారి రువురు నత్యంతానందముతో నావర్తకుని గౌరవించిరి. పరాసుదేశ మునం దాతఁడుండునంతకాల మాతనికిఁ దగుసౌకర్యము లొన ర్చనేర్పాటులు 'సల్లీ' చేయించుటయేకాక, యాదేశమునం దలి

గొప్పవర్తకులను రావించి వారలతో వసుమంతునకుఁ బరిచితిని గూడఁ గావింప, వా రావర్తకుని దమదేశమునఁ గల వివిధపరిశ్రమలు చేయుచోటులకుఁ గొనిపోయి, తమవస్త్రోత్పత్తివిక్రయాదులఁగూర్చి బోధనములఁ జేసిరి. వసుమంతుఁడును, దమదేశపు వర్తకసౌకర్యములకును, పరాసుదేశపువర్తకసౌకర్యములకును గలభేదములను గుర్తింపుచుఁ ఫ్రాంసుదేశ మంతయుఁ దిరిగి తిరిగి 'పారీసు'నగరముఁ జేరెను.

తొలుత పరాసుదేశీయు లెంతటిశుభ్రస్వరూపులో, ఎంతటిశుభ్రవస్త్రాలంకారములు, మృదూక్తులు గలవారో, వారంతటిశౌచాభావ, స్నానాభావ, దంతధావన నియమాభావు లనియుఁ, గోమాంసభక్షకు లనియుఁ, దెలిసికొని యసహ్యపడెను. కాని, కాలాంతరమున వారితోఁ గలిసి మెలిసి యుండుట కిష్టపడెను. ఆదేశీయులలోఁగల స్త్రీపురుషస్వాతంత్ర్యాదులను, వారి స్వేచ్ఛావిహారాదులను, జూచుచు 'సేను' నదీతీరమునందలి నాట్యములందు స్త్రీలయొక్క స్వేచ్ఛాసంచారములలోఁ జూపఁబడు 'కిలికించిత, కుట్టమిత, బిబ్బోక, మోట్టాయితా'ది, హావభావములకు సొక్కుచు,మధ్యధరాసముద్రతీరమునందలి ద్రాక్షావనప్రదేశములకుఁ బోయి యచటి నరనారీకముయొక్క మర్యాదలను, ద్రాక్షాసవపాన విహారములను వీక్షింపుచు,పారీసుపట్టణవిహారవనముల విహరింపుచుఁ దత్రత్యప్రభుమర్యాదలకు, విందులకు, విహారములకు లోనై చొక్కుచు,గృహమును, గృహ్యా

ములనుగూడ మఱచి వసు మూఁడేండ్లు పరాసుదేశమునం దుండెను.

ఇట చంద్రగిరిలో వసుమంతుఁడు ఫ్రాంసుదేశమున కేఁగు నాఁటికే గర్భవతియుఁ బతివ్రతయు నగునాతనిసతి, పతిదేశాంతరగతుఁ డగుట కెదలో నతివిచారమగ్నయయ్యు, గురువర్యుని యొక్కయు నాత్మబంధువులయొక్కయు దీమసపువాక్యములచే నెటులనో వియోగదుఃఖమును సహించుచు వసుమంతుఁడు పరాసుదేశమును బ్రవేశించునాఁడె, చంద్రుంబోలినమోము, కలువలవంటి కన్నులు, సురూపము గలిగి, వంశవర్ధనుఁ డైన సుపుత్త్రుం గని, తండ్రి యిట్టిబిడ్డం గాంచక దేశాంతరగతుఁ డయ్యెనే యను విచారమును బాలునిసౌందర్యవిచేష్టితాదులఁ జూచుచు నానందమును బొందుచుఁ, గాలముఁ బుచ్చుచుండెను పిదప బాలుఁడు పంచశరద్వయస్కుఁ డగు నప్పుడు, తనగురుని చేత నక్షరాభ్యాస మొనరింపించి, చదువుఁ జెప్పించుచుండెను.

శ్రీ వేంకటపతిరాయమహారాజును, వసుమంతుఁడు వెళ్ళినపిమ్మట, నతనిసంసారపుమర్యాదలకును, నాతనివర్తకమునకును లోఁటు రాకుండఁ దగుసౌకర్యములఁ జేయింపుచుఁ, బతిదేవత యగు నాతనిభార్య సుఖప్రసవమై బాలుని గనినందుల కానందింపుచు, నాబాలుని యోగక్షేమములఁ దగ నారయుచుండెను.

ఇట్లుండఁ బదుమూఁడేండ్లు కడచినను వసుమంతుఁడు తిరిగి రాకుండుటకు విచారించి, స్వదేశమునకుఁ బోవునొక హాలండు దేశీయునిచేత 'మీదేశమునందు డు మావసుమంతుని మాదేశమున కంపుఁ' డని ఫ్రాంసుదేశ చక్రవర్తియు, బాలుఁడు నగు 'పదుమూఁడవలూయీ'కి రీజంటగు 'మేరిడిమెడిసి' అను నామె కొకయుత్తరము నంపెను.* ఆయుత్తరము నాయొలాందు దేశీయుఁడు 'పారీసు'న కేఁగి 'రీజంటున' కియ్య, నామె వసుమంతుని బిలిపించి యాయుత్తరమును వినిపించి వెళ్ళ నాజ్ఞాపింప, నాతఁడు పూర్వస్మృతి నొంది, ఫ్రాంసుప్రభుత్వము తనరాజున కిచ్చు కానుకలఁ గైకొని స్నేహితులగు 'రిష్లూ, క్లాడరు' మొదలగువారిని వీడ్కొని వారలచే బహూకరింపఁబడి, వారి నాంధ్రభూమికి రా నాహ్వానించె. అట బహువిధములగు చిత్రవిచిత్రవస్తువులఁ గొని సపరివారుఁడై 'మార్సేల్సు'లో షూఁడు పరాసుదేశీయుల యొడలఁ గుదుర్చుకొని వెచ్చఁదనము నిచ్చు భూమధ్యసముద్రమార్గమున 'సితాఽసిత'నదుల (వైట్ నైల్,

* వసుమంతుఁడు పరాసుదేశమున కేఁగునాఁటి కాదేశమును 'నాల్గవహెన్రీ' పాలింపుచుండెను ఆతఁడు క్రీ. శ. 1610 సం॥రమున హత్యగావింపఁబడెను ఆతని మంత్రియగు 'సల్లీ' కూడ మఱికొన్ని మాసములకె మృతినొందఁగా నప్పటి కైదేండ్ల బాలుఁడగు పదుమూఁడవ 'లూయి' చక్రవర్తి యయ్యె. ఆతని తల్లియగు 'మేరిడిమెడిస' అను నామె సంరక్షకురాలు (రీజెంటు)గా నుండెనఁట !

బ్లూనైల్) కూడికచేఁ బవిత్రవంతమైనదని వేదమునఁ జెప్పఁబడు* 'నైలు' నదీముఖద్వారమునం దోడలను డిగి, స్నానాదుల నొనర్చి, ప్రసిద్ధి కెక్కిన 'అలగ్జాంద్రియా' పట్టణముఁ జూచి 'సూయెజు' నామక భూసంధిప్రదేశమునందు 'ఎడారియోడలు' అనుబిరుదు నొందిన 'ఒంటెల'పై సపరివారుఁడై, ఆఫ్రికాఖండమునందలి విచిత్రవస్తువులను సేకరింపుచుఁ బండ్రెండుయోజనములు పయనమును సాగించి, 'ఎఱ్ఱ' సముద్రముఁ జేరెను అట భరతఖండమునందలి సింధుదేశీయులగు తురుష్కుల యోడలు ప్రయాణమునకు సిద్ధమగుచుండ వానిపై నారోహించి, రెండుపార్శ్వములందును తప్తలోహములవలె నెఱ్ఱనై కనుచూపుమేర నెచ్చటను వృక్షగుల్మములు లేకయుండు 'వేలలు' గలిగి రక్తముభాతి నెఱ్ఱనిరంగుగల నీరితో నొప్పు సముద్రముపై 'జిడ్డా, మసాని' మొదలగు రేవులలో నాఁగుచు నూటయిరువది యోజనములు విసుగుతోఁ బ్రయాణ మొనర్చి అరేబియానామక సముద్రమున

---

* "నల్లని తెల్లని నదులకూడిక గల చోటను స్నానమాచరించిన మనుజులు స్వర్గము నొందుదురు ఎవ రాస్థలమున మృతి నొందుదురో వారమృతత్వమునే పొందఁగలరు" అని క్రిందిమంత్రము చెప్పుచున్నది.

మ॥ సితాఽసితే సరితే యత్ర సంగతే। తత్రాప్లుతాసో దివ ముత్పతంతి।
యే వైతన్వాం విసృజంతి ధీరాః। తేజనాసో అమృతత్వం భజంతే॥

ఈయర్థముగల ప్రదేశము గంగా యమునా నదులు కూడు ప్రయాగక్షేత్రమునకును, బ్లూ వైట్ నదులు కూడు 'కార్టూం' అను ప్రదేశమునకును మాత్రమే వర్తించును.

నోడలు ప్రవేశింపఁ జల్లనిగాలిచేఁ బ్రయాణికు లానందించిరి. పిమ్మట పారశీక సింధుశాఖను దాఁటి, బెలూచిస్థానతీరపు 'గ్వాడర్, పస్నాని, సోన్మియాని*' రేవులఁ జూచుచు వసుమంతాదులు 'బోంబే' రేవుఁ జేరిరి అచటి కంతకుముందే వచ్చియున్న వసుమంతునియొక్క తరణులలోనె సామానునంతను జాగ్రత్తగ దింపుకొని యానందింపుచు, స్వదేశవృత్తాంతములఁ దెలిసికొనుచు యాత్రికులు పయన మొనర్చి 'కన్యాకుమారి' భూమ్యగ్రమును జుట్టి 'మన్నారుసింధుశాఖా'మార్గమున 'ధనుష్కోటి'లో నాఁగి యట 'సేతుస్నాన, రామేశ్వరదేవ'దర్శనములచేఁ బవిత్రుల మైతి మని తలఁచుకొనుచుఁ బ్రయాణ మొనర్చిరి. పిదప స్వల్పకాలములోనె ప్రశయకావేరిరేవులో నోడలకు 'లంగరు' వేయ యాత్రికు లానందించిరి.

ఓడ దిగినవెంటనే వసుమంతుఁడు తనభృత్యులకుఁ బదిలముగ వస్తువులం దెండని యాజ్ఞాపించి, మజ్జనభోజనాదుల నాచరించె. తాను ఫ్రాంసుదేశమున కేఁగునపుడు 'మీనులవంటి నేత్రములు, ముకురములఁబోలు చెక్కిళ్ళు, దొండపండుంబోలు నధరోష్టము, బిసముల ననుకరించు బాహువులు, నెమలిపురిఁ బోలు కచముఁ గలిగి, విచారమగ్నమానసయై సాగనంపిన తన సతి మనంబునఁ బొడకట్టఁ గామశరవిద్ధుండై త్వరిష్యమాణ

---

* ఇపు డీ రేవుల పేరులె జాగ్రఫీలో కాన్పింపవు. 80 సం॥రాల నాఁ డవి ప్రచారమున నుండెను.

మానసుం డయ్యె. అంతఁ దా నరబ్బిదేశముఁ గొనిన యవనా శ్వమునారోహించి, దొమ్మిదో నా రాత్రియె తనసతిం జూడవలె నని గుఱ్ఱమును 'పేరెము వారింపుము' నిట్లనుకొనెను. నే నూరలే నప్పుడు నాసతి యెట్టవెతలం బడెనో ! యెట్లు నావిరహమును సహించెనో? ఎట్టికష్టము లొందెనో? యనియు, స్త్రీలచిత్తము చంచల మందురు ఏమో ! నాయెడఁబాటుచే నామెప్రవర్తన మెట్లుండెనో యనియుఁ బరిపరివిధములఁ దలఁచుచు నర్ధరాత్రి మునకె చంద్రగిరిలోని తనగృహమునకుఁ జేరి యశ్వము దిగె ను. నిశీథ మగుటచే నాతనిరాక యేరికిఁ దెలియలేదు. ఆసమయ మున వసుమంతునిభార్య, నిండుదీపములతో నొప్పు సౌధము నందు స్వచ్ఛమగు పానుపుపై దగ్గఱ పదునాలుగేండ్ల బాలు నితో నిద్రింపుచుండెను. వసుమంతుఁ డాపెఁ బరీక్షింపఁ బెడ దారి నామె నిద్రించు నంతర్గృహముఁ జేరి యొక పురుష విగ్రహముతో నిద్రించు తనభార్యం గాంచి నివ్వెఱపడి 'హా ! మోసపోతిని. స్త్రీచిత్త మెంతచంచల' మని క్రోధతామ్రాక్షవీ క్షణుఁడై మొలనున్న మరకత్తియం దీసి యొక్కపోటుతో భార్యయసువులఁ దీయ నుంకించి బహుకాలమునుండి యొర నుండి తీయనిదగుటచే బిగిసియున్న యాఖడ్గమును గట్టిగ కోశ మునుండి లాఁగెను. అపు డాకత్తితోఁ గూడ గురువు వ్రాసి యిచ్చిన పద్యముగల తాటాకును నూడి మృదువైన యాతని పాదముపైఁ బడి దానియాన కించిద్బాధాకరముగ గ్రుచ్చుకొ

నేను అందువలన నతఁ డిదేమి యని దానిఁ జూడ, నందు

"తొందరపడి యేకార్యమును జేయకుము. తెలివితక్కువగ నట్లు చేసితివేని యాపదల నొందుదువు ఆలోచించి పని చేసినవానిని గుణలుబ్ధములై సంపదలు పొందును"

అను నర్థముగల పద్యము కనుపింపఁ, గొంచె మాలోచించి భార్యశయ్యను సమీపించి చూడ నామెకడ నిద్రించువాఁడు బాలుఁడుగాని, యువకుఁడు కాఁడనియుఁ, దనసతి ప్రోషితభర్తృక, యగుపతివ్రతవలె మలినయుఁ గృశయునై జడలువైచిన శిరోజములు కలదిగా నున్నదనియుఁ, బరిశీలించి హా! ఎంతటితప్పుఁ దలఁచితిని ? నా గురూపదేశపత్రి మీనాఁడు కనిపించి నావంశమును నిలిపినది. లేకుండిన నాభార్యయు నేను నే మగుదుమో కదా ! ఈబాలుఁ డెవ్వఁడు ? నాభార్యపోలికలు నాచిన్నెలు నీనియందుఁ దోఁచుచున్నవి. అయిన రేపీయంశముఁ బరిశీలింతు నని, వచ్చినదారినె చప్పుడు గాకుండఁగ వెనుకకుఁ బోయి యెట్టులనో వేగించి తెల్లవారఁగనే స్వగృహామున కప్పుడె వచ్చియిల్లు చేరెను

వసుమంతుఁ డింటఁ బ్రవేశింప నాతని బంధు మిత్ర పరివార మత్యంతానందముతోఁ జుట్టుకొనెను. ఇంతలో వసుమంతుని యిల్లాలు, భర్త వచ్చెనను నానందాతిశయముచేఁ బెక్కేండ్లనుండి యభ్యంజన మొనర్పకుండుటచే మలినమైన శరీరమును లోధ్ర కుసుమపిష్టముచే నల్గుచేసికొని, పద్మినీజాతి స్త్రీత్వమును పరిమిళితచే

హాముచేకూడ సార్థకపఱచియు, జిగిమేలి నొకవింతసొగసు గూర్పఁబైఁగాఁణిని ధరించియు, కాటుకపిట్టలఁబోలు కన్నులసౌందర్యమినుమడింప రేఖలుదీర్చి కాటుకఁ బెట్టుకొనియు, నిలువుటద్దముఁ జూచుకొనుచు నర్ధచంద్రునిభాతిఁ బ్రకాశించు నెమ్మొగమునఁ గస్తురితిలకముఁ దిద్దియు పెక్కేండ్లనుండి చిక్కుపడియున్న నెఱికురులకు జవ్వాదిపసు నిచ్చి వింతగ ముడిచి కేకకచ యనిపించుకొని, నిలువెల్ల నొకవింత రయిఱపు నుఱయ వివిధరత్నఘటితాలంకరణములను ధరించియు, మన్మథసామ్రాజ్యలక్ష్మివలె వినయలజ్జానందములచేఁ దనులత కంపింపఁ బ్రాణనాథుపజ్జఁ జేరి యాతనిపాదపద్మములకు మ్రొక్కి నిలిచెను.

అంత వినయసౌశీల్యాదియుక్తుఁడును కించిదూనచతుర్దశవర్షప్రాయుఁడును నగు నతనిపుత్త్రుఁడు 'బంధు హిత గురు పురోహితసహితుఁడై తండ్రికడ కేతెంచి మ్రొక్క నసుమంతుఁడాదరించి యాబాలుని నంకతలమున నాసీనుఁగాఁ జేసికొనియు నీతనిజననాదు లెట్టివని సంశయింపుచుండఁ, గులవృద్ధులు, గురువును నాతనితో నీవు ఖండాంతరముల కేఁగునాఁటికి నీభార్యకు నెల తప్పుట నెఱుఁగవా ? యనిరి అంతలో వృద్ధదాసి వచ్చి ప్రభువా ! నేను నీ ప్రయాణము రే పనఁగా, అమ్మ గర్భవతి యని చెప్పితినిగదా యని యందఱికడ సంశయవిచ్ఛేద మొనర్ప సతీ సుత పతు లానందయుక్తులైరి.

అంతలో ఖండాంతరముల కేఁగి వచ్చిన వసుమంతుని వార్త వినిన వేంకటపతిరాయమహారాజు తనివేగమె తనకడకు రావలయునని వర్తమాన మంపెను. వసుమంతుఁడును, పెరోల గమునం దుండిన మహారాజును దర్శించి, మ్రొక్కి అతిలోక చారిత్రుఁడగు నాపృథ్వీపతిచే సగౌరవముగ నాదరింపఁబడెను. పిమ్మట వసుమంతుఁడు తాఁ బోయివచ్చిన యాయాదేశముల వృత్తాంతములను, తద్దేశప్రజల యాచార మర్యాదలును, ప్రభువుల బలపరాక్రమ విభవాదులును, దన కాయాచోటులఁ గలిగిన కష్టసుఖములను జెప్పి, రాజుయొక్కయు, సభాసదుల యొక్కయు మనంబుల కత్యాశ్చర్యానందంబులఁ గలుగఁజేసెను.

ఆసమయమునకె నావలనుండి దింపఁబడి, బండ్లపై గుఱ్ఱములపై నెద్దులపై నేనుఁగులపై నెక్కింపఁబడి తేఁబడిన వివిధ వస్తుజంతు తతియు, రాజ హాజారమునకు సేవకులు తోనిరా, వసుమంతుఁ డావస్తుతతిని మహారాజునకు వానివాని విలువలతో నెఱిఁగింపుచు నిట్లు చెప్పెను.

ప్రభువర్యా! చిత్తగింపుఁ డని, భారతీయులకుఁ బరిచితి లేని నల్లని వజ్రములు, తెలిదీవిలోఁ బుట్టిన పద్మరాగమణులు, ముదిరి నీలమణులు కాఁబోయెడి పుష్యరాగములు, తుమ్మెద తళుకు గల్గెడి 'ఇళాపు నీలమణులు' మంచపుకోడులకుఁ బనికి వచ్చునంతటి దృఢదీర్ఘయుక్తములగు పగడములు, పారసీకసము ద్రమునఁ బుట్టిన నిమ్మకాయలంతలేసి యురువుగల ముక్తా

ఫలములు, పెక్కులితరమణులు, మక్కా జలతారుతివాసులు, వివిధపక్షితూలికాయుక్త శయ్యలు, అట్టెదిండ్లు, పారశీకకంబళములు, ఈజిప్టుపట్టుబట్టలు, పరాసుదేశపు చాంపేయినీమద్యము, అసురదేశపు ఖర్జూరమధువు, రోమకదేశపు జంత్రివాద్యమగు ఫిడేలు, ఆఫ్రికాయందలి దీర్ఘాంగగజములు, బర్బరదేశపు వామన కరులు నరవానరాకృతులు రెండును గలిగియున్న కాంగోదేశములోని యర్ధమనుష్యులు, వివిధదేశప్రజలు ధరించు వస్త్రాభరణములు, బహువిధ లోహశిలాపాత్రలు, వివిధచిత్రాభరణములు, బహువిధధాన్యములు, వివిధవృక్షబీజములు, యవన పారశీ కాజానేయ కాంభోజాశ్వములు, వివిధములగు ముకురములు, ఎందఱో చక్రవర్తులయొక్కయుఁ బ్రిన్సులయొక్కయు సుందరులయొక్కయుఁ బ్రతిబింబములు, వీని నన్నిటిని వేర్వేఱుగఁ జూపి మహారాజుయొక్కయు, సభికులయొక్కయు మనంబుల నానందవాహిని నుప్పొంగఁజేసి, తని కావస్తుతతిని సమర్పించెను.

అంత వీరవేంకటపతిమహారాజును వసుమంతు నత్యాదరమున సభాముఖమున గౌరవింపుచు, వజ్రపుకంకణములను, రవలయుంగరములను దానె, స్వయముగ నాతని హస్తములకుఁ దొడిగియు, వజ్రలహారమును గంఠమున వేసియు, మంచిముత్యము లుగల పోఁగులజోడుచే నలంకరింపఁజేసియు, కట్టువస్త్రము లిచ్చియు, సభికుల హస్తకరతాళధ్వనులు చెలరేఁగ, నెంతయు యింద్రవైభవముతో బహూకరించుటయేగాక యాతనికి వస్త్రక

మంత్రిపదవి నొసఁగి గౌరవించి, యాతని నెంతియొ యానందిం పఁజేసెను.

వసుమంతుఁడు పారిసుపట్టణమున నుండిన కాలమునం దు విద్యార్థిగా నుండి, వసుమంతు పరిచితి నొంది యాతనివలన భరతఖండ సంపదలను నిచటి వర్తకసౌకర్యములను దెలిసికొనిన, 'క్లాడరు' అను నాతఁడును, నాతనికి సపర్య లొనరించిన 'రిచ్లూ' అను నాతఁడు రాజ్యోద్యోగముల వృద్ధినొంది పిమ్మ ట 'పరాసు' దేశచక్రవర్తి యగు పదుమూఁడవ 'లూయీ' కడ మంత్రులై (క్రీ. శ. 1640 సం॥ర) భరతఖండములోఁ దమ దేశీయులు వర్తకముఁ జేయుటకుఁ జక్రవర్తిచే ననుమతింపఁ జే సిరి. అదియె, ఫ్రెంచివారి యీస్టిండియా కంపెనీ నిర్మాణము నకును, బిమ్మట వారి భరతఖండమునఁ గొన్ని వలసభూములు సంపాదించుటకును హేతు వయ్యెను.

శ్రీశైలమల్లికార్జునుఁడు.

మగధదేశము మహాభారతకాలమునుండియుఁ బ్రఖ్యాతి నొందిన 'జరాసంధాది' 'బార్హద్రథ' భూపాలురచేతను, ప్రద్యోతనాది 'శౌనక' రాట్టులచేతను, బింబిసారాది 'శైశునాగ' నృపులచేతను, మహాపద్మాది 'నంద' సమ్రాట్టులచేతను, చంద్రగుప్తాది 'మౌర్య' చక్రవర్తులచేతను, పుష్యమిత్రాది 'శుంగవంశ' పృథ్వీపతులచేతను, వసుదేవాది 'కాణ్వాయన' భూపతులచేతను, సింధులా 'ద్యాంధ్ర' ప్రభువులచేతను బాలింపఁబడి, నాలవక్రైస్తవశకారంభమునందు, గుప్తవంశనృపుల వశమయ్యెను.

ఆగుప్తసమ్రాట్టులలో 'సముద్రగుప్తుఁడు' 'విద్యాపరాక్రమ, పరిపాలన, కవి పండితాదరణ, వైదిక కర్మాచరణాదులచే, నతిప్రసిద్ధినొందెను. సముద్రగుప్తుని దిగ్విజయములనే యాతని కాలమునందుండిన 'కాళిదాసమహాకవి' రఘువంశ మహాకావ్యమునందు 'రఘుదిగ్విజయ' మను మిషతో వర్ణించెనని కొందఱు పండితులు తలంచుచున్నారు.

సముద్రగుప్తుఁ డవసానదశయందు, పుత్రుఁ డగు చంద్రగుప్తునకుఁ, దన సామ్రాజ్యమును, సూర్యుఁ డస్తమయసమయమునఁ దన తేజము నగ్నికొసఁగిన ట్లొసఁగెను. ఆచంద్రగుప్తుఁడును దండ్రికంటె నెక్కుడు పరాక్రమముతో శత్రురాజుల

నోడించి, యవనతులఁ జేయుటయేగాక, దేశమునందు 'కఱవు, దరిద్రము, స్వచక్ర, పరచక్రభీతులు' లేకుండఁ జేసి, నిర్వక్ర పరాక్రమముతో దేశము సుభిక్షమగునట్లు పెక్కేండ్లు పాలించెను.

ఆచంద్రగుప్త చక్రవర్తికి, గుప్తవంశసాగరమునందు లక్ష్మివలె 'చంద్రవతి' యను నొక పుత్రిక జన్మించెను. సముద్రగుప్తసమాత్రీ ట్రీపౌత్రియగు చంద్రవతి నల్లారుముద్దుగఁ బెంచి, తన కభిమానవిద్యలగు సంగీతసాహిత్యములఁ జెప్పించి, వానిలోఁ బ్రోడఁగాఁ జేసెను ఆమె యౌవనారంభమున, 'విద్యుత్కాంతులడాలును, చంద్రప్రభల తళుకును' మేళవించి, బంగరునీటను బులుగడుగుచు, నలువ తననేర్పరితన మంతయుఁ జూపుచు నొనరించిన స్త్రీజాతి ప్రథమ సృష్టివలెనే యుండెను.

చంద్రవతి చిన్నతనమునుండియు సంగీతవిద్యాప్రియయై, పూర్వజన్మసుకృతముచే సదాశివ భక్తపరాయణయై సఖీజనముతోఁ గూడి, గిరీశ గాథాగీతికలనే బహువిధ వీణల చేత వివిధరసము లుప్పొంగఁ బాడుచుండును. పూర్వపుణ్యమెట్టిదో గాని, బాల్యమునుండియు నామెకు యోగాభ్యాసము నం దనురక్తియు, సంసారసుఖమునందు విరక్తియు, వైరాగ్యమునం దాసక్తియు నేకోత్తరాభివృద్ధి నొందుచుండెను.

పితామహునికడనే యామె పుట్టినది మొద లిరువదేండ్లు పెరుగుటచేతను, పితయగు చంద్రగుప్తుఁడు విదేశములలో

బహుళరాజకార్య మగ్నుఁడై, రాజప్రతినిధిగాఁ గూడ నుండు టచేతను, నామె తండ్రికంటనె పడలేదు. సముద్రగుప్తుఁడు స్వర్గస్థుఁడైనపిమ్మట నొకప్పుడు, చంద్రగుప్తుఁడు తనకూఁతురి యొక్క సంగీతసాహిత్య విద్యానైపుణ్యమును విని, యామె వీణాగానమును దిలకింపఁ గుతూహలుఁడై యంతిపురికిఁ జంద్రవతిని రావించి, నీసంగీతవిద్యానైపుణ్యము విన వేడుక కలదన, నామె పితృభక్తిమెయిఁ వీణానిక్వణమును 'కోకిల' కంఠముతో మేళవించి 'ఋషభ, మధ్యమ, గాంధారాది' స్వరగతులచే నవరసరీతుల గీతికలఁ బాడెను. వీణావాద్యమునఁ జూపఁబడు నామె యంగవిక్షేపాదులచేతను, గానమాధుర్యముచేతను, జంద్రగుప్తచక్రవర్తి, మనోభావమున మార్పుఁ గలుగ, ముగ్ధుఁడై, మూఢుఁడై, కామమోహితుఁ డయ్యెను. హా! యెంత విరుద్ధచర్య!

కూఁతు రగు సరస్వతిం గాంచి కామించినవాఁడు, బ్రహ్మయని పురాణములలో వినఁబడునేకాని, వేఱుచోటుల నిట్టి దౌష్ట్యము కాన్పింపదు. ఆయంశమునను, 'సవిత' (సూర్యుఁడు) తనవలనఁ బుట్టిన యుషస్సును వెన్నాడుటను గాంచి, పౌరాణికులు సృష్టికర్త కూఁతును వెన్నాడిన ట్లుత్ప్రేక్షించి వ్రాసి రని పరిశోధకు లందురు.

ఎట్లయిన నేమి! లోకమునందు 'కనరాని, యనరాని, వినరాని' పాపునివిధమునఁ జంద్రగుప్తుఁడె ప్రవర్తింప నెంచెను.

కామమోహితుఁ డగు తండ్రిరీతిఁ గాంచి, చంద్రవతి సంగీతముఁ గట్టిపెట్టి యాభవనమును వీడి వేగమె స్వస్థలము నకుం జేరి సఖీజనులం గూడి యిట్లాలోచించెను.

"సకియలారా! కాముకునకు యుక్తాయుక్త పరిజ్ఞానము సున్న. నాతండ్రి నన్నుఁ గనెనె కాని పితామహుని చేఁ బెంపఁబడుటచే నన్యగానో, సామాన్యనుగానో, నన్ను భావించి ముగ్ధుఁ డయ్యెను పుత్రికావిషయన్యాయమును గుర్తెఱుంగఁ డయ్యె హా! యెంతపాపకార్య మొనర్పఁ దలఁచెను! నే నీతని పుత్రికనై పుట్టినందులకీతనికిఁ బశ్చాత్తాప మొనఁగూర్చి పాప విముక్తుం జేయుటయే నావిధి" అని చెప్ప, నొకసఖి యిట్లనెను.

"చెలి! నీవేమి చేయఁగలవు? నీ తండ్రి చక్రవర్తి. మూర్ఖతచే, ననూహ్యాచరితమును బుత్రికావిషయముననే యొడిగట్టఁ దలఁచుట యస్మదాది స్త్రీజాతముయొక్క దురదృష్టి" మనెను.

దానికిఁ జంద్రవతి యిట్లనెను.

'సఖి! నేను కామరోగగ్రస్తుఁడగు నీతని కామపిశాచమును హతమార్పఁ స్మరహరుం గూర్చియే తపం బాచరించెదను.'

అంత మఱియొక చెలి యిట్లనె.

, సోదరీ! అత్యాసన్నవివాహవయస్క వగు నీవు, కాశ్మీ

రప్రభువునో, ప్రతిష్ఠానపురాధీశునో, ఉజ్జయినీవిభునో, వేటొక చక్రవర్తినో పెండ్లియాడుదు వనియు, నీవాహహోన్నతమగు వివాహోత్సవముఁ జూచి యానందింతు ననియుఁ దలఁచుచుందును; అది వ్యర్థమగుచుండినందులకుఁ జాల విచారించుచున్నాను. మఱియు నీ వబలవు; ఎండకన్నెఱుఁగని సుకుమారిణివి, అట్టినీ వెట్లు కృచ్ఛ్రచాంద్రాయణాది కఠినవ్రతము లొనర్చుచు, శీతాతప వాతబాధల కోర్చి, తపం బొనరింపఁ గలవు? దుర్ఘటకార్యము నొనరింపఁ దలఁచితివి. ఈప్రయత్నమును మాని యన్యోపాయము నాలోచింపు' మనెను.

అందులకుఁ జంద్రవతి 'సకియా! నా కందులకో 'చిన్నతనమునుండియు, సంసారసుఖమునందు విరక్తియు, తపమునందాసక్తియు, శివునందు భక్తియుఁ, గలిగియుండెను. అది నేఁటి కీవిధమునఁ బరిణమించుట శుభసూచకమే యగును' నని చెలికత్తియలను సమాధానపఱచి, భవిష్యత్కార్యమునుగూర్చి యాలోచింపుచుండెను.

నాఁటిసాయంకాలమునకే, చంద్రగుప్తునకు మిత్రుఁడుగా నుండిన 'పాంచాలదేశప్రభువు' హఠాత్తుగ శత్రుఁడై చంద్రగుప్తునిరాజ్యములోని కొంతభాగము నాక్రమించెననియు, వంగదేశపు రాజు పాంచాలాధీశునకు మిత్రుఁడై, మగధదేశముపై దండెత్తుచున్నాఁడనియు రెండుభయంకరవార్తలొక్కకాలమున వినఁబడగానె, చంద్రగుప్తునకుఁ గ్రోధమున నొడలు తెలి

యుక, రసాంతరప్రవిష్టుఁడై, చంద్రవతిని మఱచి యారాత్రియె దండును గూర్చికొని, దండయాత్రకు వెడలెను.

చంద్రగుప్తుఁడు పరదేశమున కేఁగిన మరునాఁడె, చంద్రవతియు, మంచిసమయము చిక్కెనని సంతసించి యోగినీవేషమును ధరించి, తనవలె విరక్తలగు నిద్దఱు 'సకియలు' శిష్యురాండ్రవేషముతో వెంటరాఁ బురమును వీడి దక్షిణాభిముఖయై, పోవుచు, దారిలో మహానదిని దాఁటి, మహేంద్రగిరిని జూచి, సింహాద్రిని దర్శించి, పిష్టపురమును దిలకించి, గోదావరిని దర్శించి, కృష్ణానది నతిక్రమించి, కతిపయదినంబులకుఁ బర్వతరాజమగు శ్రీశైలముఁ జేరెను.

ఆకాలమున జైన బౌద్ధమతములు, దక్షిణాపథమునందు రాజాదరణమతములై యుండుటచేతను, తన్మతప్రవిష్ట లగు 'యోగినులు' ప్రజలచే భక్త్యాదరములతో గౌరవింపఁబడుచుండుటచేతను, యోగినీవేషధారిణులగు చంద్రవత్యాదులు మార్గమధ్యమునం బ్రజలచే నాదరింపఁబడుచు ప్రయాణ మొనర్పఁగలిగిరి.

శ్రీశైలశిఖరముఁ జూచినంతమాత్రముననే, పునర్జన్మములేదని పురాణములు వాకొనుచుండ, దానిమహాత్మ్యము వేఱుగఁ జెప్పవలెనా? ఆశ్రీశైలమునం దనేక ఋష్యాశ్రమములు గలవు. అచటి వృక్ష దారు శిలా మృగాదులును, శ్రీశైలేశుఁ గొలిచి గొప్ప మహత్త్వ నొందిన యంశములు, పర్వతోత్పత్తి కథ,

మొదలగువానిఁగూర్చి స్కాందపురాణము, తదంతర్గతమగు శ్రీశైలఖండము చెప్పుచున్నవి*

ఆ శ్రీశైలగిరికిఁ జంద్రవతి చెలికత్తెలతోఁ బ్రదక్షిణ మాచరించిఁ తత్తత్ క్షేత్రాదుల మహాత్త్వలఁ దెలిసికొనుచు నొక్కెడ, నిండుభక్తితోఁ దప మాచరించి శివసాక్షాత్కార మొందిన యొకవృద్ధమునిసత్తముఁ గాంచి నమస్కరించి, 'ఋషివర్యా! నన్ను శిష్యురాలనుగాఁ జేకొని నేను శ్రీపర్వతేశ్వర సాక్షాత్కార మొందువిధము నుపదేశింపు' మని ప్రార్థించెను.

ఆ మహర్షియు నామె తలంపును దెలిసికొని యాదరించి పుత్రికాప్రేమతోఁ జంద్రవతికి 'శివపంచాక్షరి'ని యథావిధిగ నుపదేశించి తగువనం బామె తప మాచరింప నిర్దేశించెను. ఒక్కొక్కని కొక్కొకవ్యక్తియం దిట్టి 'తారామైత్రి' కలుగునుగదా!

చంద్రవతియు గురునానతి ననుసరించి, 'ఆగమవిధి'చే శ్రీపర్వతేశుఁ గూర్చి, మండువేసవిని బంచాగ్నిమధ్యమునందును, వర్షకాలమునఁ గంఠదఘ్నజలమునందును, శీతసమయమున హిమసంహతియందును, వసించి ఘోరతప మొనర్చెను

ఇట్లు పెక్కేండ్లు తపం బొనరించినను, శంభుఁడు ప్రత్యక్షము కాకుండుటచే నన్యవిధమున దేవదేవు భజింపఁ దలఁచి,

* ఈకథ సంస్కృతమునందుండిన శ్రీశైలమాహాత్మ్యమును, 'శేషనాథార్య'కృత మగు నాంధ్రశ్రీపర్వతపురాణమును జూచి వ్రాయఁబడెను. ఈగాథయే పండితారాధ్యచరిత్రయందు సంక్షిప్తముగా వ్రాయఁబడెను.

యామయామశ్రిమమునఁ దనసకియలు భక్తితోఁ గొంచిన తెల్లని మల్లికాపుష్పములచే శ్రీపర్వతేశుని, శివసహస్రనామము లుచ్చరింపుచుఁ బూజింప, శివుఁడు తా ధరించిన గంగాస్రవంతి నిటఁగూడఁ బ్రత్యక్షముగ ధరించెనో యనునట్లుండెను. కాని యందువలననుగూడ శివుఁడు ప్రత్యక్షము కాకుండుటకుఁ జంద్రవతి విచారించి, తనగానవిద్యాపాటవముచేతనే 'పశుపతి'ని వశపఱచుకొనెదనని నిశ్చయించుకొని శివనుతితోఁగూడిన గతికలను విపంచినిఁ గూర్చి పంచమస్వరమున గానమొనర్చెను. ఆగానములోఁ జంద్రవతి సమయానుకూలములగు 'శ్రీ, నాట, సురటి' మొదలగు నూటయెనిమిది స్త్రీపురుషరాగములును, పాంచాలాద్యధ్వని చతుష్టయము ముప్పళ్ళ, మంద్రమధ్యాది తాళంబులు, నిగన్యాభ్యదిరీతులు మెఱయఁ దనసంగీతవిద్యానైపుణ్యమును జూపెను.

ఆమె కంఠస్వరము వీణాతంతువులను సారించి పాడుచుండఁగా, గానమహిమముచే మోడులు చిగిర్చెను, పాషాణములు కరుగుచు నీరయ్యెను, చిత్తరువులు జీవముఁగొంది తలలు పంకించెను, మృగములు మేఁతలు మాని స్తబ్ధము లయ్యెను, ఆకసమునం దచ్చరలేమలు, కిన్నరకాంతలు, నిలిచి సంతసాశ్చర్యములతో నివ్వెరపడి చూచుచుండిరి. వేయు నేల? తుంబురునారదాదులు తాము కొంతకాల మామెకడ సంగీతవిద్య నభ్యసించిన మంచిదనుకొనిరి.

ఇట్లుండ, శ్రీపర్వతేశ్వరుఁడు స్థాణువు—భూతేశుఁడు—నైనను, సామగానలోలుఁ డగుటచేతను, నటరాజగుటచేతను,

జంద్రవతీగానమునకుఁ జొక్కి చంద్రశేఖరుఁడై, నందివాహనా రూఢుఁడై యామెకు బ్రత్యక్ష మయ్యెను.

అట్లు ప్రత్యక్షమైన శంకరుం జూచి చంద్రవతి తన్ను ధన్యంగాఁ దలంచుకొనుచు సాష్టాంగనమస్కృతు లొనరించి యిట్లు నుతించెను.

"శ్రీకంఠ! లోకేశ! లోకోద్భవ స్థాన సంహారకారి! పురారి! మురారిప్రియ! చంద్రధారి! మహేంద్రాదిబృందార కానందసందోహసంధాయి! భవానీపతీ! భూ మ్యాకాశ నీ రాగ్ని వైర్యాద్యష్ట పుణ్యరూప! నమస్తే నమస్తే నమస్తే! నన్నుఁ గాపాడవే! నాదుపాపంబులం బోకార్పవే" అని వేడెను.

ఆచంద్రవతిస్తుతుల కానందింపుచు నీశానుఁడు, 'భద్రా! నీతపం బత్యద్భుతంబు, ఋషులకైన నిట్టిది దుష్కరంబు, నీవొన ర్చిన పూజ యంతకంటెను దుర్లభంబు, ఈరెండింటికంటె నీగాన మపూర్వము; ఆగానముచే నాకు నివాసమగు నీపర్వతపుశిలలు ద్రవీభూతములై కృష్ణానదీప్రవాహము నినుమడింపఁ జేసెను. నీ భక్తికి మెచ్చితిని. నీకేమి కావలయునో యడుగు' మనెను.

వరదుఁ డగు నీశునికారుణ్యోక్తులకుఁ జంద్రవతి యానం దించి "దేవా! నాకు నీపాదభక్తి నిరంతర ముండునట్లును, సత్యము, అహింస, భూతదయ నన్నెప్పు డెడఁబాయకుండున ట్లును, నాతండ్రి యగు చంద్రగుప్తుఁడు ధర్మపథముఁ దప్పక న్యాయమార్గగామి యగునట్లును, ఇతఃపూర్వ మాతఁ డొన ర్చిన, 'మనోవాక్కాయ' దురితము లన్నఁడి తొలఁగునట్లును,

వరము లిమ్ము; పరేశా! నే నార్యావర్తవాసి నయ్యు నిదక్షిణా పథమునకు వచ్చి నిన్నర్చించితిని. అందులకుఁ జిహ్నమగునట్లీ శ్రీశైల, మార్యుల సత్కర్మముల స్మరింపఁబడవలయును. 1. నిన్ను నే 'నర్జునమల్లికాపుష్పములచేఁ' బూజించితిని గాన నీవు 'మల్లికార్జున' నామధారివై యుండవలయు, నివియె నాకోరిక" లనెను.

పర్వతేశుఁ డామె కోరినవరము లన్నియు నిచ్చి యంతర్హితుఁ డయ్యెను. నాఁటినుండియు పర్వతేశుఁడు మల్లికార్జునుఁ డయ్యెను. అట, చంద్రగుప్తుఁడును బెక్కేండ్లు, 'వంగ, పాంచాల సౌరాష్ట్రా'ది శత్రుదేశములలో యుద్ధము లొనర్చి విజయము లంది, రాజధాని కేతెంచి, కుమారియగు చంద్రవతి తన కారణమున 'యోగిని'యై దేశాంతరగత యయ్యెనని విని, చింతించి పశ్చాత్తప్తుఁడై, సన్యాసాశ్రమ మవలంబించి కుమారిని వెదకుచు శ్రీశైలముఁ జేరి మహాయోగినియగు చంద్రవతిం జూచి మెచ్చితానును దపం బొనరించి ముక్తుఁ డయ్యెను.

కొందఱు చంద్రగుప్తుఁడు జైనసన్యాసి యగు భద్రబాహుఁడను వానియుపదేశముచే 'శ్రవణ బెళగోళము' అను జైనక్షేత్రమున తపం బొనరించి ముక్తుఁ డయ్యె నందురు

---

1 దక్షిణాత్య ద్విజులు సత్కర్మములందుఁ దాము శ్రీశైలమున కేదిక్కునను౦దురో యాదిక్కును జేర్కొందురు గోదావరీమండలవాసులు 'శ్రీశైలస్యైశాన్యదిగ్భాగే' యనియు, మద్రాసీయులు, 'శ్రీశైలస్యాగ్నేయ దిగ్భాగే' యనియు నిట్లే యితరస్థద్విజులును నాయాదిక్కులను జెప్పుదురు.

సంపూర్ణము.